అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

మరణ శిక్ష రద్దు
సూర్యాపేట కోర్టు తీర్పును
రద్దుచేసిన హైకోర్టు

ఆదాయానికి మించి ఆస్తులు..
జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై కేసు
04

సంపుటి 09, సంచిక: 56 | శనివారం | 24-01-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో
# 7 గంటలు విచారణ

### మాజీమంత్రి కెటిఆర్‌పై సిట్ అధికారుల ప్రశ్నల వర్షం?

- విచారణ ముగిసినట్లు వెల్లడించిన దర్యాప్తు అధికారులు
- పూర్తి విచారణ తరువాత చట్టపరమైన చర్యలు
- త్వరలో కెసిఆర్‌కు నోటీసులు?
- అడిగిన ప్రశ్నలే అడుగుతున్నారు : కెటిఆర్

**కీలక ఆధారాలు లభ్యం : సజ్జనార్** 02

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారకరామారావుకు సంబంధించి విచారణ ముగిసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటలకు విచారణ నిమిత్తం కెటిఆర్ జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 6:30 గంటల వరకు సిట్ అధికారులు కెటిఆర్‌ను సుమారు 7 గంటల పాటు విచారించారు. కేసుకు సంబంధించి ఇప్పటికే సేకరించిన ఆధారాలు, సాంకేతిక నివేదికలు, పత్రాల ఆధారంగా కేటీఆర్‌ను ప్రశ్నించిన అనంతరం విచారణను ముగించినట్లు అధికారులు వెల్లడించారు. విచారణ సందర్భంగా కేసుకు సంబంధించిన పలు అంశాలపై స్పష్టత కోరినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పాత్ర ఉందా? నిర్ణయాలు ఎలా తీసుకున్నారు? అప్పటి పరిపాలనా ప్రక్రియలు ఏమిటి? వంటి అంశాలపై ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. కెటిఆర్ తన వాంగ్మూలాన్ని నమోదు చేసిన అనంతరం తరువాయి 2లో



# దేశాన్ని నడిపేది విజ్ఞానం, పరిశోధనలే

- వీటికి, వ్యవసాయానికి ఎంతో అవినాభావ సంబంధం
- వ్యవసాయ ఆధారిత దేశానికి వ్యవసాయ కళాశాల ఆవశ్యకత ఉంది
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడి
- హుజూర్‌నగర్‌లో వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన
- రైతులకు రూ. రెండుకోట్లకు పైగా విలువైన వ్యవసాయ యాంత్రికీకరణ పరికరాల ప్రొసీడింగ్స్ అందజేత

ప్రజాపక్షం/సూర్యాపేట (మఠంపల్లి)

దేశానికి వెన్నుదన్నుగా వ్యవసాయ కళాశాల నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. దేశాన్ని ముందుకు నడిపించేది విజ్ఞానం పరిశోధనలేనని చెప్పారు. వీటికి వ్యవసాయానికి ఎంతో అభినాభావ సంబంధం ఉందని అన్నారు. వ్యవసాయాధారిత దేశానికి వ్యవసాయ కళాశాల ఆవశ్యకత ఎంతో ఉందని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని మగ్దూమ్‌నగర్‌లో 100 ఎకరాలలో రూ.150 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ కళాశాలకు, కోదాడ నియోజక వర్గ కేంద్రంలో నెలకొల్పనున్న జవహర్ నవోదయ విద్యాలయం, మట్టపల్లి శ్రీలక్ష్మి నృసింహా స్వామి దేవాలయ సన్నిధిలో రూ. 1 కోటి వ్యయంతో నిర్మించనున్న వసతి గృహం, వంటశాలను ఆయన శుక్రవారం మట్టపల్లి శ్రీలక్ష్మి నృసింహా స్వామి సన్నిధిలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ అన్నదాతకు అండగా నిలబడే వ్యవసాయ కళాశాలకు శంఖుస్థాపన వసంత పంచమి రోజున జరుపడం శుభసూచకమన్నారు. గంగ, యమున, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం మట్టపల్లిలో శంభు లింగేశ్వర స్వామి దేవాలయం ఉండడం తరువాయి 2లో



వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా

## లామ్ తిరిగి ఎన్నిక

**హనోయ్:** కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ వియత్నాం (సిపివి) ప్రధాన కార్యదర్శిగా టో లామ్ మరోసారి ఎన్నికయ్యారు. వియత్నాం రాజధాని హనోయ్‌లో జరిగిన సిపివి 14వ జాతీయ మహాసభ ఆయనను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది. మహాసభ ముగిసిన వెంటనే శుక్రవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీ మీడియా సమావేశంలో టో లామ్ మాట్లాడుతూ ఈ మహాసభ పార్టీ 96 సంవత్సరాల చరిత్రలో, వియత్నాం దేశం సహస్రాబ్ది సుదీర్ఘ సాంస్కృతిక, వీరోచిత ప్రయాణంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. శాంతియుత, స్వతంత్ర, ప్రజాస్వామ్య, సంపన్న, నాగరిక, ఆనందదాయక వియత్నాంను నిర్మించడం, సోషలిజం వైపు స్థిరంగా ముందుకు సాగడాన్ని మహాసభ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పార్టీలోని సుమారు 5.6 మిలియన్ల సభ్యులకు అత్యుత్తమ ప్రతినిధులు అని, సమగ్రత, నైతికత, విశ్వసనీయత, సామర్థ్యం మరియు వృత్తిపరమైన సామర్థ్యం యొక్క కఠినమైన ప్రమాణాలను వారు పాటిస్తున్నారని ఆయన అన్నారు.

బిఆర్‌ఎస్ హయాంలో

## మూడు నెలల్లో 547 ఫోన్ల ట్యాప్

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో కేవలం మూడు నెలల్లో 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ నేపథ్యంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తనను వ్యక్తిగత హననం చేస్తున్నారనడం హాస్యాస్పదమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం ఆయన తరువాయి 2లో

కెసిఆర్ కుటుంబాన్ని

## ఎందుకు అరెస్ట్ చేస్తలే?

కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/కరీంనగర్



ఫోన్ ట్యాపింగ్ తోపాటు అనేక అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడినప్పటికీ కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేనేలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీకి ముడుపులు కోసమే ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో సాగదీస్తున్నారని అన్నారు. విచారణ పేరుతో హడావుడి చేసినప్పుడల్లా ఫాంహౌజ్ నుండి ఎఐసిసికి ముడుపులు వెళుతున్నాయని తరువాయి 2లో



ఎంజి నరేగా

## కొనసాగించాల్సిందే

తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

**చెన్నై :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రజల జీవనోపాధిని కాపాడటానికి 'ఎంజి నరేగా' కొనసాగించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం తమిళనాడు అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్రం ప్రవేశపెట్టిన తాజా గ్రామీణ ఉపాధి పథకం 'విక్షిత్ భారత్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) (విబి– జి రామ్ జి) గురించి స్టాలిన్ మాట్లాడుతూ 'ప్రతిపాదిత కొత్త పథకం ఎంజి నరేగా స్థానంలోకి వస్తుందని, భారతదేశం అంతటా గ్రామీణ ప్రజల జీవనోపాధిని, రాష్ట్రాల ఆర్థిక నిర్మాణాన్ని, స్థానిక సంస్థల స్వావలంబనను, గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలను దెబ్బతీసే విధంగా రూపొందించబడింది' అని అన్నారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అయినా లేదా ప్రజల జీవనోపాధిని పెంపొందించే పథకం అయినా, అన్ని కార్యక్రమాలు తమిళనాడులో వివక్ష లేకుండా సమర్థవంతంగా అమలు చేయబడ్డాయని స్టాలిన్ గుర్తించారు. 'అనేక కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులలో, తమిళనాడు తరువాయి 12లో

## మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు



గాంధీని మర్చిపోయేలా చేస్తున్నారు

కాంగ్రెస్ విమర్శలు

05

## వస్త్రరంగంలో సమస్యలు పరిష్కరించండి

అమెరికా సుంకాలు వస్త్ర ఎగుమతిదారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయ్

ఈ అంశంపై మోదీజీ దృష్టి సారించాలి : రాహుల్‌గాంధీ



## భూభాగమే కీలకం

ఉక్రేన్‌తో శాంతి ఒప్పందంపై ట్రంప్ ప్రతినిధులతో పుతిన్ చర్చలు

**మాస్కో:** ఉక్రేన్‌లో శాంతి ఒప్పందం కుదరాలంటే భూభాగ సమస్యకు పరిష్కారం తప్పనిసరి అని క్రెమ్లిన్ స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతినిధులతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాస్కోలో గురువారం అర్ధరాత్రి మొదలై శుక్రవారం తెల్లవారుజాము 3 గంటల వరకు సాగిన సుదీర్ఘ చర్చల్లో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలిపింది. ట్రంప్ ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లతో జరిగిన సమావేశంలో పాల్గొన్న క్రెమ్లిన్ విదేశాంగ సలహాదారు యూరీ ఉషకోవ్ మాట్లాడుతూ, భూభాగ సమస్యను పరిష్కరించకుండా దీర్ఘకాలిక శాంతి ఒప్పందం ఆశించలేం అని పేర్కొన్నారు. రష్యా నుంచి అక్రమంగా తమ భూభాగంలో కలుపుకొన్న ప్రాంతాల నుంచి ఉక్రేన్ సైన్యం వెనక్కు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశం జరిగే కొన్ని గంటల ముందు, దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో ఉక్రేన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీ యూరోప్ దేశాలపై తీవ్ర విమర్శలు చేశారు. రష్యా దాదాపు నాలుగేళ్లుగా సాగిస్తున్న సంపూర్ణ దాడికి యూరోప్ నెమ్మదిగా, విడివిడిగా స్పందిస్తోందని ఆయన ఆరోపించారు. దావోస్‌లో ట్రంప్‌తో భేటీ అనంతరం జెలెన్స్కీ మాట్లాడుతూ, రష్యా ఆక్రమణలో ఉన్న తూర్పు ఉక్రేన్ భూభాగాల భవిష్యత్ స్థితి ఇంకా తేలలేదని, అయితే శాంతి ప్రతిపాదనలు దాదాపు సిద్ధంగా ఉన్నాయి అని అన్నారు. కాగా, శుక్రవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని తరువాయి 12లో

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ

# సమాన అభివృద్ధి

- పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనపైనే దృష్టి
- రీజినల్ రింగ్‌రోడ్ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్
- సొంతింటి కల నెరవేర్చేలా అన్నివర్గాలకు అందుబాటులో ధరలు
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి చేస్తూ పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అంశాలపై ప్రధాన దృష్టి సారించామని, పొల్యూషన్ ఫ్రీ సిటీ అంశాన్ని దృష్టిలో పెట్టుకున్నామని, ఈ అంశంపై మంత్రి వర్గంలో కూడా చర్చించి తగిన నిర్ణయాలను తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. 'తెలంగాణ రైజింగ్–2047' అనే స్పష్టమైన విజన్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యమన్నారు. హైదరాబాద్ వేదికగా తరువాయి 12లో

మేడారం జాతరకు కేంద్ర నిధులు

## రూ.3.70 కోట్లు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్ల 70 లక్షల నిధులను విడుదల చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖలు ఈ నిధులను మంజూరు చేశారు. కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో 'గిరిజన సర్క్యూట్' పథకం అమలు చేస్తోంది. ఈ క్రమంలో గతంలోనే రూ.80 కోట్ల వ్యయంతో ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం తదితర ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులను తరువాయి 2లో

వేతన సవరణలకు...

## కేంద్రం ఆమోదం

జనరల్ ఇన్సూరెన్స్, నాబార్డ్, ఆర్‌బిఐ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (పిఎస్‌యు) జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు, నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) సంస్థలకు తగిన వేతన సవరణలు, అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ), నాబార్డు నుండి పదవీవిరమణ చేసిన వారికి పెన్షన్ సవరణలను ఆమోదించింది. మొత్తం 46,332మంది ఉద్యోగులు, 23,570మంది పెన్షనర్లు, 23,260మంది కుటుంబ పెన్షనర్లు తరువాయి 12లో



## కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో
# హ్యాట్రిక్ కొడతాం

- ఎల్‌డిఎఫ్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బిజెపి అపవిత్ర కలయిక
- మరో విజయమే ఎల్‌డిఎఫ్ లక్ష్యం
- స్థానిక సంస్థల ఫలితాలపై ఆత్మపరిశీలన చేసుకుంటాం
- కోల్పోయిన ఓట్లను తిరిగి పొందేందుకు కృషి
- సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినొయ్ విశ్వం

(బొమ్మగాని కిరణ్‌కుమార్)

ఏప్రిల్‌లో జరిగే కేరళ శాసనసభ ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) హ్యాట్రిక్ విజయాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మంత్రి బినొయ్ విశ్వం అన్నారు. బిజెపి ప్రభంజనమని బిజెపి, జాతీయ మీడియా చేస్తున్న ప్రచారం బూటకమేనని, నిజానికి గత ఎన్నికల్లో బిజెపికి లభించిన ఓట్లు, స్థానాలు తగ్గిపోయాయని, అవి వామపక్షాలకే వచ్చాయని తెలిపారు. సాంప్రదాయంగా ఎల్‌డిఎఫ్‌కు మద్దతిచ్చే మైనారిటీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో యుడిఎఫ్ వైపు మొగ్గు చూపడంతో ఆశించిన ఫలితాలు రాలేదని పేర్కొన్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన సిపిఐ జాతీయ సమితి సమావేశాలకు హాజరైన బినొయ్ విశ్వంతో ప్రత్యేక ఇంటర్వ్యూ.

**ప్రశ్న : కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్షాలను తామే ఓడించినట్లు బిజెపి ప్రచారం చేసుకుంటుంది కదా?**

బినొయ్ : నిజానికి ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపినే ఎల్‌డిఎఫ్ ఓడించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఒక్క త్రిస్సూర్ నియోజకవర్గంలోనే గెలిచింది. ఆ స్థానంలో సైతం స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి 2.5 లక్షల ఓట్లను కోల్పోగా, వామపక్షాలు ఆ ఓట్లను సాధించాయి. అలాగే త్రిస్సూర్ పరిధిలోని 12 అసెంబ్లీ సెగ్మెంట్లలో అంతటా బిజెపి వెనుకబడింది.అలాగే చారిత్రక దేవాలయం నెలవైన కొడంగలూరులో ఎల్‌డిఎఫ్ ఘన విజయం సాధించింది. అయ్యప్ప స్వామి జన్మస్థలిగా చెప్పబడే పందాళం మున్సిపాలిటీలో గత ఎన్నికల్లో బిజెపి గెలువగా, ఈ సారి ఆ పార్టీని ఎల్‌డిఎఫ్ ఓడించింది. పట్టణంథిట్ట మున్సిపాలిటీతో సహా శబరిమల వార్డులో కూడా ఎల్‌డిఎఫ్ విజయం సాధించింది. బిజెపి తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను మాత్రమే గెలుచుకొంది. అది కూడా పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేయడం ద్వారా, అక్రమాలకు పాల్పడడం ద్వారా సాధ్యమైంది.కానీ, రాష్ట్ర వ్యాప్తంగా వారికేమి మంచి ఫలితాలు రాలేదు. భారతదేశంలో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కేరళ కాబట్టి, ఇక్కడేదో జరిగిపోయినట్లు జాతీయ మీడియా, బిజెపి తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే మేమే బలంగా ఉన్నాం.

**ప్రశ్న: ఈ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ఆశించిన ఫలితాలు సాధించకపోడంపై మీ విశ్లేషణ?**

బినొయ్ విశ్వం : ప్రజలు తమ తరువాయి 3లో

# ఈ ఏడాది చివరి నాటికి ట్రంప్ చైనా పర్యటన!



**వాషింగ్టన్ :** ఈ ఏడాది చివరి నాటికి చైనాలో పర్యటనకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెళ్లనున్నట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొనకపోయినప్పటికీ, అమెరికాలో 'టిక్‌టాక్' వ్యాపారాన్ని ఒరాకిల్, సిల్వర్ లేక్, అబుదాబీకి చెందిన ఎంజిఎక్స్‌తో కూడిన జాయింట్ వెంచర్‌కు బదిలీ చేసే ఒప్పందానికి చైనా ఆమోదం లభించడం పట్ల ట్రంప్ సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకుగాను ఆయన చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందాన్ని 'టిక్‌టాక్‌ను రక్షించిన చర్య'గా ట్రంప్ అభివర్ణించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో యువత మద్దతు తనకు దక్కడానికి టిక్‌టాక్ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ఈ డీల్‌ను ముందుకు తీసుకెళ్లినందుకు ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ సహా తన బృందాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ గురించి మాట్లాడుతూ, 'ఆయన వేరే దారి ఎంచుకోవచ్చు. కానీ అలా చేయలేదు. ఈ నిర్ణయాన్ని అభినందిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలలో పాల్గొన్న ఆయన, స్వదేశానికి వెనుదిరిగినప్పుడు, మార్గమధ్యంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈ ఏడాది చివర్లో చైనాకు వెళ్లి జిన్‌పింగ్‌ను కలిసే అవకాశం లేకపోలేదని తెలిపారు. జిన్‌పింగ్‌తో తనకు ఎప్పుడూ సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో అమెరికా–చైనా సంబంధాలు ఉద్రిక్తంగా మారినప్పటికీ, ఇప్పుడు అవి మెరుగుపడ్డాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనా పెద్ద మొత్తంలో అమెరికా సోయాబీన్స్ కొనుగోలు చేస్తోందని, ఇది అమెరికా రైతులకు లాభదాయకమని అన్నారు. కాగా, అమెరికా ఖజానా కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ ప్రకారం, ఈ ఏడాది చివరిలోగా ట్రంప్, షీలు నాలుగు సార్లు కూడా భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే ఆయన వివరాలు వెల్లడించలేదు. ట్రంప్, జిన్‌పింగ్ చివరిసారిగా గత ఏడాది అక్టోబర్‌లో దక్షిణ కొరియాలోని బుసాన్‌లో ఏపెక్ సదస్సు సందర్భంగా కలిశారు.

# కెనడాకు 'బోర్డ్ ఆఫ్ పీస్' ఆహ్వానం ఉపసంహరణ

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కెనడాకు ఇచ్చిన 'బోర్డ్ ఆఫ్ పీస్' ఆహ్వానాన్ని ఉపసంహరించుకున్నారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తన ట్రూత్ సోషల్ వేదికపై ప్రకటించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ చేసిన ఘాటు ప్రసంగం అనంతరం ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ మీడియాను ఉటంకిస్తూ పిటిఐ కథనం ప్రకారం, ఈ నిర్ణయానికి కారణాలను ఆయన వివరించకపోయినప్పటికీ, కార్నీ వ్యాఖ్యలే నేపథ్యమని స్పష్టమవుతున్నది. దావోస్‌లో ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్'ను ఆవిష్కరించిన కొద్ది గంటలకే, కెనడా ఈ బోర్డులో చేరదని సూచించేలా ఆహ్వానాన్ని రద్దు చేశారు. ఇది చరిత్రలోనే 'అత్యంత ప్రతిష్ఠాత్మక నేతల బోర్డు' అంటూ ట్రంప్ తన శైలిలో ఘనంగా ప్రకటించారు. అయితే, దావోస్ పర్యటన అనంతరం కార్నీపై ట్రంప్ బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కెనడాకు మేం చాలా ఉచితాలు ఇస్తున్నాం. వాళ్లు కృతజ్ఞతగా ఉండాలి. కానీ వాళ్ల ప్రధాని నిన్న మాట్లాడిన తీరు అలాంటిది కాదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతకు ముందు దావోస్‌లో కార్నీ చేసిన ప్రసంగం అసలు మంట పెట్టింది. ట్రంప్ ప్రతిపాదనను నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ, నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను కల్పిత కథగా అభివర్ణించారు. మహాశక్తులు తాము పాటించని నియమాలను ఇతరులపై రుద్దుతున్నాయని అన్నారు. ఇప్పుడు యావత్ ప్రపంచం మార్పు కోరుతున్నదని కార్నీ స్పష్టం చేశారు. ఆర్థిక ఏకీకరణను ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్న ట్రంప్, టారిఫ్‌లను ఒత్తిడి సాధనంగా వాడుతున్నాయని విమర్శించారు. కార్నీ ప్రసంగానికి సభలో 'స్టాండింగ్ ఒవేషన్' లభించింది. ఈ పరిణామాలు ట్రంప్‌ను ఆగ్రహానికి గురి చేశాయని అర్థమవుతున్నది. ఇలా ఉంటే, ట్రంప్ ప్రకారం 59 దేశాలు ఈ బోర్డుకు అంగీకరించాయి. కానీ దావోస్‌లో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమానికి కేవలం 19 దేశాల ప్రతినిధులే హాజరయ్యారు. ప్రతి దేశం ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాల్సిన ఈ బోర్డు, ఇప్పటికీ బలపడలేదు. ఈ బోర్డు రాజకీయ అంశాలను ఎక్కువగా ప్రస్తావిస్తూ, వాస్తవాలను మరుగున పెడుతున్నదన్న విమర్శలు కూడా మొదలయ్యాయి. భారత్ సహా చైనా, రష్యా, ఉక్రెయిన్ వంటి కీలక దేశాలు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దావోస్ మీడియా సమావేశానికి కూడా భారత్ దూరంగా ఉంది. ఈ కమిటీలో చేరవద్దని దేశంలోని పలు రాజకీయ పార్టీలు భారత ప్రభుత్వాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. సిపిఐ సహా ఐదు వామపక్ష పార్టీలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ, ఒక సంయుక్త ప్రకటనను కూడా విడుల చేశాయి. ఒకవైపు సమస్యలు, విమర్శలు పెరుగుతుంటే, మరోవైపు కార్నీ విమర్శలు గుప్పించడం ట్రంప్‌ను అసహనానికి గురి చేసినట్టు కనిపించింది. ఆర్థిక ఫోరమ్ సమావేశానికి హాజరైన అత్యధిక శాతం దేశాలు కార్నీ వాదనకు సమర్థనగా చప్పట్లు కొట్టడాన్ని కూడా ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే, కెనడాకు ఇచ్చిన ఆహ్వానాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు.




# జపాన్ పార్లమెంట్ రద్దు

## మూడు నెలల్లోనే ఎన్నికలకు టకైచి నిర్ణయం



**టోక్యో:** జపాన్ ప్రధాని సనాయే టకైచి శుక్రవారం పార్లమెంట్ దిగువ సభను రద్దు చేశారు. దీంతో ఫిబ్రవరి 8న స్నాప్ ఎన్నికలు జరగనున్నాయి. అధికారంలోకి వచ్చి కేవలం మూడు నెలలకే ఈ నిర్ణయం తీసుకోవడం జపాన్ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నిర్ణయం ద్వారా తన ప్రజాదరణను ఉపయోగించుకుని అధికార పార్టీ లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) కోల్పోయిన రాజకీయ బలాన్ని తిరిగి సంపాదించాలన్నదే టకైచి లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొనేందుకు, ధరల పెరుగుదలను నియంత్రించేందుకు రూపొందించిన కీలక బడ్జెట్‌పై ఓటింగ్ మాత్రం వాయిదా పడనుంది. అక్టోబర్‌లో జపాన్ తొలి మహిళా ప్రధానిగా ఎన్నికైన టకైచికి ప్రస్తుతం సుమారు 70 శాతం అనుకూలత రేటింగ్ ఉంది. మూడు నెలల స్వల్ప కాలంలోనే ఆమెకు లభించిన ఈ ప్రజాదరణను రాజకీయంగా మలచుకోవాలన్న ఉద్దేశంతోనే ముందస్తు ఎన్నికలకు వెళ్లారని విశ్లేషకులు భావిస్తున్నారు. 465 మంది సభ్యులున్న దిగువ సభ రద్దుతో, ఈనెల 27వ తేదీ, మంగళవారం నుంచి, 12 రోజుల అధికారిక ఎన్నికల ప్రచారం ప్రారంభం కానుంది. కాగా, దిగువ సభలో మరింత బలమైన మెజారిటీ సాధించడమే టకైచి ముందస్తు ఎన్నికల లక్ష్యం. 2024లో జరిగిన ఎన్నికల్లో పరాజయం కారణంగా ఎల్‌డిపి–మిత్రపక్ష కూటమికి దిగువ సభలో స్వల్ప మెజారిటీ మాత్రమే ఉంది. ఎగువ సభలో అకూటమికి అసలు మెజారిటీయే లేదు. అందువల్ల కీలక చట్టాలు, విధానాల అమలుకు ప్రతిపక్షాల మద్దతుపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో బడ్జెట్ ఆమోదంలో జాప్యం చోటుచేసుకోగా, ప్రతిపక్ష నేతలు టకైచిపై విమర్శలు గుప్పించారు. దీనిపై స్పందించిన టకైచి, ప్రజలే దేశంలో సార్వభౌములని, తాను ప్రధాన మంత్రిగా కొనసాగాలా? వద్దా? అనేది వారే నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు. 'ఈ ఎన్నికల కోసం నా ప్రధానమంత్రి పదవినే ఫణంగా పెట్టుతున్నాను' అని చెప్పారు.

# వెనిజులా చమురు రంగంపై అమెరికా ఆధిపత్యం!

## సంస్కరణల బిల్లుపై కీలక చర్చ ప్రారంభం

**కారకాస్:** వెనిజులా చమురు నిక్షేపాలపై కన్నేసిన అమెరికా, తనకు అనుకూలించే విధానాలు అమలయ్యేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. వెనిజువెలాలో చమురు రంగంలో ప్రభుత్వ నియంత్రణను సడలించే కీలక బిల్లుపై దేశ పార్లమెంట్ చర్చ ప్రారంభించడం ఈ ప్రయత్నంలో భాగంగానే పేర్కోవచ్చు. ఈ బిల్లు చట్టరూపంలోకి వస్తే, విదేశీ పెట్టుబడులు పెరుగుతాయని, ప్రైవేట్ కంపెనీలకు స్వేచ్ఛ, తక్కువ పన్నులు, అంతర్జాతీయ న్యాయ భరోసా ఇవ్వడంతో పెట్టుబడిదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని ప్రభుత్వం పేర్కొంటున్నప్పటికీ, ఇది ముమ్మాటికీ అమెరికాకు ఎక్కువగా ఉపయోగపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. 2007లో అప్పటి సోషలిస్టు నేత హ్యూగో చావెజ్ చమురు పరిశ్రమను జాతీయీకరించిన తర్వాత, ఇది తొలి పెద్ద సంస్కరణగా భావిస్తున్నారు. ఈ బిల్లు ప్రైవేటు కంపెనీలు చమురు రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు, పెట్టుబడి వివాదాలను అంతర్జాతీయ న్యాయస్థానాల్లో పరిష్కరించుకునే వెసులుబాటును ఇస్తుంది. ఈ నెల ఆరంభంలో మాజీ అధ్యక్షుడు నికోలాస్ మదురోను అమెరికా అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ట్రంప్ ప్రభుత్వం మదురో అనుచరులు, తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఆయిల్ కంపెనీలకు వెనిజువెలా చమురు రంగంలో పెద్ద పాత్ర కల్పించాలనే దిశగా ఈ ఒత్తిడి సాగుతోంది. అసోసియేటెడ్ ప్రెస్ (ఎపి) కథనం ప్రకారం, బిల్లుకు సంబంధించిన ముసాయిదాలోని అంశాలు చావెజ్ అమలు చేసిన 'వనరుల జాతీయవాదం' అనే భావనకు భిన్నమైనదిగా కనిపిస్తున్నది. అప్పట్లో చావెజ్ బహుళజాతి సంస్థలు వలస దోపిడీ చేస్తున్నాయని విమర్శించి, చమురు సంపదను ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించారు. కొత్త బిల్లు ప్రకారం, ప్రైవేటు కంపెనీలు ప్రభుత్వ చమురు సంస్థలో తక్కువ వాటాదారులుగానే ఉన్నప్పటికీ, చమురు క్షేత్రాలను స్వతంత్రంగా నిర్వహించడానికి, తమ ఉత్పత్తిని తామే మార్కెట్ చేయడానికి, నగదు ఆదాయాన్ని నేరుగా పొందడానికి అనుమతి ఉంటుంది. కార్యకలాపాల అమలుకు సంబంధించిన పూర్తి బాధ్యత, ఖర్చు, ప్రమాదం నిర్వహణ కంపెనీదే, అని బిల్లులో పేర్కొంది. ప్రభుత్వ బాధ్యతలు నెరవేర్చిన తర్వాత ఉత్పత్తిలోని కొంత భాగాన్ని కంపెనీలు నేరుగా విక్రయించుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. ముఖ్యంగా, చట్టపరమైన వివాదాలను కేవలం స్థానిక న్యాయస్థానాల్లో కాకుండా అంతర్జాతీయ న్యాయస్థానాల్లో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఈ బిల్లు ఇస్తుంది. ప్రస్తుతం ఉన్న 30 శాతం రాయల్టీ రేటును కొనసాగించినప్పటికీ, ఖర్చుతో కూడిన లేదా అభివృద్ధి కష్టమైన చమురు ప్రాజెక్టుల కోసం రాయల్టీలు, పన్నులను 15 శాతం వరకు తగ్గించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఈ అంశాలన్నీ అమెరికా వంటి దేశాలకు మేలు చేస్తాయన్న వాదన బలంగా వినిపిస్తున్నది. అమెరికాకు చెందిన చమురు కంపెనీలకు వెనిజువెలాలో నేరుగా ఆ రంగంలోకి ప్రవేశించే హక్కు లభిస్తుంది. పపంచ చమురు సరఫరా పెరిగితే, ధరలు స్థిరపడతాయి.. ఇది అమెరికా వినియోగదారులకు లాభం. అంతర్జాతీయ చమురు విపణిలో చైనా, రష్యా వంటి దేశాల ప్రభావాన్ని తగ్గించాలన్న అమెరికా ప్రయత్నాలకు ఈ బిల్లు అనుకూలిస్తుందని విమర్శకుల అభిప్రాయం. వెనిజులా పార్లమెంటు తీసుకోబోయే నిర్ణయంపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.





సింగపూర్ ఎయిర్‌షో 2026 కోసం సిద్ధమవుతున్న భారత వైమానిక దళం 'సారంగ్' హెలికాప్టర్ డిస్‌ప్లే టీమ్. ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు చాంగి ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగే ప్రదర్శనలో ప్రపంచ ప్రఖ్యాత సైనిక, వాణిజ్య వైమానిక బృందాలతో కలిసి తన ఖచ్చితమైన విమాన విన్యాసాలతో ప్రేక్షకులను ఆకట్టుకోనుంది.

## 7గంటలు విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన వివరాలను అధికారులకు అందించినట్లు వర్గాలు చెబుతున్నాయి.ఈ కేసులో తదుపరి దశలో ఇతర కీలకుల పాత్రపై దృష్టి సారించనున్నట్లు అధికారులు సంకేతాలు ఇచ్చారు. సాంకేతిక నిపుణుల నివేదికలు, డిజిటల్ ఆధారాలపై మరింత విశ్లేషణ చేపట్టి, అవసరమైతే మరికొందరిని విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, దర్యాప్తు పారదర్శకంగా సాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. విచారణ పూర్తైన అనంతరం చట్టపరమైన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ పేరుపై వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల విషయంపై కూడా సిట్ అధికారులు కెటిఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. అవసరమైతే కెటిఆర్‌తో పాటు హరీష్‌రావును మరో సారి విచారించే అవకాశాలు లేకపోలేదు.

**త్వరలో కెసిఆర్‌కు నోటీసులు..?**

ఫోన్‌ట్యాపింగ్ కేసులో చివరగా లబ్ది పొందింది టిఆర్ఎస్ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అని దర్యాప్తు అధికారులు ఒక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో హరీష్‌రావు, కెటిఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారించినట్లుగానే సిట్ అధికారులు కెసిఆర్‌కు కూడా త్వరలో నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని అనుమానాలు కలుగుతున్నాయి. అందుకు కావాల్సిన చట్టపరమైన అంశాలను న్యాయనిపుణులతో సిట్ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**అడిగిన ప్రశ్నలనే అడుగుతున్నారు : కెటిఆర్**

'ఫోన్ ట్యాపింగ్ అంశం ఒక సీరియల్‌గా కొనసాగిస్తున్నారని, అడిగిన ప్రశ్నలనే అడుగుతున్నారని, 300ల పేర్లను చదువుతూ వారు 'మీకు' తెలుసా అంటూ 8 గంటల పాటు కాలక్షేపం చేయడం తప్ప, అక్కడ(సిట్ విచారణ) విషయమే లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు వివరించారు. తనను సాక్షిగా పిలిచారా? లేదా మరేదైనా కారణంతోనా? అనేది తనకు తెలియదని, కానీ, వాళ్ళు(సిట్ ) మాత్రం అడిగిందే అడుగుతున్నారని తెలిపారు. సిట్ విచారణ అనంతరం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ ఏదో ఒక కథను సృష్టించి, ప్రజలను భ్రమింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పోలీసు వ్యవస్థను సిఎం రేవంత్ రెడ్డి ఉపయోగించుకున్నారని ఆరోపించారు.

తాము ఒక రాజకీయ పార్టీగా, బాధ్యత గల ప్రతిపక్షంగా ఏ విచారణకైనా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, 'మీరు ఎన్ని కేసులైనా పెట్టండి, ఎన్ని సిట్‌లనైనా వేయండి' బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా పూర్తి స్థాయిలో చట్టాన్ని గౌరవించే వ్యక్తులుగా సహకరిస్తామని కెటిఆర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చే అడ్డగోలు లీకులను మీడియా ఇష్టానుసారంగా ప్రచురించవద్దని,ఆ లీకులో వాస్తవాలను పరిశీలించాలని కోరారు. ఉక్కిరి బిక్కిరి, ఇన్ని ప్రశ్నలు. అన్ని ప్రశ్నలు అనే లీకు లిస్తారని, రెండేళ్లు అయిపోయిందని, కాలక్షేపం జరగాల్సింది జరిగిందని, ఇప్పటికైనా ఒకటికి రెండు సార్లు లీకులను చెక్ చేసుకోవాలని, తమకు కూడా కుటుంబాలు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారని, తమ నియోజకవర్గాల్లో ఆశలు పెట్టుకున్న ప్రజలు ఉన్నారని, వారంతా బాధపడతారని, అందుకే ఇష్టమొచ్చినట్టుగా అల్లి వార్తలు రాయవద్దని కెటిఆర్ మీడియాను కోరారు. సింగరేణి టెండర్లలో ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య వాటాల పంచాయతీలో దొంగలు దొరికారని,దీనిపైన ఇప్పటి వరకు ఉలుకు,పలుకు లేదని ఆరోపించారు. స్వయంగా రెవెన్యూ మంత్రి కొడుకు భూ కబ్జాలు చేస్తూ గుండాలతో స్వైరవిహారం చేస్తున్నారని దీనిపైన సిట్ వేయాలన్నారు.

## రూ.3.70 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. అలాగే యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లను ఖర్చు చేస్తోంది. మేడారం జాతర సందర్భంగా అమ్మవార్లకు బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం జాతర జరిగే నాలుగు రోజుల పాటు దక్షిణ మధ్య రైల్వే శాఖ 30 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మేడారం జాతర ఏర్పాట్లు మరింత సజావుగా జరుగనున్నాయని అధికారులు తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలు లభ్యం

## పోలీసు కమిషనర్ విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కెటిఆర్‌ను విచారించాము..అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని, కేసుకు సంబంధించిన సాక్షులను సంప్రదించవద్దని, ప్రభావితం చేయవద్దని ఆయనకు సూచించినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నెం.243/2024 కేసులో కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.టి. రామారావు విచారించామన్నారు. కేసుకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన నుంచి వివరాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. సేకరించిన సమాచారాన్ని ఇప్పటికే ఉన్న ఆధారాలతో పోల్చి విశ్లేషిస్తున్నామని వెల్లడించారు. ఈ కేసులో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయవ్యవస్థకు చెందినవారు, ప్రముఖులు సహ వివిధ వర్గాలకు చెందిన వేలాది మంది పౌరులపై అక్రమంగా ఫోన్ నిఘా, ఇంటర్‌సెప్షన్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఫోన్ ట్యాపింగ్ భద్రతా కారణాల వల్లే జరిగిందని, ఎలాంటి అక్రమాలు లేవని కొంతమంది మీడియా వర్గాలు, వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు గమనించామని తెలిపారు. ఇలాంటి అసత్య కథనాలపై దర్యాప్తు సంస్థకు ఎలాంటి ఆసక్తి లేదని, చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, వృత్తిపరంగా విచారణ కొనసాగుతున్నదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి నిర్ధారణ లేని సమాచారం, తప్పుదారి పట్టించే ప్రచారాలను నమ్మవద్దని, అధికారికంగా, చట్టబద్ధమైన మార్గాల్లో విడుదల చేసే వివరాలపైనే ఆధారపడాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## మూడు నెలల్లో 547 ఫోన్ల ట్యాప్

(మొదటి పేజీ తరువాయి)

మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రాజకీయ కక్ష్య సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే బిఆర్ఎస్‌పై చర్యలు ఉండేవని, కానీ తాము అలా చేయలేదని, రాజ్యాంగం ప్రకారం విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హాయంలో సినీ తారల ఫోన్ ట్యాప్ చేయాల్సిన అవసరం ఏముందని మహేష్‌కుమార్ ప్రశ్నించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లు అవుతుందని, ఫోన్ ట్యాపింగ్‌పై కెటిఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. కెటిఆర్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నాయకులు స్టువర్టు పురం దొంగల బ్యాచ్ అని, బట్ట కాల్చి మీద వేసి పారిపోతామంటే కుదరదని, అలీ బాబా 420 దొంగల మాదిరి కెసిఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని మహేష్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దీపం ఆరిపోకుండా 'ఆరనీకుమా ఈ దీపం, కార్తీక దీపం' అంటూ కెటిఆర్ రాగాలు పలుకుతున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై కెటిఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, తోడ బుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే సమాధానం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రమైందని, ఉద్యమ కేసులతో దానిని పోల్చడం సరికాదన్నారు. అధికారులకు పరిమితులు ఉంటాయని, నిష్పక్షపాతంగా విచారణ కొనసాగుతుందని వివరించారు. 'కాళేశ్వరం అవినీతిపై కెసిఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని బండి సంజయ్‌ను సూటిగా ప్రశ్నింస్తున్నామన్నారు.

బిజెపి నేతల ఇడి కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ గురించి బిజెపి నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే శక్తులపై మాత్రమే ట్యాపింగ్ చేస్తారని, కానీ నక్సలైట్లతో లావాదేవీలు జరుపుతున్నారని తనతో పాటు తన మిత్రుడిపై నిఘా పెట్టి ట్యాపింగ్ చేశారని మహేష్‌కుమార్ తెలిపారు. కవితను చెల్లెలుగా తాను ఎప్పుడూ గౌరవిస్తానని, కెసిఆర్ కుటుంబంలో వాటాల పంపకంలో తేడాల వల్లనే తగాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కవిత ఇప్పటికైనా నిజాలు మాట్లాడుతున్నాందుకు స్వాగతిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి ఎఐసిసి ఇంచార్జ్ మార్పు ఉండదని మహేష్‌కుమార్ గౌడ్ ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.

## ఎందుకు అరెస్ట్ చేస్తలే?

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి అన్ని ఆధారాలు, సాక్షాలు పోలీసుల వద్ద ఉన్నాయని, తనను విచారణకు పిలిచిన సమయంలో ఆ ఆధారాలను, సాక్షాలను సైతం చూపించారని తెలిపారు. జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు తేలిందన్నారు. అయినా కెసిఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. కరీంనగర్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ పై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోపాటు కెటిఆర్ అరాచకాలను వివరిస్తూ తీవ్రస్థాయిలో స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ పై సిట్ విచారణ టివి సీరియల్ ను మించి ఆది అంతం లేకుండా కొనసాగుతూనే ఉందని, కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోతున్నారని, సిట్ అధికారులకు స్వేచ్ఛ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వంలో కొందరు పెద్దలు ఆదేశాలకు అనుగుణంగానే విచారణ చేస్తున్నారని, నిజానికి సిట్ అధికారులు సమర్థులు, నిజాయితీపరులని, కానీ వాళ్లపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోందని ఆ పెద్దలు ఎవరిని పిలవమని అడిగితే వాళ్లనే పిలిచి విచారణ చేస్తున్నారనొ ఆరోపించారు. కెటిఆర్ ను ఎందుకు విచారణకు పిలిచారు? ఆయన ఫోన్ ట్యాపింగ్ చేయించినందుకు పిలిచారా? లేక ఆయన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని చెప్పడానికి పిలిచారా? అని ప్రశ్నించారు.

సిరిసిల్ల కేంద్రంగా వార్ రూంను ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేశారని చాలా సార్లు చెప్పానని, కెటిఆర్ ఆడిందే ఆటగా ఫోన్ ట్యాపింగ్ చేయించి పాలనను కొనసాగించారని విమర్శించారు. బ్రిటీష్ పాలన తరహాలో పాలన చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. రియల్ ఎస్టేట్ బిల్డర్లు, వ్యాపారులను, సినీ నటులను బెదిరించి కోట్లు దండుకున్నారు. అసలు కెసిఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని, ఫోన్ ట్యాపింగ్ పేరుతో టైం పాస్ విచారణ చేస్తున్నారని, సిట్ అధికారులకు స్వేచ్ఛనిచ్చి విచారణ జరిగేలా చూడాలని, ప్రభుత్వ వ్యవహారశైలికి విసిగిపోయి సిట్ నుండి తప్పుకునే ప్రమాదముందన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా కెసిఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడం మాకు చేతగాదని, అసమర్థులమని, చేవ చచ్చినోళ్లమని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుని సిబిఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాస్తే అప్పుడు కేంద్రం చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని సంజయ్ తెలిపారు.

**ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

ఫోన్ ట్యాపింగ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. వసంత పంచమి పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీలోని సరస్వతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఈ కేసులో దోషులను శిక్షించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. బిఆర్ఎస్ బాటాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తుందన్నారు. రాష్ట్ర, దేశ ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

## విజ్ఞానం, పరిశోధనలే

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. జిల్లాలో పెద్దఎత్తున వ్యవసాయం సాగు చేయడం ప్రత్యేకంగా పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం గవర్నర్ రైతులకు రూ.2కోట్ల 47లక్షల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాల ప్రొసీడింగ్స్ అందజేశారు. అలాగే స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.504కోట్లు, ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు మరో రూ.89కోట్ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా వరిని పండించడం జరిగిందన్నారు. 85 శాతం మంది పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. మట్టపల్లి అభివృద్ధికి తనవంతు సాయశక్తుల కృషి చేస్తానని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. హుజూర్‌నగర్ నుండి మఠంపల్లి వరకు రూ.80కోట్లతో డబుల్ రోడ్ మంజూరు చేశామని, రాకపోకల కోసం కృష్ణా నదిపై తెలంగాణ ఆంధ్రను కలుపుతూ గతంలో రూ.50కోట్లతో తాను బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కృష్ణ, గోదావరి జలాల హక్కుల కోసమై పోరాడేందుకు ఏ పోరాటానికైనా సిద్ధమని వెల్లడించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గ ప్రజల జీవితాల్లో వెలుగును నింపడమే తమ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటి, ఎఐ కన్నా వ్యవసాయ రంగమే ముందుంటుందని చెప్పారు. సాఫ్ట్‌వేర్, ఐటి సెక్టార్ల నుండి వచ్చి వ్యవసాయ రంగంలో పనిచేసే రోజులు వస్తాయన్నారు. తెలంగాణ దేశానికే వరి అందించే ఏకైక రాష్ట్రంగా మారిందని చెప్పారు. వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. 2 కోట్ల 50లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి తెలంగాణ దేశంలోనే ముందుందన్నారు. ప్రత్యేకంగా పామాయిల్ సాగులో తెలంగాణ ముందుండేలా వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహించాలన్నారు.

ప్రస్తుతం 10లక్షల ఎకరాలలో పామాయిల్ తోటలు పండిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ హల్దాస్ జానయ్య, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో సూర్యాపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసకపోతుందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, కోదాడ, మిర్యాలగూడ, నాగార్జున సాగర్ శాసనసభ్యులు నలమాద ఉత్తమ్ పద్మావతి, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా ఎస్‌పి కె నరసింహ, అదనపు కలెక్టర్ కె సీతారామారావు పాల్గొన్నారు.

**పూర్ణకుంభంతో గవర్నర్ దంపతులకు ఘన స్వాగతం...**

మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మి నృసింహ స్వామి దర్శనానికి వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు అందజేశారు. ఆయన స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి లబ్ధిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకి..
# సాయుధ ప్రతిఘటనకు ప్రతీక.. బోస్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాయుధ ప్రతిఘటనకు ప్రతీకగా నిలిచిన విప్లవ నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ అధినేత, స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో నేతాజీ చిత్రపటానికి పలువురు శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనను కూల్చివేయాలనే సంకల్పంతో, ప్రజల శక్తిపై నమ్మకం ఉంచి ముందుకు నడిచిన విప్లవ ధీరుడు సుభాష్ చంద్రబోస్ అని, ఆయన సామ్రాజ్యవాదం, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటమే నిజమైన స్వాతంత్ర్య మార్గమని స్పష్టంగా గ్రహించారని అన్నారు. జై హింద్ అనే నినాదం ప్రజా ఉద్యమానికి ఆయుధంగా మారిందని, నేతాజీ చూపిన మార్గం కేవలం రాజకీయ స్వాతంత్ర్యానికి మాత్రమే కాకుండా, సామాజిక, ఆర్థిక విముక్తికి కూడా సంకేతమని ఆయన చెప్పారు. నిజమైన స్వాతంత్ర్యం అంటే సామ్రాజ్యవాదం నుంచి విముక్తి మాత్రమే కాదని వర్గ అసమానతలు, దోపిడీ వ్యవస్థల నుంచి విముక్తి కూడా కావాలని నేతాజీ ఆలోచనలు సూచిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గం టి.సత్య ప్రసాద్, కొండల్ చేపూరి, బిజ్జ శ్రీనివాసులు, పేరబోయిన మహేందర్, ఆర్.బాలక్రిష్ణ, సల్మాన్ బేగ్, ఎండి.కుతూబ్, పి.శివ కుమార్, రాజ్ కుమార్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, శ్రీకాంత్, ఆంజనేయులు, కళ్యాణ్, శేఖర్, వెంకటేష్, భగత్ సింగ్, మధుకర్, మహేష్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# జోరుగా అరైవ్ అలైవ్

**రాష్ట్రవ్యాప్తంగా 3,836కు చేరిన చైతన్య కార్యక్రమాలు**

**27 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు : డిజిపి శివధర్‌రెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు ప్రమాదాలను ఘననీయంగా తగ్గించేందుకు యుద్ధప్రాతిపదిక చేపట్టిన 'అరైవ్ అలైవ్' చైతన్య కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా జోరుగా నడుస్తుంది. 13న సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈ నెల 27 వరకు కొనసాగనుంది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్ అలైవ్ చైతన్య కార్యక్రమాలు 3,836కు చేరుకున్నాయి. ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈనెల 20వ తేదీన నిర్మల్ జిల్లాలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిజిపి బి.శివధర్ రెడ్డి స్వయంగా శుక్రవారం నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాల సంఖ్య 3,836కు చేరింది. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా ఈ రోడ్ సేఫ్టీ అవగాహన ప్రచారాన్ని అమలు చేస్తోంది. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతను సామూహిక ఉద్యమంగా మార్చడమే ప్రధాన ఉద్దేశంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతి పౌరుడిలో రోడ్డు భద్రత పట్ల బాధ్యతాభావం పెంపొందించడం, ప్రమాదాలకు దారితీసే నిర్లక్ష్యపు ప్రవర్తనను తగ్గించడం, డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని బలోపేతం చేయడం ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్టం చేస్తూ సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, మీడియా, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలు, న్యాయవ్యవస్థ ప్రతినిధుల భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కొనసాగుతోంది. హెల్మెట్ వినియోగం, సీటుబెల్ట్ ధరించడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం నివారణ, మద్యం సేవించి డ్రైవింగ్‌పై కఠిన చర్యలు, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటో ఓవర్‌లోడింగ్, మీటర్–యూనిఫాం నిబంధనల అమలు, హైబీమ్ లైట్ల దుర్వినియోగం చేయకపోవడం, ఎడమవైపు నుంచి ఓవర్‌టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్ల నిర్మూలన వంటి ప్రాధాన్యత అంశాలను ఆయా కార్యక్రమాల్లో వివరిస్తున్నారు. జిల్లాస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. డివిజన్ స్థాయిలో ఎస్డీపీఓలు, మండల స్థాయిలో సీఐలు, ఎస్సైలు, గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ ట్రాఫిక్ సేఫ్టీ కమిటీల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎన్‌సీసీ ప్రతినిధులు, యువత, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ యజమానులు తదితరులను ఈ ఉద్యమంలో భాగస్వాములుగా చేస్తున్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్, విద్యార్థులు–యువత అవగాహన, గ్రామీణ రోడ్డు భద్రత, మహిళలు–కుటుంబ భద్రత, మద్యం సేవించి వాహనం నడపేవారిపై జీరో టాలరెన్స్, కార్పొరేట్–రవాణా రంగ సహకారం వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## అధికారులను బెదిరించిన కెటిఆర్‌పై చర్యలు తీసుకోండి



డిజిపికి ఫిర్యాదు చేసిన ఎంఎల్‌సి బల్మూరి వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సందర్భంగా అధికారులను బెదిరించారని ఆరోపిస్తూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారకరామారావుతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంఎల్‌సి డాక్టర్ బల్మూరి వెంకట్ డిజిపి బి.శివధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. విచారణ అధికారులను భయభ్రాంతులకు గురి చేసేలా వీరిద్దరూ మాట్లాడారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిట్ అధికారులు దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో, విచారణకు హాజరైన సమయంలో కెటిఆర్, హరీష్‌రావులు అధికారులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారని ఎంఎల్‌సి ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో దర్యాప్తు సంస్థలను బెదిరించడం తీవ్ర నేరమని, వెంటనే తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరారు.

## జర్నలిజం వృత్తిలో పరిపూర్ణతకు
# ఎఐ పరిజ్ఞానం తప్పనిసరి

**రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిజం వృత్తిలో పరిపూర్ణత రావడానికి ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మీడియాలో సాంకేతికత పెరిగినందున జర్నలిస్టులు సంయమనం పాటిస్తూ, నిజ నిర్ధారణ చేసుకున్నాకే వార్తలను ప్రచురించడం, ప్రసారం చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో శుక్రవారం నల్లగొండ జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడి యా జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ మీడియాలో భాగంగా ఎఐని ఉపయోగిస్తున్న జర్నలిస్టుల సంఖ్య నిత్యం పెరిగిపోతున్నదన్నారు. సాధారణ వ్యక్తులు కూడా సోషల్ మీడియా ద్వారా తమ సందేశాలను చేరవేస్తున్నారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు ఎ. నర్సింహారెడ్డి మాట్లాడుతూ నిత్యం జర్నలిస్టులు సాంకేతికతను అంది పుచ్చుకోవాలని, జర్నలిజంతో ముడిపడిన అనేక అంశా లు, అనుభవాలను ప్రస్తావించారు. జర్నలిస్టుల శిక్షణలో భాగంగా మొదటి రోజు గ్రామీణ వార్తలు, ఎలక్ట్రానిక్ మీడి యా అనే అంశంపై రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ ఉమా మహేశ్వర రావు, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, ఎఐ, సోషల్ మీడియాలో అవలంభించాల్సిన పద్ధతులపై ముద్దం నర్సింహస్వామి వివరించారు. సీనియర్ జర్నలిస్టు గోవిందరెడ్డి నేర వార్తలు అనే అంశంపై బోధించారు. సమాచార హక్కు చట్టం2005 అంశంపై సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ సందేహాలను నివృత్తి చేశారు.

## ఎసిబికి చిక్కిన భద్రాచలం సబ్ రిజిస్ట్రార్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎసిబికి భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ ఖదీర్ చిక్కారు. ఏసిబి డిఎస్‌పి రమేష్ గురువారం రాత్రి ఆయన్ను అదుపులోనికి తీసుకున్నారు. ఖదీర్ బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసి రోజుల్లో పలు అవకతవకలకు పాల్పడ్డ విషయంలో ఈ విచారణ సాగింది. ప్రస్తుతం భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ నగదు లావాదేవీలను పూర్తిగా పరిశీలించారు.

# బాసరలో హోంగార్డుల సాహసం!

**సిపిఆర్‌తో భక్తుడి ప్రాణం కాపాడటంతో ప్రశంసలు**



**ప్రజాపక్షం/నిర్మల్ (బాసర) :** వసంత పంచమి పర్వదినం వేళ బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి క్షేత్రంలో ఒక అద్భుతమైన సంఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న హోంగార్డులు తమ సమయస్ఫూర్తిని చాటుకుని, మృత్యువు అంచుల్లో ఉన్న ఒక భక్తుడిని ప్రాణాపాయం నుంచి రక్షించి రియల్ హీరోలుగా నిలిచారు.

**అసలేం జరిగిందంటే..?**

మంచిర్యాల జిల్లాకు చెందిన సిద్ధం తిరుపతి అనే భక్తుడు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయ క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఈ క్రమంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అది గమనించిన అక్కిడి భక్తులు ఆందోళనకు గురయ్యారు.

**సకాలంలో స్పందించిన హోంగార్డులు..**

అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డులు ఇంద్రకరణ్ రెడ్డి, గణేష్, నారాయణ వెంటనే స్పందించారు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రాథమిక చికిత్సలో భాగంగా సీపీఆర్ నిర్వహించారు. వారి నిరంతర ప్రయత్నంతో తిరుపతి శ్వాస తిరిగి పుంజుకుంది. అనంతరం ఆయనను వెంటనే వైద్య సిబ్బందికి అప్పగించి, ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించడం వల్లే ఆయన ప్రాణాలు దక్కాయని వైద్యులు ధృవీకరించారు.

**జిల్లా ఎస్పి అభినందనలు..**

హోంగార్డుల మానవీయతను, బాధ్యతాయుతమైన పనితీరును నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు. ఆపదలో ఉన్నవారిని కాపాడడంలో వారు చూపిన చొరవ మిగతా సిబ్బందికి ఆదర్శమని ఆమె కొనియాడారు. భక్తుడి ప్రాణాలు కాపాడిన ఈ ముగ్గురు హోంగార్డులపై ప్రస్తుతం సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

## దుర్మార్గమైన విధానాలు అవలంబిస్తోన్న కేంద్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో పౌష్టికాహార లోపంతో మహిళల్లో రక్తహీనత ఉన్న వారి సంఖ్య పెరిగిపోతుంటే, వారిని కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా మరింత దుర్మార్గమైన విధానాలను అవలంభిస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావ్లే విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంతో మహిళలు కూలీ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 28 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఐద్వా 14వ అఖిల భారత మహాసభలను జయప్ర దం చేయాలని పిలుపునిచ్చారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐద్వా అధ్యక్షులు పి.కె. శ్రీమతి టీచర్, కోశాధికారి ఎస్.పుణ్యవతి, కేంద్ర కమిటీ సభ్యులు షెర్బానీ, రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సహాయ కార్యదర్శులు కె.ఎన్.ఆశాలత, బుగ్గవీటి సరళతో కలిసి మరియం ధావ్లే మాట్లాడుతూ దేశంలో మహిళలు, బాలికలపైన లైంగిక దాడులకు సంబంధించిన పోక్సో కేసులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ క్రైమ్ బ్యూరో రికార్డు ప్రకారం 2022–24లో పోక్సో కేసులు 90 శాతం పెరిగాయన్నారు. మనుస్మృతిని అమలు చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, అంటరానితనం, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి తెచ్చుకున్న రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిస్టు వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆమె పిలుపునిచ్చారు. దేశం వృద్ధి రేటు సాధిస్తే, పేదరికం, పౌష్టికాహార లోపం, నిరుద్యోగ పరిస్థితులు ఎందు కు నెలకొన్నాయని ప్రశ్నించారు. పి.కె.శ్రీమతి టీచర్ మాట్లాడుతూ కేరళలో రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, అక్కడ మహిళలపై ఏదైనా నేరం జరిగితే ప్రభుత్వం వెంటనే న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని వివరించారు. నిరుద్యోగ మహిళలకు నెలకు రూ.1,000 చొప్పున నిరుద్యోగ భృతిని చెల్లిస్తుందన్నారు. మహిళల హక్కు లే మానవ హక్కులని వారికి సమానంగా హక్కులు దక్కినప్పుడే సమాజం బాగుంటుందని ఎస్.పుణ్యవతి అన్నారు.

## సిట్ అంటే స్క్రిప్టెడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్

**మాజీ మంత్రి హరీశ్‌రావు**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సిట్ అంటే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ కాదని, స్క్రిప్టెడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌గా మారిందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిట్ విచారణ అంశంలో మీడియాలో ప్రసారమవుతున్న వాటిలో 90 శాతం లీకులు సత్యదూరమని, తమకు మీడియాతో బాగుండడం అలవాటు అని, డిఫమేషన్ వేస్తే బాగుండదని చెప్పారు. సిట్ పేరుతో సిఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ ప్రారంభించారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిరుల గని సింగరేణి ప్రస్తుతం సింగరేణి సృజన్‌గా మారిందని, ఇదంతా రేవంత్ పాలనలో జరుగుతోందని ఆరోపించారు. ఒక మంత్రి తన సోదరుని కంపెనీకి సైట్ విసిట్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని, తమ కంపెనీకి సైటు విజిట్ సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వబోరని అధికారికంగా ఉత్తరం రాశారని హరీశ్ రావు అన్నారు. ఈ వాటాల పంచాయతీ కాంగ్రెస్ పార్టీకి ఉరితాడుగా మారిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేసిన బొగ్గు కుంభకోణం వల్ల తెలంగాణ ప్రతిష్ట దెబ్బతిన్నదన్నారు. గత బొగ్గు కుంభకోణం యుపిఎ ప్రభుత్వ పతనానికి దారితీసిందో ప్రస్తుత బొగ్గు కుంభకోణంతో కాంగ్రెస్ పతనానికి బీజం పడిందని తెలిపారు. ఈ గండం గట్టేక్కేందుకే ప్రజల దృష్టి మళ్లించేందుకు బిజెపితో కుమ్మక్కై సిట్ డ్రామా చేస్తున్నారని ఆరోపించారు. అంతకు ముందు మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఎల్‌సి దాసో జు శ్రవణ్, బిఆర్‌ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ తదితరులు వేర్వేరుగా మీడియా సమావేశంలో మాట్లాడారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను కలిసి మేడారం జాతర ఆహ్వానపత్రం అందజేస్తున్న దృశ్యం.
– ప్రజాపక్షం/హైదరాబాద్

## నేటి విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులు

**రైల్వే జిఎం సంజయ్‌కుమార్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేటి విద్యార్థులే భవిష్యత్తులో భారతదేశ బాధ్యతాయుతమైన పౌరులని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సౌత్ లాలాగూడలోని శుక్రవారం జరిగిన రైల్వే మిక్స్‌డ హై స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిధిగా హాజరయ్యారు.దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (ఎస్‌సిఆర్‌డబూడబ్లూఒ) అధ్యక్షురాలు వందన శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ సంతోష్ కుమార్ వర్మ, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షురాలు ఆశా వర్మ, హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కట్టా ఆనంద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చిదంబరం విజయ రాజుతో పాటు సిబ్బంది, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ... నైతిక విలువలు, క్రమశిక్షణ, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలతో విద్యను సమతుల్యం చేయడం ద్వారా మొత్తం శ్రేష్ఠతకు కృషి చేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు మరియు ఉజ్వల భవిష్యత్తును రూపొందించడానికి పాఠశాల అందించే సౌకర్యాలను గరిష్టంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ కొడతాం

(మొదటి పేజీ తరువాయి)

నుండి మరింత మెరుగైన పనితీరును ఆశించినట్లు ఫలితాలు చెబుతున్నాయి. పాత ప్రభుత్వాల కంటే గత పదేళ్ళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఎంతో గొప్పగా పని చేసింది. కానీ, మాకు ఓట్లు వేసేందుకు అదొక్కటే సరిపోలేదు. ఈ ఫలితాల నుండి పాఠాలు నేర్చుకోవాలి. కాబట్టి సిపిఐ, వామపక్షం గంభీరమైన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రశ్న : ఏ వర్గాలు దూరమయ్యారని భావిస్తున్నారు?**

**బినోయ్ :** ముస్లింలు, క్రైస్తవులు వంటి మతపరమైన మైనారిటీల ఓటింగ్ సరళిలో స్పష్టమైన మార్పు కనిపించింది. సాంప్రదాయకంగా ఎల్‌డిఎఫ్‌ను తమ 'సహజ మిత్రుని'గా భావించే వీరు, ఈ సారి అనేక చోట్ల యుడిఎఫ్‌కు ఓటు వేశారు. ఈ అంతరాన్ని పూడ్చుకొని, వారి విశ్వాసాన్ని తిరిగి పొందాల్సి ఉంది. మరో అంశం శబరిమల ఆలయంలో ద్వారం బంగారు తాపడం మార్పిడిలో క్రిమినల్ నేరం' జరిగింది. విశ్వసనీయత కలిగిన అధికారులతో కూడిన ప్రత్యేక బృందంతో దీనిపై విచారణ జరపాలన్న ప్రభుత్వ నిర్ణయం భక్తుల ప్రయోజనాలను, భావోద్వేగాలను పరిరక్షించడంలో వామపక్ష పార్టీలకు ఉన్న నిబద్ధతను చాటిచెబుతోంది. అయితే, వామపక్షాలు మతానికి వ్యతిరేకమని బిజెపి, వారి కూటమి పార్టీలు ప్రచారం చేశాయి. దానిని మెజారిటీ ప్రజలు నమ్మారు. అలాగే కట్టుకథలు అల్లి ప్రచారం చేశారు. బిజెపి వారు మతాన్ని రాజకీయాలకు వినియోగించుకుంటున్నారే తప్ప వారు నిజమైన భక్తులు కాదు. మతపరమైన తీవ్రవాదం, విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని లౌకిక శక్తులను, నిజమైన భక్తులను ఏకం చేయాలని వామపక్ష పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.



**ప్రశ్న : ఎల్‌డిఎఫ్ గత ఎన్నికల్లో మొదటిసారిగా వరుసగా రెండవసారి గెలిచింది కదా. త్వరలో జరిగే ఎన్నికల పరిస్థితి ఏమిటి?**

**బినోయ్ :** గతంలో కూడా వరుసగా రెండు సార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసాం. సి.అచ్యుత మీనన్ ముఖ్యమంత్రిగా వరుసగా రెండు సార్లు ప్రభుత్వం ఏర్పాటు అయింది. ఇటీవల పినరయి విజయన్ నాయకత్వంలో ఎల్‌డిఎఫ్ రెండవసారి వరుసగా రెండుసార్లు గెలుపొందింది. మూడవసారి కూడా వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం గతంలో మద్దతిచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో దూరమైన వారి విశ్వాసం పొందటానికి తిరిగి కృషి చేస్తాం.

**ప్రశ్న : శాసనసభ ఎన్నికల్లో మీ పోరాటం యుడిఎఫ్‌తోనా, ఎన్‌డిఎతోనా?**

**బినోయ్:** తెలంగాణలో కాంగ్రెస్, సిపిఐ కలిసి ఉన్నాయి. కానీ, కేరళలో కాంగ్రెస్ భిన్నమైనది. ఆ పార్టీ కేరళ నేతలకు గాంధీ, నెహ్రూల విలువలు, భావజాలం లేవు. వాటిని మరిచిపోయి, ఎల్‌డిఎఫ్‌ను ఓడించేందుకు బిజెపితో చేతులు కలుపుతుంటారు. 1991 లోక్‌సభ ఎన్నికల్లో తమ ఉమ్మడి శత్రువు వామపక్షమని, కాంగ్రెస్ – బిజెపిలు కలిసి మాకు వ్యతిరేకంగా పని చేశాయి. కీలక సమయాల్లో బిజెపి, కాంగ్రెస్ తరచుగా 'అపవిత్ర కూటమి'గా ఏర్పడతాయి. ఇది కొన్నిసార్లు ప్రత్యక్షంగా, కొన్నిసార్లు పరోక్షంగా జరుగుతోంది. ఎల్‌డిఎఫ్ ఈ ఉభయ పార్టీల సవాలును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి రెండిటితోనూ ఎల్‌డిఎఫ్ పోరాడుతుంది.


**తెలంగాణ ప్రభుత్వము, అటవీ శాఖ, పెద్దపల్లి.**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన (3rd Call)
Rc.No.266/2024/S4/Ramagiri Fort, తేదీ: 23-01-2026
పెద్దపల్లి జిల్లాలో 2025-26 సంవత్సరకాలంలో ఖిలారామగిరి రిజర్వు ఫారెస్టు, బేగంపేట్ మరియు రత్నాపూర్ గ్రామాల పరిధిలోని రామగిరి మండలం, రత్నాపూర్ బీటు, కల్వచర్ల సెక్షన్, పెద్దపల్లి రేంజ్ పరిధిలోని రామగిరి ఖిల్లా యందు ఇకో టూరిజం పనుల నిర్మాణం కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. **మొత్తం అంచనా విలువ:** రూ.83.774 లక్షలు (ECV). **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ తేదీ:** 24.01.2026న ఉ.11:30 గం.ల నుండి, **టెండరు ముగింపు కొరకు చివరి తేదీ:** 04.02.2026న మ.2:00 గం.ల వరకు, **సాంకేతిక బిడ్ తెరచు తేదీ:** 05.02.2026న ఉ.11:30 గం.లకు, **Price bid (ధర) తెరచు తేదీ:** 05.02.2026న సా.4:00 గం.లకు. అన్ని వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- జిల్లా అటవీ అధికారి, పెద్దపల్లి.
DIPR R.O. No. : 14299-PP/CL/ADVT/1/2025-26, Date: 23-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్** GHMC
NIT No.1/EE-1/MKJZ/GHMC/2025-26
**పని పేరు:** నిర్వహణ పనులు: ఇతరాలు-03, **అంచనా మొత్తం:** రూ.44.90 లక్షలు, **బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేది తేది & సమయం / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 23.01.2026న మ.1.30గం.ల నుండి 30.01.2026న మ.1.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 9154796465, 7995009098. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14227-PP/CL/ADVT/1/2025-26, Date: 23-01-2026

HYDERABAD **గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-12**
NIT No.25/EE12/SRNR/GHMC/2025-26 తేది: 23.01.2026
**పని పేరు:** (09) పనుల కోసం "శ్మశానవాటికకు ఏర్పాట్లు మరియు పూడికతీత పనులు", **అంచనా మొత్తం:** రూ.103.20 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 27.01.2026న మ.3.10గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తిక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, జిహెచ్ఎంసి. సెల్: 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14302-PP/CL/ADVT/1/2025-26, Date: 23-01-2026

**సదాశివపేట మున్సిపాలిటీ కార్యాలయం, జిల్లా : సంగారెడ్డి - టి.ఎస్.**
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండర్ నోటీసు నెం.E1/182/SSPT/e-proc/2025-26 తేదీ: 23.01.2026
15వ ఆర్థిక సంఘం నిధుల కింద, 2025-26 సంవత్సరానికి పట్టణంలో కొన్ని అభివృద్ధి / నిర్వహణ పనుల కోసం టెండర్లు ఆహ్వానించడమైనవి.
**ఆన్‌లైన్ బిడ్స్ దాఖలు కొరకు ప్రారంభ తేదీ / సమయం:** 23.01.2026న సా.5.00గం.ల నుండి, **ఆన్‌లైన్ బిడ్స్ దాఖలు కొరకు ఆఖరి తేదీ / సమయం:** 27.01.2026న ఉ.10.30గం.ల వరకు, **బిడ్స్‌ను తెరవడం:** 27.01.2026న ఉ.11.00గం.లకు, **వివరాలకు సంప్రదించండి:** మున్సిపల్ కమిషనర్, సదాశివపేట మున్సిపాలిటీ. సెల్ నెం. 9849905918 (కమిషనర్), ఇంజనీర్ : 7331123024. ఇమెయిల్: mc_sadasivpet@yahoo.com. మరిన్ని వివరాలకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు. పనులను డౌన్‌లోడ్ చేసుకోవడం 23.01.2026వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రారంభమవుతుంది.
సం/- మున్సిపల్ కమిషనర్, సదాశివపేట మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 14239-PP/CL/ADVT/1/2025-26, Date: 23-01-2026

## జిహెచ్‌ఎంసిలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేస్తామని సిబ్బంది శపథం చేశారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి పరిధిలోని వివిధ విభాగాల ఉద్యోగులతో అదనపు కమిషనర్ వేణుగోపాల్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ మంగతాయారు, విజిలెన్స్ అదనపు ఎస్‌పి నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

## మరణ శిక్ష రద్దు

### సూర్యాపేట కోర్టు తీర్పుని రద్దు చేసిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సూర్యాపేట జిల్లా మోతే మండలం మేకలపాటి తండాలో 2021, ఏప్రిల్ 15న బానోత్ భారతి అనే మహిళ తన ఏడు నెలల తన పసికందు గొంతు, నాలుక కోసి ప్రాణం తీసిన కేసులో సూర్యాపేట కోర్టు విధించిన మరణశిక్షను హైకోర్టు రద్దు చేసింది. ఆమె మానసిక వైకల్యంతో ఏం చేస్తున్నారో తెలియని దుస్థితిలో ఉండగా చేసిన తప్పిదాన్ని నేరంగా పరిగణించడానికి వీల్లేదని చట్టాలు సుప్రీంకోర్టు తీర్పులు చెబుతున్నాయని గుర్తు చేసింది. మానసిక వైకల్య పరిస్థితుల్లో తల్లి ఉన్నప్పుడు ఆమె చేసే నేరానికి కింది కోర్టు మరణశిక్ష విధించడం సబబు కాదంది. కన్న బిడ్డను నరబలి ఇచ్చిన భారతికి సూర్యాపేట కోర్టు మరణశిక్ష విధించింది. ఈ తీర్పును హైకోర్టు రద్దు చేసింది. సిఆర్పి సెక్షన్ 84 అలాంటివారికి రక్షణ కల్పిస్తోందని చెప్పింది. కన్న తల్లే నేరానికి పాల్పడినట్టు ఆధారాలు ఉన్నప్పటికీ ఆమె మానసిక పరిస్థితులు దృష్ట్యా చట్టం చట్ట ప్రకారం నేరం కాదని, ఆమె నిర్దోషి అని తేల్చింది. భారతి దాఖలు చేసిన అప్పీల్‌ను అనుమతించి, ఆమెను ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని చంచల్‌గూడ జైలు సూపరింటిండెంట్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ రామకృష్ణారెడ్డి డివిజన్ బెంచ్ శుక్రవారం తీర్పు చెప్పింది.

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు అసంతృప్తి


ప్రజాపక్షం/హైదరాబాద్ : కోర్టు ధిక్కరణ కేసు ఉండగా హైడ్రా కమిషనర్ అంబర్‌పేటలోని బతుకమ్మకుంట చెరువు వద్ద జరిగిన కార్యక్రమాలకు ఎలా వెళ్తారని హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు దగ్గర కేసులో క్షమాపణలు చెప్పిన హైడ్రా కమిషనర్ వైఖరిలో మార్పు రాలేదని వ్యాఖ్యానించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సంక్రాంతి పండుగ సందర్భంగా రంగనాథ్ బతుకమ్మ కుంట వద్ద నిర్వహించిన సభలో పాల్గొని జిమ్, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేస్తామని ప్రకటించడానికి న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. కోర్టు ధిక్కరణ కేసులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ గత డిసెంబర్ 5, 2025న హైకోర్టు విచారణకు హాజరై క్షమాపణలు చెప్పారని తెలిపారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ బి.ఆర్. మధుసూదనరావులతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం అసంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రభుత్వం సమగ్రంగా కౌంటర్ దాఖలు చేస్తుందని ప్రభుత్వం న్యాయవాది చెప్పడంతో విచారణ వచ్చే నెల 6వ తేదీకి వాయిదా పడింది.

## మన శంకర వరప్రసాద్ సినిమా టిక్కెట్ల పెంపు డబ్బు వసూలు చేయాలి

### హైకోర్టులో వాదన

ప్రజాపక్షం/హైదరాబాద్ : టిక్కెట్ల ధరలను పెంచరాదని హైకోర్టు కచ్చితంగా ఆదేశాలు జారీ చేసిన తర్వాత చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల రేట్లు రాష్ట్ర ప్రభుత్వం పెంచడానికి తీవ్రంగా పరిగణించాలంటూ శుక్రవారం హైకోర్టులో వాదన జరిగాయి. టిక్కెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. లేని పక్షంలో హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించేలా అదేశాలు ఇవ్వాలన్నారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు ద్వారా మన శంకర వరప్రసాద్ సినిమాకు లభించిన 42 కోట్ల రూపాయలను ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలంటూ శ్రీనివాస్ రెడ్డి ఇతరులు దాఖలు చేస్తున్న పిటీషన్లను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్ కుమార్ ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు విచారణను వచ్చే నెల మూడో తేదీకి ఐదో వేశారు.

## సమ్మె నోటీసులు అందచేసిన కార్మిక సంఘాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిహెచ్‌ఎంసిలో కార్మిక సంఘాలు సమ్మె నిర్వహించనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి శుక్రవారం సమ్మె నోటీసులు అందచేశారు. చిత్రంలో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ ఉన్నారు.

## ఒయులో 28న ఫార్మసిస్ట్ పోస్టుల జాబ్-మేళా

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో, అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు ఒయు ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్‌మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీతో పాటు ఏదైనా డిగ్రీ చేసిన యువతి, యువకులు (18 నుండి 35 సంవత్సరాల వయసు) కి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు, వేతనం రూ.12 వేల నుండి రూ.25 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు టి.రఘుపతి(హెచ్ ఆర్) 8247656356 ను సంప్రదించాలన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా జనవరి 28 న హాజరు కావాలని పేర్కొన్నారు.

## పేదలకు ఉపయోగపడేందుకే మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్

### హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : పేదలు, మధ్యతరగతి ప్రజల వివాహాలు, మహిళా సంఘాల సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యార్థుల ఈవెంట్లకు మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ఎంతో ఉపయోగపడుతుందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ వంటి ఖరీదైన ప్రాంతంలో ఈ స్థాయి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించడం హర్షణీయమన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఎన్‌బిటి నగర్‌లో ఖైరతాబాద్‌లోనే అతిపెద్ద జి ప్లస్ 2 మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను మంత్రి ప్రభాకర్, గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ ప్రియాంక అలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ సువిశాల ఫంక్షన్ హాల్ పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మేయర్‌గా, కార్పొరేటర్‌గా గద్వాల్ విజయలక్ష్మి చేసిన అభివృద్ధి పనుల్లో ఈ ఫంక్షన్ హాల్ ఆమెకు మధుర జ్ఞాపకంగా నిలుస్తుందన్నారు. వసంత పంచమి శుభదినాన హాల్ ప్రారంభం శుభసూచకమని మంత్రి అన్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ 10 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితమే ఈ ఎన్‌బిటి నగర్ జి ప్లస్ 2 మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ అన్నారు. ప్రజా ప్రభుత్వ సహకారంతో రూ.10 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో ఈ హాల్‌ను నిర్మించగలిగామన్నారు. అన్ని రకాల సామాజిక, ప్రభుత్వ, మహిళా, విద్యార్థి కార్యక్రమాలకు ఇది వేదికగా నిలుస్తుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్లో 15 లక్షల మందిని స్వయం సహాయక సంఘాల్లో చేర్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌బిటి నగర్‌లో ఇంత భారీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభం సంతోషకరమన్నారు. ఈ హాల్ నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు. మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఐదేళ్లుగా అక్కాచెల్లెళ్ల మాదిరిగా కలిసి గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేశామని ఆమె అన్నారు.

## అపవాదులను జయించి.. అసమాన నాయకుడిగా ఎదిగిన లోకేష్

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : నారా లోకేష్ కేవలం ఒక రాజకీయ వారసుడిగా కాకుండా, తన స్వయంకృషితో, పట్టుదలతో ఒక ప్రజా నాయకుడిగా ఎదిగారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ ప్రశంసించారు. టిడిపి ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మంత్రి లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో నాయకులు భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ లోకేష్ తన తాత ఎన్‌టిఆర్ ఆశయాలను, తండ్రి చంద్రబాబు సుపరిపాలనను పుణికిపుచ్చుకున్నారని తెలిపారు. అపవాదులను లోకేష్ చిరునవ్వుతో ఎదుర్కొన్నారని అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, తడక వినోద్, శ్యామ్ సుందర్, భాను ప్రకాష్, వెంకటేశ్ చౌదరి, జాన్సీ, ప్రమీల, కరణం కిరణ్, ఎస్.ప్రకాష్, గండికోట విజయ్, చంద్రమోహన్ గౌడ్, పి.బాలకృష్ణ, బి.రాజు, శక్తి ప్రేమ్, జగదీష్ గౌడ్, సుక్రవేది, బిక్షపతిచారి, నర్సింహా గౌడ్, యాదగిరి, ఆనంద్ పాల్గొన్నారు.

## ఆదాయానికి మించి ఆస్తులు..

# జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై కేసు

### ఆస్తులు రూ.7.83 కోట్లు..!?

### ఇబ్రహీంపట్నం, పరిగి మండలాల్లో భారీగా ఆస్తులు జమ, ఫాంహౌస్, స్విమ్మింగ్‌పూల్

### భార్య, పిల్లల పేరుతో లిక్కర్ షెల్ కంపెనీల్లోనూ రూ.80 లక్షలు పెట్టుబడులు

ప్రజాపక్షం/రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 1 కందాడి మధుసూదన్‌రెడ్డిని ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఎసిబి గుర్తించింది.ఈ మేరకు శుక్రవారం ఆయన ఇండ్లతో సహా బంధువులు, స్నేహితులు, బినామీల ఇళ్లలో మొత్తం ఏడు చోట్ల ఏక కాలంలో దాడులు నిర్వహించింది. ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు తేల్చింది. రూ.7.83 కోట్లకుపైగా స్థిర, చర ఆస్తులను కూడబెట్టినట్లు నిర్ధారించింది.ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన మధుసూదన్‌రెడ్డి,మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా డివిజన్ భవాణినగర్‌లోని స్ట్రీట్ నంబర్ 8లోని ప్లాట్ నంబర్ 337లో ఉంటున్నారు. ఆయన రంగారెడ్డిజిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్1గా పని చేస్తున్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి, అడ్డగోలుగా సంపాధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే అంశంపై ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం విచారణకు ఆదేశించారు. విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన మధుసూదన్‌రెడ్డిపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ ఇటీవల విచారణ చేపట్టి ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆయనపై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు కేసు నమోదు చేశారు. తాజాగా ఆయన నివాసం సహా బంధువులు, బినామీల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. భవాణినగర్ కాలనీలో 300 గజాల్లో జి ప్లస్ 1 ఇండిపెండెంట్ ఇల్లు, ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో ఎకరం విస్తీర్ణంలో కమర్షియల్ కాంప్లెక్స్, చింతపల్లిగూడలో ఒక ఓపెన్ ప్లాటుతోపాటు పరిగి మండలం నాస్కల్‌లో 27 ఎకరాల వ్యవసాయ భూములు, నాస్కల్‌లో రూ.1.24 కోట్ల విలువ చేసే ఫాంహౌస్, స్విమ్మింగ్ పూల్, ఇంట్లో రూ.9 లక్షల నగదు, 1.2 కేజీల బంగారు ఆభరణాలు, ఇన్నోవా ఫార్చూనర్ కారు, వోల్వా ఎక్స్‌సీ 60 బి 5 కారు, ఒక వోక్స్‌వాగన్ టియాగో కారు ఉన్నట్లు గుర్తించారు. మార్కెట్ విలువ ప్రకారం ఆయన ఆస్తుల విలువ రూ.7,83,35,302గా నిర్ధారించారు. ఇదిలా ఉంటే ఆయన తన భార్య, పిల్లల పేరున రూ.80 లక్షలు ఏఆర్‌కే స్పిరిట్ లిక్కర్ షెల్ కంపెనీల్లోనూ పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేశారు.



**అసలేమైందంటే...!?**

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్2గా విధులు నిర్వహిస్తున్న కె.మధుసూదన్‌రెడ్డిని ఇటీవల స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ సస్పెండ్ చేసింది.శేరిలింగంపల్లి మండలం మక్తమహబూబ్‌పేట్‌లోని సర్వే నంబర్ 44లో ఉన్న ప్రభుత్వ స్థలంపై కొందరు తప్పుడు డాక్యుమెంట్లను చూపుతూ 2025 జులైలో రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆ స్థలం నిషేధిత జాబితాలో ఉంది. లావాదేవీలను కూడా నిలిపివేశారు. అయితే దీనిపై రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు వివిధ పత్రాలను ఆధారంగా చూపుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.లావాదేవీలు పూర్తి చేయాలంటూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో అదే ఏడాది అక్టోబర్ 29న సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ రిజిస్ట్రేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. లావాదేవీకి సమర్పించిన రికార్డులు (సిసి, ఇసి) సరైనవి కాదనే విషయాన్ని సబ్ రిజిస్ట్రార్ కోర్టు దృష్టికి తీసుకెళ్లలేదు. ఆయా రికార్డులపై అధికారుల సంతకాలు,కార్యాలయంలోని రికార్డుల్లో ఉన్న సంతకాలతో సరిపోలడం లేదు. 1980లో కంప్యూటరైజ్డ్ ప్రింట్‌లు లేకున్నప్పటికీ ఇసి సర్టిఫికెట్‌ను లావా దేవీకి జత చేశారు. వాటిపై కార్యాలయ సీల్, సబ్ రిజిస్ట్రార్ స్టాంప్ ముద్రలు సైతం లేవు. ఇలా పలు ఆధారాలకు సంబంధించిన వాస్తవాలను సరి చూసుకోకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. రిజిస్ట్రేషన్ బుక్ విలువలనూ కూడా పరిశీలించలేదు. ఈ కారణంగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌పై స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ ఇటీవల చర్యలు తీసుకుంది. వివాదాస్పద, ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లలో అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతూ.. భారీగా ఆస్తులు కూడబెట్టిన మధుసూదన్‌రెడ్డిపై ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ మేరకు అతని ఇండ్లతోపాటు బంధువులు, స్నేహితులు, బినామీల ఇళ్లలో సోదాలు నిర్వహించి, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు తేల్చారు.

## స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు అదనపు కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలి

### అర్హులైన తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా.. పదోన్నతి ప్రక్రియను వేగవంతం చేయాలి : వి.లచ్చిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో అర్హత కలిగిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు అదనపు కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్ల సంఘం నాయకులు శుక్రవారం రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్‌ను కలిసి పలు అంశాలపై వినతిపత్రాలను అందజేశారు. అనంతరం లచ్చి రెడ్డి మాట్లాడుతూ ఖాళీల్లో ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు మంజూరు చేయాలన్నారు. ఇక అర్హులైన తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించేందుకు సంబంధిత ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ విభాగంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న 16 మంది అధికారులకు ఐఎఎస్ (కన్‌ఫర్డ్)గా పదోన్నతి లభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ పదోన్నతులు తమకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో చాలామంది ప్రస్తుతం వివిధ జిల్లాల్లో అదనపు కలెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వారి పదోన్నతుల వల్ల ఏర్పడిన ఖాళీలను స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లతో భర్తీ చేయాలని కోరారు. అర్హులైన డిప్యూటీ కలెక్టర్లను స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు మంజూరు చేయాలని, అర్హత కలిగిన తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించేందుకు అవసరమైన ప్రక్రియను తక్షణమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిపాలన సజావుగా కొనసాగాలంటే ఈ పదోన్నతులు అత్యంత అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.రాధ, రాష్ట్ర నాయకులు డి.శకుంతల, ఎం.శ్రీనివాసరావు, బి.లావణ్య పాల్గొన్నారు.

## పోలీస్ శాఖపై అసత్య ఆరోపణలు సహించం

### హరీష్‌రావు వ్యాఖ్యలు దురుద్దేశపూరితమైనవే : తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల ధన–మాన–ప్రాణాల రక్షణ కోసం తెలంగాణ పోలీస్ శాఖ అధికారులు అహోరాత్రులు విధులు నిర్వహిస్తున్నారని తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం స్పష్టం చేసింది. అవసరమైతే ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని పేర్కొంది. అటువంటి గౌరవనీయమైన, చట్టబద్ధ సంస్థ అయిన తెలంగాణ పోలీస్ శాఖపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమైనవి, నిరాధారమైనవి, దురుద్దేశపూరితమైనవని సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు పోలీస్ శాఖ ప్రతిష్ఠను దిగజార్చడంతో పాటు ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని దెబ్బతీయడానికే చేయబడ్డవని ఆరోపించింది. కేసుల దర్యాప్తులో సాక్ష్యాధారాలను సేకరించడం, అవసరమైతే ఎవరినైనా విచారణకు పిలవడం దర్యాప్తు అధికారులకు చట్టబద్ధంగా కల్పించిన అధికారం అని స్పష్టం చేసింది. పోలీసులు బిఎన్ఎస్ఎస్,బిఎన్ఎస్, బిఎస్ఎ వంటి చట్టాల పరిధిలో, రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తారని వెల్లడించింది. ఏ కేసులోనైనా నిజానిజాలపై తుది నిర్ణయం పూర్తిగా న్యాయస్థానాలకే ఉంటుందని పేర్కొంది. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో విచారణాధికారులపై నిరాధార, బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేయడం న్యాయ ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నంగా పరిగణించబడుతుందని సంఘం హెచ్చరించింది.

ఇలాంటి వ్యాఖ్యలు చట్ట విరుద్ధమైనవే కాక శిక్షార్హ నేరాలుగా పరిగణించబడతాయని తెలిపింది. రాజకీయ స్వప్రయోజనాల కోసం పోలీస్ శాఖ ప్రతిష్ఠను భంగపరచే విధంగా అసత్య ఆరోపణలు చేయడం పూర్తిగా అనుచితమని తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, మాజీ మంత్రి హరీష్ రావు సీనియర్ పోలీస్ అధికారులపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని, తెలంగాణ పోలీస్ శాఖకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోలీస్ శాఖ ప్రతిష్ఠకు కలిగిన నష్టం, న్యాయ ప్రక్రియకు కలిగిన అంతరాయం దృష్ట్యా ఆయనపై సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## సిపిఆర్‌తో పునర్జన్మ

### టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : గుండెపోటుతో ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో సిపిఆర్ చేయడం వల్ల వారికి పునర్జన్మం అందించినట్లు అవుతుందని టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిఒక్కరు సిపిఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెక్రెటేరియట్ ముందు సిపిఆర్ శిక్షణ ప్రారంభోత్సవ కార్యాలయంలో మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. శిక్షణకు సంబంధించిన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...రాష్ట్రంలో 2 లక్షల మందికి ఈ సిపిఆర్‌పై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని తలపెట్టిన ఫౌండేషన్ చైర్పర్సన్ కంజర్ల విజయలక్ష్మి ని అభినందించారు. ప్రతి గ్రామానికి ఒక సిపిఆర్ అంబాసిడర్‌ను తయారు చేసి, గుండె పోటు మరణాలను తగ్గించాలని ఆకాంక్షించారు. అజారుద్దీన్ మాట్లాడుతూ... ఇటీవల గుండె పోటుతో మరణించే వారి సంఖ్య పెరగడం బాధాకరం అని అన్నారు. ప్రతిఒక్కరు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. సిపిఆర్ నేర్చుకోవడం వల్ల ఒకరి ప్రాణాలను కాపాడే అవకాశం దక్కుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతం కావాలని అజారుద్దీన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

## 2వ మెగా పేరెంట్–టీచర్ సమావేశం విజయవంతం



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియేట్‌బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 2వ మెగా పేరెంట్–టీచర్ సమావేశం విజయవంతమైందని ఇంటర్ బోర్డు డైరక్టర్ కృష్ణా ఆదిత్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన 2వ మెగా పేరెంట్–టీచర్ సమావేశంలో సుమారు 50 వేల మంది తల్లిదండ్రులు హాజరైయ్యారని వెల్లడించారు. గత సమావేశంతో పోలిస్తే ఈ సారి మరింత పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులుకాలేజీల్లో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపుపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాళ్లు తల్లిదండ్రులతో నేరుగా సమావేశమై, విద్యార్థుల చదువు, హాజరు, ప్రవర్తనపై వివరంగా చర్చించారు. డిజిటల్ లెర్నింగ్, క్రీడా శిక్షణ తదితర అంశాల ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చేపడుతున్న చర్యలను ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ వివరించారు. రాబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు–2026ను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ప్రభుత్వ గ్రాంట్లతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్స్, క్రీడా పరికరాలు, మౌలిక వసతుల వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యా వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా అమలు చేస్తున్న ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్), డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ద్వారా విద్యార్థుల హాజరు, పనితీరును సమర్థంగా పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## 26న గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాపక్షం/హైదరాబాద్: 2025 సంవత్సరానికిగాను మహిళా సాధికారత, గిరిజన అభివృద్ధి, రూరల్ హెల్త్, మెడిరల్ ఫిలాంత్రపీ, కార్పొరేట్ వాలంటీరింగ్ అనే నాలుగు రంగాలలో విశేష స్వచ్ఛంద సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి, వారికి గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ప్రధానం చేయనున్నట్లు లోక్‌భవన్ కార్యాలయం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ అవార్డుల ఎంపిక కమిటీలో భారత ప్రభుత్వ మాజీ కేంద్ర హోంశాఖ కార్యదర్శి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చైర్మన్ కె.పద్మనాభయ్య (రిటైర్డ్ ఐఏఎస్) అధ్యక్షత వహించగా, ఇతర జ్యూరీ సభ్యులుగా సిఆర్ బిశ్వాల్ (రిటైర్డ్ ఐఏఎస్), మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా. సునీతా కృష్ణన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సామాజిక సేవకురాలు, మహిళా హక్కుల కార్యకర్త డా. చిన్నబాబు సుంకవల్లి, ఆరోగ్య సంరక్షణ నిపుణుడు రమేష్ కాజా, సెక్రటరీ జనరల్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. ఉత్తమ వ్యక్తులుగా.. రమాదేవి కన్నెగంటి (మహిళా సాధికారత) (హైదరాబాద్), తోడసం కైలాస్ (గిరిజన అభివృద్ధి) (వాఘాపూర్, ఆదిలాబాద్), డా.ప్రద్యుత్ వాఘ్రే (రూరల్ హెల్త్, మెడిరల్ ఫిలాంత్రపీ) (హైదరాబాద్), వి.రాజన్న (కార్పొరేట్ వాలంటీరింగ్) (హైదరాబాద్), ఉత్తమ సంస్థలుగా.. శ్రీ సాయి సోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ (మహిళా సాధికారత) (ఘట్కేసర్), ఇండైజనౌస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (గిరిజన అభివృద్ధి) (గట్టుమల్ల, భద్రాద్రికొత్తగూడెం), రామదేవరావు హాస్పిటల్ (రూరల్ హెల్త్, మెడిరల్ ఫిలాంత్రపీ)(హైదరాబాద్), గివ్ ఫర్ సొసైటీ (కార్పొరేట్ వాలంటీరింగ్) (ఘట్కేసర్)లకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జనవరి 26న లోక్‌భవన్, హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఎట్ హోమ్' కార్యక్రమంలో ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి అవార్డుకు రూ.2 లక్షల నగదు బహుమతితో పాటు అవార్డు గ్రహీతల విశిష్ట సేవలను గుర్తించే ప్రశంసా పత్రం అందించనున్నట్లు వెల్లడించారు.

## రేపు 'కూరగాయాల సాగు' శిక్షణ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అర్బన్ ఫామింగ్ పథకంలో భాగంగా ఇంటి ఆవాసాలపై కూరగాయల పెంపకం పట్ల శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 25న (ఆదివారం) ఉదయ 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.100/ ఫీజులను చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు నాంపల్లిలోని రాష్ట్ర ఉద్యానశిక్షణ కేంద్రంలో లేదా 8977714411/ 8688848 714 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు

గాంధీని మర్చిపోయేలా చేస్తున్నారు

నేతాజీ జయంతి వేళ కాంగ్రెస్ విమర్శలు



**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీ 'చరిత్రను వక్రీకరించే వ్యక్తి' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన ప్రధానిపై అనేక విమర్శలు చేశారు. గత నెలలో పార్లమెంటు వేదికగా 'వందేమాతరం' గీతంపై జరిగిన చర్చలో మోదీ చరిత్రను వక్రీకరించారని, రవీంద్రనాథ్ ఠాగూర్‌కు అపఖ్యాతి తెచ్చేలా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం ద్వారా, జాతిపిత మహాత్మా గాంధీ జ్ఞాపకాలను, వారసత్వాన్ని మోదీ తుడిచిపెట్టేస్తున్నారని ఆరోపించారు. జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రధానిపై విరుచుకుపడ్డారు. 'గత నెలలో పార్లమెంటులో జాతీయ గేయంపై చర్చ జరిగింది. ఆ సమయంలో ప్రధాని, ఆయన సహచరులు వాస్తవాలను వక్రీకరించారు. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడారు. కానీ చివరికి వారి బండారం బయటపడింది. ప్రధాని ఉద్దేశపూర్వకంగానే చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నారు. అందుకే ఆయన దేశంలోనే 'గ్రేటెస్ట్ డిస్టోరియన్' (చరిత్రను వక్రీకరించేవాడు)' అని జైరాం రమేశ్ ఘాటుగా విమర్శించారు. నేతాజీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని జైరాం రమేశ్ కొన్ని చారిత్రక అంశాలను ప్రస్తావించారు. '1937లో వందేమాతరం గీతంలోని తర్వాతి చరణాలపై ఒక వివాదం నడిచింది. ఆ వివాదాన్ని పరిష్కరించడంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారు. కానీ పార్లమెంటు చర్చలో ప్రధాని మోదీ ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారు. ప్రజలకు నిజాలు తెలియకుండా చేశారు' అని ఆరోపించారు.

**జనగణమన, జై హింద్**

నేతాజీకి సంబంధించిన మరికొన్ని ఆసక్తికర విషయాలను ఆయన గుర్తు చేశారు. ప్రముఖ చరిత్రకారుడు, నేతాజీ మనవడు సుగత బోస్ రాసిన విషయాలను జైరాం రమేశ్ ఉదాహరించారు. 1942 నవంబర్ 2న బెర్లిన్‌లో 'ఫ్రీ ఇండియా సెంటర్'ను నేతాజీ ప్రారంభించారు. అక్కడే ఆయన 'జనగణమన'ను జాతీయ గీతంగా ఎంపిక చేశారు. అలాగే 1943 అక్టోబర్ 2న సింగపూర్‌లో ఆజాద్ హింద్ ప్రభుత్వ నినాదంగా 'జై హింద్'ను ఎంచుకున్నారు. 'దురదృష్టవశాత్తు ప్రధాని మోదీ గానీ, ఆయన పార్టీ నేతలు గానీ ఎప్పుడూ 'జై హింద్' అనే నినాదాన్ని నోటితో పలకరు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని వారు విస్మరిస్తున్నారు' అని విమర్శించారు.

**'మహాత్ముడిని చంపేస్తున్నారు'**

గాంధీజీ వారసత్వంపై మోదీ సర్కార్ దాడి చేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. '1944 జూలై 6న సింగపూర్ రేడియో నుంచి మాట్లాడుతూ, నేతాజీ తొలిసారిగా మహాత్మా గాంధీని 'జాతిపిత' అని సంబోధించారు. కానీ నేటి ప్రధాని మోదీ, ఆ జాతిపిత ఆశయాలను సమాధి చేస్తున్నారు. గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయాలని చూస్తున్నారు. ఉపాధి హామీ పథకం రద్దు చేయడమే ఇందుకు తాజా నిదర్శనం. ఇది గాంధీ వారసత్వాన్ని దెబ్బతీయడమే' అని జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వస్త్రరంగంలో సమస్యలు పరిష్కరించండి

అమెరికా సుంకాలు వస్త్ర ఎగుమతిదారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయ్

ఈ అంశంపై మోదీజీ దృష్టి సారించాలి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ:** అమెరికా సుంకాలు వస్త్ర ఎగుమతిదారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత వ్యాపారాలు, కార్మికులను మొదటి స్థానంలో ఉంచే వాణిజ్య ఒప్పందాన్ని భారతదేశం అమెరికాతో కుదుర్చుకోవడం అత్యవసరమని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బలహీనత వల్ల ఆర్థిక వ్యవస్థను మరింత ప్రభావితం చేయడానికి అనుమతించకూడదని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ హర్యానాలోని ఒక వస్త్ర కర్మాగారాన్ని ఇటీవల సందర్శించిన వీడియోను శుక్రవారం ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. అక్కడ ఆయన భారతీయ దర్జీల నైపుణ్యం, ప్రజల స్థితిస్థాపకత, ఆశయాన్ని ప్రత్యక్షంగా చూశారు. '4.5 కోట్లకు పైగా ఉద్యోగాలు, లక్షలాది వ్యాపారాలు ప్రమాదంలో ఉన్నప్పటికీ మిస్టర్ మోదీ ఎటువంటి ఉపశమనం ఇవ్వలేదు లేదా సుంకాల గురించి మాట్లాడలేదు. మోదీ జీ, మీరు జవాబుదారీగా ఉన్నారు; దయచేసి ఈ విషయంపై మీ దృష్టిని మళ్లించండి' అని ఆయన 'టినా'.. 'దేర్ ఈజ్ నో అకౌంటబిలిటీ' అనే హ్యాష్‌ట్యాగ్‌ని ఉపయోగించి పోస్టు చేశారు. భారతదేశ వస్త్ర పరిశ్రమ మన ఆర్థిక వ్యవస్థలో రెండవ అతిపెద్ద యజమాని అని, మన వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రేమించబడుతున్నాయన్నారు. మన దర్జీల నైపుణ్యం నిజంగా అసమానమైనదని ప్రశంసించారు. అయినప్పటికీ ఈ పరిశ్రమ నేడు అమెరికా సుంకాల కారణంగా తీవ్ర అనిశ్చితి, భయాన్ని ఎదుర్కొంటోందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. యుఎస్‌లో 50 శాతం సుంకాలు, యూరప్‌లో ధరలు తగ్గడం, బంగ్లాదేశ్, చైనా నుండి తీవ్రమైన పోటీతో మన వస్త్ర, వస్త్ర ఎగుమతిదారులు అన్ని వైపుల నుండి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇది ఉద్యోగాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతోందని, యూనిట్లు మూతపడుతున్నాయని, సేకరణ తగ్గుతూ మొత్తం రంగంలో విస్తృతమైన గందరగోళం ఉందన్నారు. ఇటీవల హర్యానాలోని ఒక వస్త్ర కర్మాగారాన్ని సందర్శించినప్పుడు మన దర్జీల నైపుణ్యాన్ని, ప్రజల స్థితిస్థాపకత, ఆశయాన్ని నేను ప్రత్యక్షంగా చూశానన్నారు. వారికి నిజమైన మద్దతును అందించే ప్రభుత్వం వారికి అవసరమని స్పష్టం చేశారు. భారతీయ వ్యాపారాలు, భారతీయ కార్మికులను మొదటి స్థానంలో ఉంచే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని భారతదేశం పొందడం అత్యవసరమని ఆయన నొక్కి చెప్పారు. ప్రధాని మోదీ తన సొంత బలహీనత మన ఆర్థిక వ్యవస్థను ఇకపై ప్రభావితం చేయడానికి అనుమతించకూడదన్నారు. వీడియోలో, గాంధీ వస్త్ర కర్మాగారంలోని వివిధ విభాగాలను సందర్శించి, అక్కడ పనిచేస్తున్న కార్మికులు, కార్యనిర్వాహకులతో సంభాషించారు.

## ఢిల్లీలో వర్షం.. కశ్మీర్‌లో మంచు..

# ఉత్తరాదిలో ఆకస్మిక మార్పులు



**న్యూఢిల్లీ:** ఉత్తరాదిలో ఆకస్మికంగా వాతావరణం మారిపోయింది. దీంతో శుక్రవారం ఢిల్లీలో వర్షం పడింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో స్వల్ప స్థాయి వాన కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన గాలులు వీచాయి. అయితే రోజంతా మేఘాలు కమ్ముకుని ఉంటాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం 4.50 నిమిషాలకు భారతీయ వాతావరణ శాఖ ఆరెంజ్ వార్నింగ్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో పాటు ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉన్నట్లు ఐఎండి పేర్కొన్నది. నరేలా, బవానా, అలిపుర్, బురారి, ఖాంజావాలా, రోహిణి, బద్లీ, మోడల్ టౌన్, ఆజాద్‌పూర్, పీతంపుర, ముండ్కా, పశ్చిమ్, విహార్, పంజాబీ బాగ్, రాజౌరి గార్డెన్, జాఫర్‌పూర్, నజాఫ్‌గఢ్, ద్వారక ప్రాంతాల్లో వర్షం పడనున్నది. అతిశీతల గాలులు కూడా వీయనున్నాయి. వర్షం వల్ల ఢిల్లీతో పాటు సమీప ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోనున్నాయి. ఇక కశ్మీర్‌లో మంచు కురిసింది. గుల్మార్గ్‌తో పాటు కశ్మీర్ లోయలో అనేక ప్రాంతాల్లో మంచు దుప్పటి పరుచుకున్నది. శ్రీనగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో అతివేగంగా శీతల గాలులు వీస్తున్నాయి. గురువారం సాయంత్రం నుంచి బారాముల్లా జిల్లాలోని గుల్మార్గ్‌లో కొత్తగా మంచు పడింది. మధ్యధరా ప్రాంతం నుండి వచ్చే బలమైన అల్పపీడనం వల్ల వాతావరణ మార్పు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. భీకరంగా మంచు కురవడంతో శ్రీనగర్ విమానాశ్రయం మంచుతో నిండిపోయింది. ఫ్లయిట్ ఆపరేషన్స్ అన్నీ స్తంభించిపోయాయి. రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. శ్రీనగర్ నుంచి జమ్ము వెళ్లే రోడ్డు స్నోతో నిండిపోయింది. రాంబన్‌లో దట్టంగా మంచుపడింది. ధర్మశాలలో స్వల్ప స్థాయిలో వర్షం కురిసింది. కశ్మీర్‌లోని బదేర్వా వీధులన్నీ మంచుతో నిండిపోయాయి. అందాలతో కవ్వింపు చేసే ఈ ప్రాంతంలో చాన్నాళ్ల తర్వాత మంచు పడింది. దీంతో ఇక్కడ ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయి. కొండ ప్రాంతాలకు వెళ్లే వారి కోసం బదేర్వా పోలీసులు హెల్ప్‌లైన్ నెంబర్లు జారీ చేశారు. మూడు నెలల తర్వాత దోడాలోని కొండ, లోయ ప్రాంతాల్లో మంచుపడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎంతోకాలం ఎదురుచూసిన స్నో రావడంతో స్థానికులు సంతోషపడ్డారు. హిమాచల్‌లోని మనాలీలో కూడా స్నో కురుస్తోంది.

# నిత్యం ముగ్గురు, నలుగురు ఆత్మహత్య

'సర్'పై ఆందోళనతో ప్రాణాలు తీసుకుంటున్నారు

బెంగాల్ సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా:** ఓటర్ల జాబితాపై జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (సర్) పట్ల ఆందోళన కారణంగా రాష్ట్రంలో ప్రతిరోజూ ముగ్గురు నుండి నలుగురు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. మొత్తం మరణాల సంఖ్య 110 కంటే ఎక్కువగా ఉందన్నారు. సర్‌పై ఆందోళన, ఒత్తిడి కారణంగా సంభవించిన మరణాలకు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ), బిజెపి నేతృత్వంలోని కేంద్రం బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో శుక్రవారం సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మమత మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిరోజూ 'సర్'పై ఆందోళనతో ముగ్గురు నుండి నలుగురు ఆత్మహత్య చేసుకుంటున్నారు. 'ఇప్పటికే 110 మందికి పైగా మరణించారు. 40 నుండి 45 మంది ఆసుపత్రులలో ప్రాణాల కోసం పోరాడుతున్నారు. ఇన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత, మనం ఈ దేశ పౌరులమో కాదో నిరూపించుకోవాలా అని ప్రశ్నించారు. ప్రజల హక్కులు హరించబడుతున్నాయని, ప్రజాస్వామ్యం అణిచివేయబడుతోందని ఆమె మండిపడ్డారు. బోస్ బతికి ఉంటే తార్కిక వ్యత్యాసం పేరుతో 'సర్' విచారణకు పిలిచి ఉండేవారా? భారతీయ పౌరసత్వం గురించి ప్రశ్నించేవారా అని నిలదీశారు. రాష్ట్రంలో 'సర్' ప్రారంభ దశ తర్వాత గత సంవత్సరం డిసెంబర్‌లో ప్రచురించబడిన ముసాయిదా జాబితా నుండి 58 లక్షలకు పైగా ఓటర్లను తొలగించారు. మొత్తం 7.6 కోట్ల ఓటర్లలో, వారి పత్రాలను మళ్ళీ ధృవీకరించడానికి విచారణకు పిలిచిన సుమారు 1.66 కోట్ల మంది ఓటర్ల 'నిజాయితీ గురించి ఇసి కూడా ఊహాగానాలు లేవనెత్తింది. బెంగాలీలు తమ ఇంటిపేర్లను వేర్వేరు పద్ధతుల్లో ఉచ్చరిస్తారని, తన ఇంటిపేరు బెనర్జీ, బందోపాధ్యాయ రెండింటిగా పేర్కొంటారని, ఆమె తన గురించి ఉదాహరణగా చెబుతూ సర్‌ను నిర్వహిస్తున్న వారికి ఇది ఎందుకు తెలియదని ఆశ్చర్యపోయారు. ఇటువంటి అసమతుల్యతల కారణంగా 1.38 కోట్ల మందికి నోటీసు ఇచ్చారన్నారు. సర్ విచారణలకు వృద్ధులను బలవంతంగా రప్పించారని, ఈ విషయంలో ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్‌కు ఎందుకు నోటీసు పంపారని మమత ప్రశ్నించారు. బిజెపిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతూ కాషాయ పార్టీ బెంగాల్‌పై కుట్ర చేస్తోందని, మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, బోస్, బి ఆర్ అంబేద్కర్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ వంటి దేశ ప్రముఖులను అవమానిస్తున్నారని మమత ఆరోపించారు. భారతదేశ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తాము ఈ విషయాన్ని గమనిస్తున్నామని చెప్పారు. అవమానం, అసహనం, వారి పట్ల కృతజ్ఞత లేకపోవడం, భాష పట్ల అవమానం మనం చేస్తూనే ఉన్నామన్నారు. సుభాష్ చంద్రబోస్ ఊహించిన ప్రణాళికా సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, దాని స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసిందని ఆమె ఆరోపించారు. బోస్ పుట్టినరోజును ఇంకా జాతీయ సెలవుదినంగా ప్రకటించకపోవడం దురదృష్టకరమని ఆమె జోడించారు.

# ఆయుధాలు వీడిన మరో 9 మంది



రూ. 47 లక్షల సమష్టి రివార్డు కలిగిన మావోయిస్టులు లొంగుబాటు

**ధమ్తారి :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. ధమ్తారి జిల్లాలో శుక్రవారం 47 లక్షల రూపాయల రివార్డుతో ఉన్న తొమ్మిది మంది నక్సలైట్లు పోలీసుల ముందు లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఒడిశాలోని మావోయిస్టుల కమిటీ ధమ్తారి-గరియాబంద్-నువాపాడ డివిజన్ పరిధిలోని నాగరి, సితానది ఏరియా కమిటీలు, మెయిన్‌పూర్ లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్‌జిఎస్) కు చెందిన ఏడుగురు మహిళలు సహా లొంగిపోయిన కేడర్లు ఉన్నారని రాయ్‌పూర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అమ్రేష్ మిశ్రా తెలిపారు. బోలు మావోయిస్టు భావజాలం, అటవీ జీవితంలోని కష్టాల పట్ల నిరాశ చెందారని, రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ఆకట్టుకోవడంతో వారు ఆయుధాలు వీడారన్నారు. లొంగిపోయిన వారిలో సితానది ఏరియా కమిటీ కార్యదర్శి జ్యోతి అలియాస్ జైని (28), డివిజనల్ కమిటీ సభ్యురాలు ఉషా అలియాస్ బాలమ్మ (45) ఒక్కొక్కరికి రూ.8 లక్షల రివార్డును కలిగి ఉన్నారన్నారు. మరో ఆరుగురు, రామ్‌దాస్ మార్కం (30), రోని అలియాస్ ఉమా (25), నిరంజన్ అలియాస్ పోడియా (25), సింధు అలియాస్ సోమాది (25), రీనా అలియాస్ చిరో (25),, అమిలా అలియాస్ సన్నీ (25) ఒక్కొక్కరు రూ. 5 లక్షల బహుమతిని కలిగి ఉండగా, లక్ష్మీ పునేం (18) రూ. లక్ష రివార్డును కలిగి ఉందని అధికారులు పేర్కొన్నారు. బాలమ్మ తెలంగాణకు చెందినవారని, మరికొందరు ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ జిల్లాలకు చెందినవారని ఆయన అన్నారు. ఈ పరిణామంతో, రాయ్‌పూర్ పోలీసు పరిధిలోని ధమ్తారి, గరియాబంద్ జిల్లాల్లో, అలాగే ఒడిశాలోని పొరుగున ఉన్న నువాపా జిల్లాలో పనిచేస్తున్న కేడర్లు అత్యల్ప స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు ప్రాణాలు కోల్పోవడం, లేదా లొంగిపోయన్నారు. ఐదుగురు కేడర్లు రెండు ఇన్సాస్ రైఫిల్స్, రెండు సింగిల్ లోడింగ్ రైఫిల్స్ (ఎస్ఎల్ఆర్‌లు), ఒక కార్బయిన్, మజిల్‌లోడింగ్ గన్‌తో లొంగిపోయారని అధికారి తెలిపారు. ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం జిల్లాలోని అన్ని క్రియాశీల మావోయిస్టు ప్రాంత కమిటీలను లొంగిపోయేలా ఒప్పించడానికి నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని మిశ్రా చెప్పారు. దీంతో ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రంలో 189 మంది నక్సలైట్లు లొంగిపోయారు. ఈనెల 19న, రూ. 45 లక్షల సమష్టి రివార్డు కలిగి ఉన్న తొమ్మిది మంది నక్సలైట్లు పక్కనే ఉన్న గరియాబంద్ జిల్లాలో లొంగిపోయారు. 15న, కనీసం 52 మంది అల్ట్రాలు, వారిలో 49 మంది రూ. 1.41 కోట్లకు పైగా రివార్డు బిజాపూర్ జిల్లా లొంగిపోయారు. ఇది రాష్ట్రంలోని బస్తర్ ప్రాంతంలో ఉంది. 2025లో రాష్ట్రంలో 1,500 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారు.

# ప్రజలు డిఎంకెకు వీడ్కోలు పలుకుతారు

ప్రధాని నరేంద్ర మోదీ జోస్యం




**చెన్నై/తిరువనంతపురం:** త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లో జరిగా రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బిజెపి యత్నిస్తోంది. అందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ గత రెండు మూడు రోజులుగా ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ప్రాంభిస్తున్నారు. శుక్రవారం ఆయన తమిళనాడు, కేరళలో పర్యటించారు. తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి డిఎంకె ప్రభుత్వానికి వీడ్కోలు పలకాలని ఆ రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జోస్యం చెప్పారు. చెన్నైకి సమీపంలో ఉన్న మధురాంతకంలో పర్యటించడానికి ముందు చెన్నైలో ఎన్‌డిఎ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తూ మాట్లాడారు. ఎన్‌డిఎ పాలనా రికార్డు, ప్రాంతీయ ఆకాంక్షల పట్ల నిబద్ధత రాష్ట్ర ప్రజలతో సత్సంబంధాలను ఏర్పరుస్తున్నాయన్నారు. అవినీతి డిఎంకె ప్రభుత్వానికి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైందని తమిళనాడు నిర్ణయించుకుందన్నారు. ఈమేరకు ప్రధాని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

**కేరళలో నూతన రైల్ సేవలు ప్రారంభం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం కేరళలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను. కొత్త రైలు సేవలను ప్రారంభించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం చేస్తున్న కృషి గురించి ప్రజల్లో కొత్త అవగాహన ఏర్పడిందన్నారు. ప్రాజెక్టులను ప్రారంభించి, రైళ్లను ప్రారంభించిన తర్వాత మోదీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కృషితో కేరళ అభివృద్ధిలో ఈ రోజు కొత్త ఊపును సూచిస్తుందన్నారు. రైలు కనెక్టివిటీ మరింత బలోపేతం అయిందని, ప్రారంభించిన ప్రాజెక్టులు తిరువనంతపురంను దేశంలోని ప్రధాన కేంద్రంగా మార్చడానికి సహాయపడతాయని ఆయన అన్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతీయ రైలు కనెక్టివిటీని మెరుగుపరచడానికి సహాయపడే మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను, త్రిస్సూర్-గురువాయూర్ ప్యాసింజర్ రైలును మోదీ ప్రారంభించారు. అదే విధంగా తిరువనంతపురంలో సిఎస్ఐఆర్‌ఎన్ఐఎస్‌టి ఇన్నోవేషన్, టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ హబ్‌కు శంకుస్థాపన చేశారు. 'పిఎం స్వానిధి' క్రెడిట్ కార్డ్‌ను ప్రారంభించారు. వీటితో పాటు, నగరంలోని శ్రీ చిత్ర తిరునాల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో అత్యాధునిక రేడియో సర్జరీ సెంటర్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. కొత్త పూజప్పుర ప్రధాన తపాలా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ గణనీయమైన అభివృద్ధి విజయాలకు కేరళ ప్రజలను, మొత్తం దేశాన్ని మోదీ అభినందించారు. విక్షిత్ భారత్ నిర్మించడానికి, మొత్తం దేశం కలిసి పనిచేస్తోందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన స్వాగత ప్రసంగంలో, ప్రధానమంత్రి ప్రారంభించిన ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిలో చాలా దూరం వెళ్తాయని అన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపు ఇ-మెయిల్స్

**నోయిడా:** గణతంత్ర దినోత్సవానికి ముందు దేశ వ్యాప్తంగా భద్రతా దళాలు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఉత్తర్ ప్రదేశ్ నొయిడాలోని శివనాడార్ పాఠశాల సహా గుజరాత్ అహ్మదాబాద్‌లోని సెయింట్ కబీర్, సెయింట్ జేవియార్ పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్, మెయిల్స్ వచ్చాయి. ఈ విషయమై వెంటనే అప్రమత్తమైన అధికారులు.. ముమ్మర తనిఖీలు చేపట్టారు. పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇంటికి పంపించారు. పాఠశాలల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు క్షుణ్ణంగా గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ప్రాథమిక తనిఖీల అనంతరం ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. ఇటీవల ఇలాంటి బెదిరింపు కాల్స్ ఎక్కువ అవుతున్నాయని, సంఘ విద్రోహులు సహా కొంతమంది ఆకతాయిలే ఇలాంటి కాల్స్ చేసి బెదిరిస్తున్నారన్నారు. సదరు బెదిరింపు కాల్, ఇమెయిల్ ఎక్కడ నుంచి వచ్చాయన్న విషయాన్ని తెలుసుకునే దిశగా ఐటీ అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.



# అమెజాన్‌లో 14 వేల మంది ఉద్యోగులు తొలగింపు!

**న్యూఢిల్లీ :** అమెజాన్ సంస్థ మరోసారి ఉద్యోగులను తొలగించనున్నది. వచ్చే వారం రెండో దఫా ఉద్యోగాల కోత మొదలుకానున్నది. సుమారు 14 వేల మంది ఉద్యోగులు త్వరలో తమ ఉద్యోగాన్ని కోల్పోనున్నారు. కంపెనీలో పనిచేస్తున్న దాదాపు 30 వేల మందిని తొలగించాలని ఆ సంస్థ నిర్ణయించిన విషయం తెలిసిందే. గత అక్టోబర్‌లో 14వేల వైట్ కాలర్ జాబ్స్‌ను తొలగించింది. అయితే ఈసారి కూడా గత ఏడాది తరహాలోనే ఉద్యోగుల సంఖ్య ఉంటుందని భావిస్తున్నారు. అయితే అమెజాన్ సంస్థ ప్రణాళికలు వెల్లడించేందుకు దాని ప్రతినిధులు ఆసక్తి చూపలేదు. అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటేల్, ప్రైమ్ వీడియో, హ్యూమన్ రీసోర్స్ లాంటి కేటగిరీల్లో కోత ఉండనున్నది.

# ఇండోర్‌లో కలుషిత నీటితో మరో 9 మందికి అస్వస్థత

**ఇండోర్:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత నీటి బాధితులు, మృతులు అంతకంతకూ పెరుగుతున్నారు. శుక్రవారం కూడా మోవ్ తహసీల్‌లో కలుషితమైన తాగునీరు సేవించి తొమ్మిది మంది అస్వస్థతకు గురైనట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి పట్టి బజార్, చందర్ మార్గ్ ప్రాంతాల నుండి నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు నమోదయ్యాయని వారు తెలిపారు. ఇండోర్ కలెక్టర్ శివం వర్మ రాత్రి ఆలస్యంగా మోవ్‌కు చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. బాధిత ప్రాంతాల నివాసితులతో ఆయన మాట్లాడారు అని ఒక అధికారి తెలిపారు. తొమ్మిది మంది రోగులు ఆసుపత్రి పాలయ్యాని, మరికొందరు ఇళ్లకు చేరుకుంటున్నాని చెప్పారు. చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాధవ్ హసాని ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం నుండి ఆరోగ్య శాఖ సిబ్బంది ఘటనా స్థలంలో ఉన్నారని అధికారి తెలిపారు. ఇండోర్ మెడికల్ కాలేజీ నుండి ఒక బృందం, ఇతర స్పెషలిస్ట్ డాక్టర్లను కూడా ఘటనా స్థలానికి పంపుతున్నట్లు ఆయన తెలిపారు. మోవ్ ఎమ్మెల్యే ఉషా ఠాకూర్ కూడా బాధిత వ్యక్తులను కలవడానికి ఆసుపత్రిని సందర్శించారు. అన్ని రోగులకు సరైన, ప్రభావవంతమైన చికిత్సను నిర్ధారించాలని కలెక్టర్ వర్మ ఆరోగ్య శాఖను ఆదేశించారు. ఆ ప్రాంతంలో నీటి నాణ్యతను తనిఖీ చేయాలని, పరిశుభ్రతను కాపాడుకోవాలని మోవ్ కంటోన్మెంట్ బోర్డును ఆదేశించారు. ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని వర్మ అన్నారు. ప్రభావిత ప్రాంతాలను సర్వే చేసి, ఏవైనా లక్షణాలతో బాధపడుతున్న నివాసితులకు తగిన చికిత్స అందించబడుతుందని, క్లిష్టమైన రోగులను ఆసుపత్రిలో చేర్చడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఏ రోగి పరిస్థితి విషమంగా లేదని, వారిలో కొందరిని పగటిపూట డిశ్చార్జ్ చేస్తామని ఆయన అన్నారు. గత నెలలో, ఇండోర్‌లోని భగీరత్‌పుర ప్రాంతంలో అనేక మంది అనారోగ్యానికి గురయ్యారు. నీటి కాలుష్యం కారణంగా ఏడు మరణాలు సంభవించాయి. ఈ వ్యాప్తి ఇప్పటివరకు 25 మంది ప్రాణాలను బలిగొందని స్థానిక నివాసితులు పేర్కొన్నప్పటికీ, జనవరి 15న మధ్యప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన స్థితి నివేదికలో ఐదు నెలల బాలుడితో సహా ఏడు మరణాలు నమోదయ్యాయని పేర్కొన్నారు.

## భారీ భద్రత మధ్య భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు వద్ద...

# భక్తుల 'వసంత పంచమి' పూజలు ప్రారంభం

8,000 మంది పోలీసులు, పారామిలిటరీ బలగాల మోహరింపు

హిందువుల ప్రార్థనలు సజావుగా జరిగాయని జిల్లా కలెక్టర్ ప్రియాంక్ మిశ్రా వెల్లడి

**ఇండోర్ :** భారీ భద్రత నడుమ మధ్యప్రదేశ్ ధార్ జిల్లాలోని 11వ శతాబ్దానికి చెందిన భోజ్‌శాలకమల్ మౌలా మసీద్ ఆవరణలో శుక్రవారం తెల్లవారుజామున వసంత పంచమి పూజలు ప్రారంభం అయ్యాయి. ఈ వివాదాస్పద స్థలంలో పూజలు చేయడానికి విశ్వాసులు భారీ సంఖ్యలో గుమిగూడారు. హిందువుల పండగ అయిన వసంత పంచమి, ముస్లిం కమ్యూనిటీకి చెందిన శుక్రవారం ప్రార్థనలు ఒకే రోజు రావడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఇదిలా ఉంటే దీనికి ముందురోజు సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం భోజ్‌శాలకమల్ మౌలా మసీద్ ఆవరణలో హిందువుల పూజలకు, శుక్రవారాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. వేర్వేరు సమయాలలో వీరు పూజలు, ప్రార్థనలు జరుపుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. సక్రమ నిర్వహణకు గట్టి చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మధ్యప్రదేశ్ ధార్ జిల్లాలోని భోజ్‌శాలకమల్ మౌలా మసీదు సముదాయం వద్ద చర్యలు చేపట్టారు. నగరంలో దాదాపు 8,000 మంది పోలీసులు, పారామిలిటరీ బలగాలను భద్రతా ఏర్పాట్ల కోసం మోహరింపజేశారు. సుప్రీంకోర్టు గురువారం ఒక నిర్దిష్ట సమయ విభజనను జారీ చేసింది. మత ఘర్షణలను నివారించడానికి ఒక ఫార్ములాను రూపొందించింది. హిందూ సమాజం సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు పూజలు చేసుకోవడానికి అనుమతించబడుతుందని, ముస్లిం పక్షం మధ్యాహ్నం ఒంటి గంట నుండి 3గంటల వరకు నమాజ్ చేసుకోవడానికి అనుమతించబడుతుందని ఆదేశాలు జారీచేసింది. భక్తులు సూర్యోదయం నుండే పూలతో అలంకరించబడిన కాషాయజెండాలతో ఆ చారిత్రక ప్రదేశంలో గుమిగూడటం ఆరంభించారు. స్థానిక సంస్థ అయిన భోజ్ ఉత్సవ సభ్యులు వేదమంత్రాలు, జపాల మధ్య వాగ్దేవి అని పిలవబడే సరస్వతీదేవి ప్రతిమను ప్రతిష్ఠించడం ద్వారా పూజను ప్రారంభించారు. హవన్‌కుండ్‌లో నైవేద్యాన్ని సమర్పించడం ద్వారా అఖండ పూజ (సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ నిరంతర ప్రార్థనల క్రమం ప్రారంభించబడింది.ఈ వివాదాస్పద కాంప్లెక్స్‌లోని ప్రతీమూలనూ భద్రతా సిబ్బంది తనిఖీలు జరిపింది.


## అంజనేయ మ్యాన్ పవర్ ఏజెన్సీస్, నిర్మల్

ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం

అంజనేయ మ్యాన్ పవర్ ఏజెన్సీస్ అధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో తెలంగాణ మైనారిటీ సంక్షేమ గురుకులాలలో విధులు నిర్వహించుటకై నిర్మల్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గారి లేఖ నం. Lr.No.206/TGMREIS/NRML/ThreeMen/2026,Dated:22.01.2026, 1.Telephonic Instructions of the District Incharge Officer, Erstwhile Adilabad, TGMREIS Hyderabad on Dt: 21.01.2026.ప్రకారం ఈ క్రింది వివరించబడిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు అర్హులైన నిర్మల్ జిల్లా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

ఉద్యోగ వివరాలు & అట్టి ఉద్యోగమునకు అర్హతలు ఈ క్రింది వివరించబడినవి.

| Sl.No | District | Name of the TMR School/Jr.College | Name of the vacant Post Sanctioned | No of Vacancies | Qualifications |
|---|---|---|---|---|---|
| 1 | Nirmal | TMRS & JC Nirmal Boys-1 | PGT Physical Science | 01 | M.Sc., Physics/Chemistry & (B.Ed with Physical Science) |
| 2 | | | PET | 01 | Any Degree, & BP.Ed |
| 3 | | TMRS & JC Khanapur Boys-1 | PGT Urdu | 01 | M.A, Urdu & B.Ed |
| 4 | | | PET | 01 | Any Degree, & BP.Ed |

Note: 1) Teaching Experience Minimum 3 years
2) Age: 21-44

కావున ఆసక్తి గల అభ్యర్థులు వారి దరఖాస్తు / బయోడేటతో పాటు అర్హత ధ్రువీకరణ పత్రములు జిరాక్స్ ప్రతులు మరియు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, తేది: 29.01.2026 వరకు సాయంత్రం 4 గంటల లోపు మా కార్యాలయం శ్రీ అంజేయ మ్యాన్ పవర్ ఏజెన్సీస్, నిర్మల్ ఇ.నం.7-2-65/4, బి2ఎ, సరస్వతి శివమందిర్ రోడ్, పద్మశాలి సంఘభవన్ వెనుక, బాగులవాడ, నిర్మల్ సమర్పించుటకై తెలుపనైనది.

గమనిక: ఇట్టి ఉద్యోగ ప్రకటనలో సవరణలు లేదా రద్దు పర్చుటకై శ్రీ అంజేయ మ్యాన్ పవర్ ఏజెన్సీస్ గారికి సంపూర్ణ అధికారం కలదు.

మరిన్ని వివరాలకు ఫోన్ : 9490848511, 08734-359474

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
24-01-2026
www.prajapaksham.in



# ట్రంప్ వెనుకడుగు వ్యూహాత్మకం

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికలో (డబ్ల్యుఇఎఫ్) ప్రసంగంలో గ్రీన్‌లాండ్ స్వాధీనంపై భూమి తలకిందులయ్యే ప్రకటన చేస్తారని ప్రపంచ పెట్టుబడిదారులు బెదిరిపోవటంతో స్టాక్ మార్కెట్లు ధమాల్ అయినాయి. బంగారం, వెండి కొత్త రెక్కలు తొడిగాయి. ఇంత ఉత్కంఠ కలిగించిన ట్రంప్ ఎందుకో వెనుకడుగు వేశారు, నమ్రత ప్రదర్శించారు. 'గ్రీన్‌లాండ్ మాది', దాన్ని స్వాధీనం చేసుకోదలిస్తే ఎవరూ అడ్డుకోలేరు' అంటూనే, అందుకు నేను 'బలప్రయోగం చేయను, చేయబోను' అని ప్రకటించారు. ఇది టెన్షన్‌లో ఉన్న యూరోపియన్ యూనియన్‌కు, నాటో సభ్యులకు ఉపశమనం కలుగజేసింది. అయితే డెన్మార్క్ కింద ఆర్కెటెక్ మంచు ఖండంలో స్వయం ప్రతిపత్తి కలిగిన విశాలమైన దీవి స్వాధీనం ఆకాంక్షలను ట్రంప్ విడనాడలేదు, వాయిదా వేశారు – అంతే. ఆ భారాన్ని పరోక్షంగా నాటోపై పెట్టారు. 'గ్రీన్‌లాండ్‌కు సంబంధించి, ముఖ్యంగా మొత్తం ఆర్కెటిక్‌కు సంబంధించి భవిష్యత్‌లో ఒప్పందం చట్రంపైకి దృష్టి మళ్ళించారు. ఆ ఒప్పందం కుదరటానికి 'కాలనిర్ణయం' లేదని అంటూనే, అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు పెట్టటానికి సంబంధించి, మిస్సైలీల దాడిని గగనతలంలోనే విధ్వంసం చేయటానికి సంబంధించిన 175 బిలియన్ డాలర్ల గోల్డన్ డోమ్ ఏర్పాటు చేయటంపై – గ్రీన్‌ల్యాండ్‌పై అదనపు చర్చలు జరుగుతున్నాయన్నారు. నాటో కూటమి సైన్యాధిపతి మార్క్ రట్టె ఆ తర్వాత అక్కడే ట్రంప్‌తో చర్యలు జరపటం ప్రాధాన్యత సంతరించుకుంది. నాటో సభ్యురాలైన డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్‌సన్ స్పందిస్తూ తమ సార్వభౌమత్వం గూర్చి చర్చలు జరిపే అధికారం రట్టేకు లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ రక్షణ వ్యవస్థ కోణం నుంచి గ్రీన్‌లాండ్ అమెరికా ఆస్తిగా ఉండవలసిందేనని పరోక్షంగా స్పష్టం చేశారు. అది బలప్రయోగం ద్వారా కాకుండా, ఎప్పుడు, ఎలా నెరవేర్చుకోవటంపైనే చర్చలుంటాయని ట్రంప్ ప్రస్తావనల అర్థం. 70 ఏళ్ళకు పైబడి యూరప్ రక్షణకు అమెరికా బాధ్యత వహిస్తున్నది. గ్రీన్‌లాండ్‌ను తమకు అప్పగించి యూరప్ రుణం తీర్చుకోవాలని ట్రంప్ కోరుకుంటున్నారు.

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను జనవరి 3న అపహరించి అమెరికా పట్టుకెళ్ళిన ట్రంప్ బందిపోటు చర్య దరిమిలా, కొలంబో, క్యూబా, ఇరాన్, మెక్సికోల్లో అదే తరహా జోక్యం గూర్చి బహిరంగంగా హెచ్చరించిన దుస్సాహసిక ప్రదర్శన దృష్ట్యా, గ్రీన్‌లాండ్ స్వాధీనంపై ఆయన ప్రకటనలు అమెరికా, యూరప్ మధ్య ఉద్రిక్తతలు పెంచాయి. తనను ధిక్కరిస్తున్నందున యూరప్ నుంచి కొన్ని లేదా అన్ని రకాల దిగుమతులపై ఫిబ్రవరి 1 నుంచి 10 శాతం సుంకం పెంచుతానని, జూన్ 1 నుంచి 25 శాతానికి పెంచుతానన్న ట్రంప్ హెచ్చరికలు నిప్పు మీద ఉప్పులా చిటపటలు సృష్టించాయి. కొద్ది నెలల క్రితమే అమెరికా–ఇయు వాణిజ్య ఒప్పందం కుదిరినా, ఈ అదనపు సుంకాల బెదిరింపుల కారణంగా దాన్ని రద్దు చేసుకుంటామని ఇయు ప్రకటించటం, ఐక్యంగా నిలబటంతో ఏకాకితనం నుంచి కాపాడుకునేందుకు దావోస్‌లో ట్రంప్ నమ్రత ప్రదర్శించారనవచ్చు. ఆ తర్వాత యూరప్‌పై 10 శాతం అదనపు సుంకాల విధింపును ట్రంప్ ఉపసంహరించుకున్నారు. దీర్ఘకాలిక చర్చలు, ఒప్పందాల ద్వారా ఏర్పడి నియమబద్ధంగా పనిచేస్తున్న అంతర్జాతీయ వ్యవస్థను ట్రంప్ ఏకపక్ష దూకుడు చిన్నాభిన్నం చేస్తున్నదనే భావన దావోస్‌లో నాయకుల ప్రసంగాల్లో వ్యక్తం కావటం గమనార్హం.

ఇదిలావుండగా, గాజా విధ్వంసానికి ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూకు అన్ని విధాలా మద్దతిచ్చిన అధ్యక్షుడు ట్రంప్, గాజా పునర్నిర్మాణం కోసం, అడ్మినిస్ట్రేషన్ కోసం గతంలో ప్రకటించిన 'బోర్డ్ ఆఫ్ పీస్' (శాంతి కోసం బోర్డ్)ను గురువారం కూర్పు చేశారు. 19 దేశాల నేతలు దాని చార్టర్‌పై సంతకాలు చేశారు. కాల్పుల విరమణ అమలు చేయటం, అమెరికా, గల్ఫ్ తదితర అంతర్జాతీయ పెట్టుబడితో గాజాను పూర్తిగా నేలమట్టం చేసి సుందరమైన అధునాతన నగరాన్ని నిర్మించటం దాని ప్రకటిత లక్ష్యం. ఈ బోర్డ్‌లో మూలవాసులు, బాధితులైన పాలస్తీనియన్‌లకు స్థానం లేదు. ఆధునిక నగరంలో వారికి స్థానం ఉండకపోవచ్చు.

పాలస్తీనా సార్వభౌమత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేశాడు ట్రంప్. పాలస్తీనియన్‌ల మాతృదేశ హక్కును, వారి దీర్ఘకాల పోరాటాన్ని కాలరాస్తున్నాడు. ఆహ్వానాలున్నప్పటికీ రష్యా, చైనా, భారత్, బ్రెజిల్ వంటి పెద్ద దేశాలేగాక ట్రంప్ యూరప్ మిత్రు లు కూడా ఇంకనూ చేరలేదు. ఐక్యరాజ్య సమితి సంస్థలనుంచి తప్పుకుంటున్న ట్రంప్ దానికి ప్రత్యామ్నాయంగా తన అధ్యక్షతన ఈ బోర్డ్ ఏర్పాటు చేశారని బలమైన అనుమానాలున్నాయి. ఈ బోర్డు గాజాలోనేకాదు, ప్రపంచంలో వివాదాలున్న ఎక్కడైనా శాంతి పేరుతో వాలిపోవచ్చు. సార్వభౌమాధికారాన్ని హరించవచ్చు. ఇది అమెరికా, దాని డాలర్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే బరితెగించిన చర్య. భారత్ ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించి వలసవాద వ్యతిరేకిగా గ్లోబల్ సౌత్ వాణిగా తన ప్రతిష్ట కాపాడుకోవాలి.



## కృత్రిమ మేధస్సు ఎవరి కోసం?

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఎఐ) చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీనిని సంపన్నులు ముందుకు తీసుకువెళ్తున్నారు. వారు సామాన్యుల గురించి పెద్దగా పట్టించు కోరనేది నా అభిప్రాయం. వారికి మరింత సంపద, అధికారం కావాలి. మనం దాని (ఎఐ)వేగాన్ని తగ్గించాలి. ఎఐ దేనికోసం అనే ప్రశ్న వేసుకోవాలి? రోగ నిర్ధారణ, రక్త పరీక్షలను ఎఐ మరింత మెరుగ్గా చేస్తే, అది మంచిదే. అలాగే ఫ్యాక్టరీలో కిందిస్థాయి పనులు చేసే కార్మికుల ఉత్పాదకతను పెంచి, వారానికి 20 గంటలే పనిచేసేలా ఎఐ చేస్తే మంచిదే. ఎఐ, రోబోటిక్స్ ఎవరికోసం పనిచేస్తాయి? మానవ జీవితాన్ని మెరుగుపరిచేందుకా? లేదా బిలియనీర్‌లను మరింత సంపన్నులను చేసేందుకా? అనే ప్రశ్నపై మనం దృష్టి సారించాల్సి ఉంది.

అమెరికన్ సెనేటర్ బెర్నీ సాండర్స్




## వివక్ష 'విషవలయం'లో బాలికల భవిత

నేటి బాలికలే రేపటి కుటుంబ వెలుగుల దివ్వెలు. బాలికల విద్యా వికాసమే భవిష్యత్తు లింగ సమానత్వానికి సాధనం. బాలికలు శక్తివంతం అయితే సమాజం శక్తివంతం అయినట్లే. భారతాన్ని ఉన్నత స్థాయిలో చూడాలంటే నేటి బాలికలను విద్యావంతులను చేయాలి. ఒక్క బాలిక చదువు, ఆ కుటుంబానికే అక్షర వెలుగు. బాలికలను నిర్లక్ష్యం చేస్తే సమాజం పలు సామాజిక సమస్యలతో చచ్చుబడి పోతుంది. బాలిక బలహీనమైతే రేపటితరం కూడా రోగాలమయం అవుతుంది. లింగ అసమానతల విష వలయంలో చిక్కిన నేటి బాలిక జీవితం ప్రశ్నార్థకంగా మారుతున్నది. నేటి సమాజంలో మహిళాశక్తిని రుజువు చేసిన అతివలు ఎందరో నేటి బాలికలకు ప్రేరణగా నిలుస్తున్నారు. బాలికల విద్యతోనే సమాజ ఉన్నతి సాధ్యపడుతుందని నినదించిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిభాయ్ పూలే నేటి బాలికలకు ఆదర్శం. దేశ ప్రధానిగా ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఇందిరా గాంధీ, సరోజినీ నాయుడు, రాణి ఝాన్సీ లక్ష్మి భాయి, రాణి రుద్రమ దేవి, అహల్యాభాయి హోల్కర్, మేరీ కోమ్, ఇందిర నూయి, నిర్మల సీతారామన్, నీతా అంబానీ, సుష్మా స్వరాజ్, సానియా మిర్జా లాంటి ఎందరో మహిళలు తమ సత్తా ను చాటుకొని సమాజాభివృద్ధికి అవిరళ కృషి చేశారు.

**భారత బాలికలను వేధిస్తున్న ప్రధాన సమస్యలు:** అమ్మాయి అంటే అత్తింటికి పోయేదే అని, బాలిక ఇంటి పనిమనిషి మాత్రమే అనే భావనలు నేటికీ తల్లిదండ్రుల్లో నెలకొని ఉండడం విచారకరం. బాలురతో సమానంగా పెంచాల్సిన బాలికలను తల్లిదండ్రులే చిన్నచూపు చూడడం క్షమించరానంత నేరం. బాలికలను కార్మికులుగా మార్చడం, అవిద్య, పెంపకంలో నిర్లక్ష్యం, లింగ వివక్ష, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, బలవంతంగా పడుపు వృత్తిలోకి నెట్టడం, శారీరక, మానసిక హింస, లింగ నిష్పత్తి పడిపోవడం, కనీస అవసరాల కొరత, వ్యక్తిగత అపరిశుభ్రత, నిరుద్యోగం, వంటింట్లోనే బందీ చేయడం, వరకట్న సమస్యలు, పోషకాహార లోపం, ద్వితీయ శ్రేణి పౌరురాలిగా పెంచడం, గర్భంలో బాలిక ఉందని తెలిసి భ్రూణ హత్యలు, గృహ హింస, ఆర్థిక అసమానతలు లాంటి పలు సవాళ్ల నడుమ భారతీయ బాలికలు బక్కచిక్కి పోతున్నారు.

**బాలికల సాధికారతతోనే భవ్యమైన భవిత:** ఇలాంటి అనేక సవాళ్ల నడుమ నలుగుతున్న బాలిక బాల్యానికి సంబంధించిన పూర్తి అవగాహన కల్పించటానికి 2008 నుంచి ప్రతి ఏట 24 జనవరిన జాతీయ బాలికల దినం పాటించడం జరుగుతున్నది. జాతీయ బాలికల దినం–2026 ఇతివృత్తంగా కూతురును శక్తివంతం చేయడం ద్వారా శక్తివంతమైన భారతం అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. బాలికల వికాసానికి ప్రభుత్వాలతో పాటు పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు ఎంతో కృషి చేయాల్సి ఉంది. బాలికలకు విద్య, స్వేచ్ఛాయుత వాతావరణంలో పెంపకం, పోషకాహార కల్పన, బాల్య వివాహాలకు అడ్డుకట్ట, బాలికలను కార్మికులుగా మార్చడాన్ని నేరంగా భావించడం, ఆరోగ్య సంరక్షణ, బాలికలకు భద్రత కల్పన, వరకట్న నిషేధం, సాధికారత సాధించే మార్గాల్లో నడపడం, లింగ సమానత్వ సాధన లాంటి చర్యలు బాలికల వికాసానికి దోహదపడతాయి. ఇదే క్రమంలో భారత ప్రభుత్వం తీసుకున్న పథకాల్లో బేటీ పడావో బేటీ బచావో, సుకన్య సమృద్ధి యోజన, బాలిక సమృద్ధి యోజన, లాడ్లీ స్కీమ్, బాలికల విద్య పథకాలు లాంటివి ఎన్నో ప్రవేశ పెట్టినప్పటికీ పరిస్థితిలో ఊహించినంత మార్పు కనిపించడం లేదు.

నేటి జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మన ఇంటి అమ్మాయిలను అబ్బాయిలకు తీసిపోకుండా సకల సౌకర్యాలను కల్పిస్తూ విద్యను నేర్పిస్తే రేపు అమ్మనాన్నల పేరును నిలపడానికి అమ్మాయిలు కూడా ముందుంటారు. నేటి ఆధునిక యుగపు మహిళలు చేరని రంగం లేదు, సాధ్యం కాని వృత్తి లేదు. మన బాలికలకు విద్య అనే జీవితకాల రక్షణ కవచం తొడిగి రేపటి భవ్య భవిష్యత్‌కు గట్టి శక్తివంతమైన బాలికల పునాదులు వేద్దాం.

*(24 జనవరి జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా)*

# 'శాంతి' పేరుతో ఆక్రమణ: పెట్టుబడితో స్వాధీనం!

## ఐరాసకు పోటీగా ట్రంప్ సామ్రాజ్యవాద విస్తరణ

టి.ఎస్.అశోక్

డోనాల్డ్ ట్రంప్ 'అభివృద్ధి అవకాశం'గా రీబ్రాండ్ చేయగలిగిన భౌగోళిక రాజకీయ విపత్తు ఎన్నడూ ఆయనకు ఎదురు కాలేదు. ఆయన తాజా పథకం – గాజా కోసం 'బోర్డ్ ఫర్ పీస్' (శాంతి కోసం కమిటీ) అనేది అత్యంత బరితెగించిన చర్య. ఈ పథకం మరొకరి భౌగోళిక ప్రాంతంపై అజమాయిషీని పోర్ట్ ఫోలియో మేనేజిమెంట్‌గా కప్పిపుచ్చుతున్నది. సైనిక ఆక్రమణను నిర్మాణ కాంట్రాక్టుగా పరివర్తన గావిస్తున్నది. నిఖార్సయిన సామ్రాజ్యవాద ప్రాజెక్టుకు దౌత్యపరమైన ముసుగుకప్పి ప్రపంచంలోని వర్ధమాన రాజ్యాలను దగా చేస్తున్నది.

ట్రంప్ గాజా భవిష్యత్‌ను పాలస్తీనియన్‌ల స్వయం నిర్ణయాధికార సమస్యగా కాకుండా ''పునర్నిర్మాణ పెట్టుబడి అవకాశం''గా ప్రతిపాదించారు. సార్వభౌమత్వం, అంతర్జాతీయ చట్టం, మానవ హక్కులు గూర్చిన ఇబ్బందికరమైన ప్రశ్నలు పక్కదారి పట్టించటానికి ట్రంప్ మార్గం కనుగొన్నారు. అంతకన్నా కీలకంగా, లాభాలు కురిపించే విదేశీ కాంట్రాక్టుల కోసం ఆకలితో ఉన్న దేశాలకు (ఉదా. భారత్) బోర్డు బల్లవద్ద సీటు ఇచ్చి, కార్యాచరణలో రవ్వంత చోటు ఇస్తే అవి సంతోషంగా తమ వెంట ఉంటాయని ట్రంప్ ఆశిస్తున్నాడు. ఈ రద్దీలో భారత్‌కు ఆహ్వానం గొప్ప ఎత్తుగడ. చైనా ప్రభుత్వ కంపెనీలు ఆఫ్రికాలో సగం నిర్మాణం చేయగా, బెల్ట్ అండ్ రోడ్‌లో చాలాభాగం పూర్తి చేయగా న్యూఢిల్లీ ఈర్ష్యతో చూస్తుండిపోయింది. భారతదేశ భారీ నిర్మాణ కంపెనీలు – లార్సెన్ అండ్ టుబ్రో, జిఎంఆర్, అదానీలకు ఆ సామర్థ్యం ఉంది.అయితే చైనా కంపెనీలకు టెండర్లు కోల్పోతూ గాని, లేక ఆచితూచి అడుగువేస్తున్న భారత విదేశాంగ విధానం వల్లగాని ఆ కంపెనీలు అంతర్జాతీయంగా పనిలేకుండా ఉన్నాయి. గాజా ప్రాంతం మొత్తాన్ని అమెరికా ఆర్థిక సహాయం, గల్ఫ్ ధనం కలయికతో పునర్నిర్మించే అవకాశం నోరూరించే అవకాశం కాదా?

ఇది ట్రంప్‌కు తెలుసు. భారత్ ఆవురావురుమంటున్న మెగా ప్రాజెక్టుగా ఆయన గాజాను చూపుతూ ఊరిస్తున్నాడు. పాలస్తీనా అథారిటీ పేరుతో ఉన్న ఆ ప్రజల నామమాత్రపు ప్రభుత్వాన్ని ఈ క్రమంనుంచి పక్కకు తోసేశారు. అంతేగాక, 1945 నుంచీ ఎంతో శ్రమపడి నిర్మించిన ప్రతి ఒక్క లీగల్ చట్రాన్నీ ఈ ''బోర్డ్ ఆఫ్ పీస్'' పక్కకు తోసేస్తున్నది. భారత్ గనుక బోర్డ్‌లో చేరినట్లయితే, ట్రంప్ చర్యను నయావలస వాదంగా విమర్శించేవారికి, ఇదిగో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ కూడా బోర్డులో ఉంది అని చూపే అవకాశం ట్రంప్‌కు దొరుకుతుంది. పాకిస్థాన్ ఇప్పటికే ట్రంప్ ఆహ్వానాన్ని అంగీకరించినందున బోర్డులో భారత్ పక్కనే పాకిస్థాన్ కూర్చుంటుంది. ఎప్పుడో టెర్రరిస్టు దాడులప్పుడుగాని వార్తల్లో కెక్కని పాకిస్థాన్ ఇక్కడ గౌరవనీయమవుతుంది. ఎప్పుడూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పాకిస్థాన్ బోర్డులో ఉండి చేయగలిగేదేమి ఉంటుంది? పాకిస్థాన్‌ను చూపించి, పాలస్తీనా సార్వభౌమత్వాన్ని బేరం చేయదగిన రియల్ ఎస్టేట్‌గా పరిగణించే క్రమాన్ని ముస్లిం దేశం కూడా ఆమోదించిందని చెప్పవచ్చు. అమెరికా నుంచి తగినంత ప్రతిఫలం ముట్టినపుడు, ముస్లిం దేశాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పాకిస్థాన్ అమెరికాతో సంఘీభావంగా ఉన్న సందర్భాలు చరిత్రలో చాలా ఉన్నాయి. బోర్డు సీటు మూల్యమే.

దక్షిణాసియాలోని రెండు ప్రత్యర్థి దేశాలకు బోర్డులో స్థానం కల్పించి ట్రంప్ పెద్ద తమాషా చేశాడు. పూర్తిగా అమెరికా స్వార్థంతో కూడిన ''భూ ఆక్రమణ''కు ''అంతర్జాతీయ చొరవ''ఆశీస్సులున్నట్లు చిత్రించాడు. ఈరెండు దేశాల ఉనికి ట్రంప్ పథకాన్ని చట్టబద్ధం చేయదు. దాన్ని ఇచ్చిపుచ్చుకునే వ్యాపారం చేస్తుంది.

గాజా జూదం ఎంత బరితెగించిన ప్రయత్నమో అవగాహన చేసుకోవటానికి దానికి ముందు జరిగిన వెనిజులా ఉదంతాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. జనవరి 3న అధ్యక్షుడు నికోలస్ మదురోను అపహరించిన ట్రంప్ ''శాంతి–భద్రత'' పునరుద్ధరణగా వేడుక చేసుకున్నాడు. అప్పుడు బంగారం కోసం పరుగులాగా అమెరికన్ ఆయిల్ కంపెనీలను కారకాస్ పంపాడు. ట్రంప్ పంపిన సందేశం – ట్రంప్ నిర్ణయించినపుడు సార్వభౌమాధికారం వర్తక సరుకు అవుతుంది. మీకు తగినంత సైనిక శక్తి ఉంటే ఆ సరుకులను మీరు తీసుకోగలుగుతారు. ఉత్తరోత్తరా దాన్ని విముక్తిగా సమర్థించుకోవచ్చు.

గాజాలో అదే ఆట ఆడుతున్నాడు. నౌకల దిగ్బంధం బదులు ''పెట్టుబడి కమిటీలు'', ప్రభుత్వం మార్పు బదులు ''టెక్నోక్రాటిక్ పరిపాలనా యంత్రాంగం'', దోచుకోవటం బదులు ''పునర్నిర్మాణ భాగస్వామ్యాలు''. సారాంశం ఒక్కటే : ''ఒక భూభాగంపై , దాని వనరులపై విదేశీ శక్తులు నియంత్రణ సాధించటం. అయితే అంతర్జాతీయ సూత్రాల కోపం నామమాత్రంగానైనా ఆరాటపడేవారిని మభ్యపెట్టేందుకై ప్యాకేజీని అందంగా తీర్చిదిద్దారు.

గాజా బోర్డు శూన్యంలో ఉండదు. సార్వభౌమాధికారాన్ని వస్తువుగా పరిగణించే ట్రంప్ విశాల సిద్ధాంతంలో భాగంగా ఉంటుంది. దాన్ని మార్కెట్ పరిస్థితులు బట్టి విక్రయించవచ్చు, కొనవచ్చు, ముందుగ మూసివేయవచ్చు. గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం ఆయన పునః ప్రయత్నం హాస్యోక్తి లేదా దృష్టి మరల్చే చర్య కాదు. అది పైన చెప్పిన సిద్ధాంతం తార్కిక పొడిగింపే. గాజాను ''పరిపాలించేందుకు మీరు బోర్డులో కూర్చోగలిగినప్పుడు, డెన్మార్క్‌నుంచి ఒక వ్యూహాత్మక ఆర్కెటిక్ భూభాగాన్ని''కొనుగోలు'' చేసేందుకు దోహదం చేసేందుకు మీరు ఎందుకు సమావేశం కాకూడదు?




గాజా నమూనా ఒక భావనకు రుజువు. పాలస్తీనా భూభాగం ''ధ్వంసం'' అయ్యింది, దానికి''మేనేజ్‌మెంట్'' అవసరం అనే కారణంతో ఆసక్తి గల దేశాల కూటమి పాలస్తీనా సార్వభౌమత్వాన్ని త్రోసి పుచ్చటాన్ని ప్రపంచం ఆమోదిస్తే, గ్రీన్‌లాండ్‌కు అదే తర్కం వర్తింపజేయకుండా ఏ సూత్రం నిరోధించగలుగుతుంది? అది ''అభివృద్ధికి నోచుకోలేదు'', అక్కడ'' కీలకమైన వనరులున్నాయి'' అనే వాదన ప్రయోగించవచ్చు. అంతర్జాతీయ వ్యవస్థ వెనక్కునెట్టేలోపు ఎంతమేరకు సార్వభౌమత్వం హరించవచ్చో ట్రంప్ పరీక్షిస్తున్నాడు. సరైన వ్యక్తులకు సరైన ప్రలోభాలు ఇచ్చినట్లయితే చాలాభాగం హరించవచ్చని ట్రంప్ భావిస్తున్నాడు.

ఈ గాజా ప్రాజెక్టు నిజస్వభావాన్ని ఆ బోర్డులోని సభ్యులే వెల్లడిస్తున్నారు. ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్, స్టీవ్ విట్‌కోఫ్ – ఇద్దరు రియల్ ఎస్టేట్ డెవలపర్స్– బోర్డు కార్యనిర్వాహక కమిటీలో ఉన్నారు. దౌత్యవేత్తలుగానీ, మానవతావాద నిపుణులు గానీ లేరు. మధ్య ప్రాచ్యం పండితులూ లేరు. 75 సంవత్సరాలుగా రక్తం ఒడుస్తున్న గాయాలకు చికిత్సచేసేవారెవరూ లేకపోగా, భవంతుల నిర్మాణంలో, ధనం ఏర్పాటు చేయటంలో నిపుణత కలిగిన వారున్నారు.

ఒకవేళ ట్రంప్ ఊహిస్తున్నట్లు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా గాజా పునర్నిర్మాణం జరిగితే పాలస్తీనా ప్రజల రాజకీయ భవితవ్యం బోర్డు రూంలో నిర్ణయమవుతుంది. అందులో వారికి సీటు, ఓటు, వీటో ఉండదు! భారత దేశం తన వలసవాద వ్యతిరేక అర్హతలు గూర్చి, గ్లోబల్ సౌత్ వాణిగా ఉంటున్నందుకు, సార్వభౌమాధికారాన్ని, ఇతరుల వ్యవహారాల్లో బేజోక్యాన్ని ఛాంపియన్ చేస్తున్నందుకు గర్వపడుతున్నది. ట్రంప్ గాజాబోర్డులో చేరితే ఇదంతా మట్టిగొట్టుకు పోతుంది. నిర్మాణ ప్రాజెక్టుల కోసం భారత్ అమ్ముడుపోయిందన్న అపప్రద మూటగట్టుకోవాల్సి వస్తుంది.

(ఐపిఎ సర్వీస్)

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారంనాడు దావోస్‌లో తన 'బోర్డ్ ఆఫ్ పీస్' చార్టర్‌ను ఆవిష్కరించారు. 19 దేశాలు ఈ ఉత్సవంలో దానిపై సంతకాలు చేసి భాగస్వాములైనాయి. అయితే రష్యా, చైనా, భారత్, బ్రెజిల్ వంటి ప్రపంచ ప్రాముఖ్యత గల దేశాలేగాక ట్రంప్ పశ్చిమ మిత్రులు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, ఇయు అందులో చేరలేదు. ట్రంప్ అందర్నీ తన ఉచ్చులోకి ఆహ్వానించారు. పాకిస్థాన్ చేరింది. ఈ బోర్డు ప్రస్తుతానికి గాజా పునర్నిర్మాణానికి అని చెబుతున్నప్పటికీ ప్రపంచంలో ఎక్కడైనా వివాదాల్లో మధ్యవర్తిత్వం నెరిపే పేరుతో జోక్యం చేసుకునే వీలుంది. ప్రకటించిన చార్టర్‌లో నిర్దిష్టంగా గాజాకోసం అని లేదు. ఒక రోజున కశ్మీర్‌లోనూ తిష్టవేయవచ్చు! అంతర్జాతీయ బహుళపక్ష వేదికగా ఉన్న ఐక్యరాజ్యసమితితో ఈ బోర్డుకు సంబంధం లేదు. దీనికి అధ్యక్షునిగా ట్రంప్ తనను తాను ప్రకటించుకున్నాడు. ఇది ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా పనిచేసే ప్రమాదం ఉంది. ప్రపంచంపై అమెరికా, దాని డాలర్ ఆధిపత్యం నిలబెట్టేందుకు స్వతంత్ర రాజ్యాల సార్వభౌమత్వాన్ని తృణీకరించి ఎక్కడ ఏ ప్రాంతాన్నైనా స్వాధీనం చేసుకోవచ్చు. గ్రీన్‌లాండ్ ఉదంతం ఇందుకు తాజా ప్రత్యక్ష ఉదాహరణ. భారత ప్రభుత్వం ఇప్పటికైతే బోర్డులో చేరలేదు. కాని ట్రంప్ ఆహ్వానాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారవర్గాలు చెప్పాయి.

ఐదు వామపక్ష పార్టీలు – సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ – ఇప్పటికే ఆ ప్రతిపాదనను నిరాకరించాలని మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి : ''ట్రంప్ ప్రతిపాదించిన బోర్డ్ ఉద్దేశపూర్వకంగా ఐక్యరాజ్యసమితిని నిరాకరిస్తూ, అమెరికా నియంత్రణలో కొత్త అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పాటును కోరుకుంటున్నది. ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ సంస్థలను త్రోసిపుచ్చే అమెరికా ప్రయత్నాలను గట్టిగా వ్యతిరేకించాలి. భారతప్రభుత్వం అటువంటి ప్రతిపాదనలకు దూరంగా ఉండాలి; అమెరికన్ సామ్రాజ్యవాద ఆకాంక్షలనుండి బెదిరింపులు ఎదుర్కొంటున్న పాలస్తీనా, గ్లోబల్ సౌత్ (దక్షిణార్థ గోళంలోని వర్ధమాన దేశాలు) లోని ఇతర దేశాల పక్షాన దృఢంగా నిలబడాలి.''

ఇది స్వాతంత్ర్యం పొందిన నాటినుంచీ ఈ దేశం విధానం. మోదీ ప్రభుత్వం దానికి సమర్ధనగా నిలబడుతుందా? — సం||

# ఐటి హబ్‌తో జిల్లాలకు ఉద్యోగ శక్తి.. రాష్ట్రానికి సమతుల్య ప్రగతి

తెలంగాణ రాష్ట్రం ఐటి రంగంలో దేశానికే దిశానిర్దేశం చేసిన రాష్ట్రంగా గుర్తింపు పొందింది. హైదరాబాద్ ప్రపంచస్థాయి ఐటి హబ్‌గా ఎదిగి రాష్ట్రానికి ఆదాయం, ఉపాధి, అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చింది. అయితే ఈ అభివృద్ధి రాజధానికే పరిమితమవడం వల్ల జిల్లాల యువతకు ఆ వెలుగు సమానంగా అందడం లేదు. ఉద్యోగాల కోసం వలసబాట పట్టడం ఇప్పటికీ తప్పని పరిస్థితిగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రాల్లో, ముఖ్యంగా జగిత్యాల వంటి నూతన జిల్లాల్లో ఐటి హబ్‌లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఒక ప్రాంతీయ కోరిక మాత్రమే కాదు.. ఇది తెలంగాణ భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన మౌలిక ప్రశ్న.

జగిత్యాల జిల్లాతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రతి ఏటా వేలాదిమంది విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీ, పిజి పూర్తిచేసి హైదరాబాద్, బెంగళూరు, ముంబయి వంటి మహానగరాలకు, కొందరు విదేశాలకు కూడా వెళ్లి ఐటి ఉద్యోగాలు చేస్తున్నారు. నెలకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు జీతాలు వచ్చినా, అక్కడి జీవన వ్యయం, అద్దెలు, ప్రయాణ ఖర్చులు, కుటుంబానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితులు వారి జీవితాన్ని ఒత్తిడికి గురిచేస్తున్నాయి. చేతిలో జీతం ఉన్నా, చేతిలో నిల్వ ఉండడం లేదు. మనశ్శాంతి మరింత దూరమవుతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు.. సామాజిక, కుటుంబ వ్యవస్థలపై పడుతున్న ప్రభావం. ఇదే జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐటి హబ్ ఏర్పాటు చేస్తే పరిస్థితి పూర్తిగా మారుతుంది. స్థానిక యువత తమ ఊరిలోనే ఉద్యోగాలు చేసుకుంటూ వ్యవసాయం, కుటుంబ వృత్తులను కొనసాగించగలుగుతుంది. తల్లిదండ్రులు, భార్యా పిల్లలతో కలిసి సొంత ఇంట్లోనే జీవిస్తూ ఉద్యోగం చేయగల అవకాశం కలుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి వస్తుంది. చిన్న వ్యాపారాలు, సేవా రంగం విస్తరిస్తాయి. వలసలు తగ్గి సామాజిక స్థిరత్వం పెరుగుతుంది. ఇది కేవలం ఉద్యోగాల సృష్టి మాత్రమే కాదు.. సామాజిక సమతుల్యతకు దారి తీసే అభివృద్ధి నమూనా.




ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలోని పలు పట్టణాల్లో ఐటి పార్కులు, ఐటి హబ్‌ల విస్తరణపై ప్రకటనలు చేసింది. ఇప్పుడు ఆ మాటలను స్పష్టమైన విధానంగా మార్చాల్సిన సమయం వచ్చింది. ప్రతి జిల్లాకు కనీసం ఒక ఐటి హబ్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో దశలవారీ కార్యాచరణ రూపొందిస్తే, తెలంగాణ దేశంలోనే ఒక ప్రత్యేక అభివృద్ధి మోడల్‌గా నిలుస్తుంది. రోడ్లు, విద్యుత్, ఇంటర్నెట్ వంటి మౌలిక వసతులు జిల్లాల్లో ఇప్పటికే చాలావరకు అందుబాటులో ఉన్నాయి. అవసరమైంది రాజకీయ సంకల్పం, పరిపాలనా సమన్వయం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం. జిల్లాల్లో ఐటి హబ్‌లు ఏర్పడితే హైదరాబాద్‌పై భారం తగ్గడమే కాకుండా, రాష్ట్రంలోని మానవ వనరుల్ని సమర్థంగా వినియోగించుకున్నట్లవుతుంది. పరిశ్రమలకు కూడా ఇది లాభదాయకమే. నగరాలతో పోలిస్తే జిల్లాల్లో భూమి, అద్దెలు, నిర్వహణ వ్యయం తక్కువగా ఉంటుంది. స్థానికంగా నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉంటుంది. విన్–విన్ మోడల్ ఇది— యువతకు ఉపాధి, పరిశ్రమలకు వ్యయ తగ్గింపు, ప్రభుత్వానికి సమతుల్య అభివృద్ధి.

ఇక ముఖ్యంగా, ఉద్యోగాల కోసం నగరాలకు వలస అన్న పాత ఆలోచనకు తెరదించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగాలే జిల్లాలకు రావాలి అన్నదే కొత్త దృష్టికోణంగా ప్రభుత్వం స్వీకరించాలి. ఐటి హబ్‌లు కేవలం భవనాలు కాదు.. అవి జిల్లాల భవిష్యత్‌కు పునాది. నూతన జిల్లాల్లో ఐటి హబ్‌ల ఏర్పాటు ద్వారా యువత ఆశలు నిలబడతాయి, కుటుంబ వ్యవస్థ బలపడుతుంది, గ్రామీణ–పట్టణ విభేదం తగ్గుతుంది. ప్రభుత్వానికి ఇది ఒక విజ్ఞప్తి మాత్రమే కాదు.. ఒక అవకాశం. జగిత్యాల వంటి జిల్లాలతో మొదలుపెట్టి, రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఐటి హబ్‌లు ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని స్పష్టంగా ప్రకటించి, కాలపరిమితితో కూడిన కార్యాచరణ చేపడితే.. అది చరిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుంది. ఐటి హబ్‌ల ద్వారా జిల్లాలకు ఉద్యోగ శక్తి.. అదే తెలంగాణకు సమతుల్య ప్రగతి.

**శ్రీనివాసరెడ్డి, కలగిరి**

## మరణంలేని యోధుడు సుభాష్

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** మరణం లేని యోధుడు సుభాష్ చంద్రబోస్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. శుక్రవారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలోని కార్యాలయం ఎదురుగు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఉమామహేష్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం నుండి బ్రిటిషర్లను పారద్రోలాలంటే ప్రజలకు సైనిక శిక్షణ అవసర మని వారికోసం ఆజాద్ హింద్ ఫౌండేషన్‌ని స్థాపించి వేలాది మందికి శిక్షణనిచ్చి ప్రజలను చైతన్యపరిచిన మొట్టమొదటి నాయకుడు సుభాష్ చంద్ర బోస్ అని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.స్వామి, సహాయ కార్యదర్శులు రాములు, హరినాథ్‌రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్ సిపిఐ నాయకులు దుర్గయ్య, కె.వెంకటేష్, రవి, సామెల్, యాదగిరి, శ్రీనివాస్ చారి, నారాయణ మేస్త్రీ, యువజన నాయకులు కీర్తి, వంశీ, సుంకిరెడ్డి, నరేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యలో సంస్కరణలు



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ శుక్రవారం జరిగింది. ఈ సమావేశాన్ని ప్రిన్సిపాల్ సురేశ్వర స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఇంటర్మీడియట్ విద్యలో సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. నవాబ్ పేట్ సబ్ ఇన్స్పెక్టర్ పుండ్లీక్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు మంజుల, నరేష్, రమేష్, శ్రీనాథ్, వెంకటయ్య, ఉషారాణి, రవీందర్ నాయక్, కరుణాకర్, మధుసూదన్ రెడ్డి, సీతా రాజు రికార్డ్ అసిస్టెంట్ కీర్తి, ఆఫీస్ సబార్డినేట్ సురేష్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## ఆరైవ్, అలైవ్ అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఐడిఎల్, రంగధాముని చెరువు వద్ద శుక్రవారం ఆరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సైబరాబాద్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ డిసిపి రితిరాజ్, మేడ్చల్ ట్రాఫిక్ డిసిపి రంజన్ రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిసి వాణిరెడ్డిని కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/నాగారం:** ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నాగారంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. మేడ్చల్ జిల్లా బిజెపి నాయకులు జూపల్లి నరేష్, తడిసిన సూర్యశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహోత్సవంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ధర్మకర్తలు బుచ్చిరెడ్డి, వేణుగౌడ్, రవీందర్, రాజు, సునీత, శ్రీనివాస్‌చారి, గణేష్, రషీద్, కృష్ణగౌడ్, పిల్లి ఆంజనేయులు, మాధవిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, సిద్ధనోళ్ల సంజీవ్‌రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, అరుణ్‌రెడ్డి, చంద్రకళ, అనితరెడ్డి, రజిత, గఫ్ఫార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** స్వాతంత్ర్య సమరయోధుడు,ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహనికి రుద్రగోని రాంచందర్‌గౌడ్ నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాగీరు సత్యనారాయణగౌడ్, కీసర ప్రేమ్ కుమార్, సత్యం యాదవ్, కాసుల నందం గౌడ్, సురేష్‌గుప్తా, బాలకృష్ణగౌడ్, తైదల బీరప్ప, ఆటో గిరి పాల్గొన్నారు.

## నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/మర్పల్లి :** ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు వరమని పట్లూర్ గ్రామ సర్పంచ్ పరుశరాం అన్నారు. సోమవారం మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురేష్‌యాదవ్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్లుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్, మహేష్, గోవర్ధన్, శేఖర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, ప్రణాళికతోనే లక్ష్యసాధన

మంత్రి వివేక్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** విద్యార్థులు తమ లక్ష్యం సాధన చేరుకునేంతవరకు బాధ్యతలు మర్చిపోవద్దని , క్రమశిక్షణ, ప్రణాళికతోనే లక్ష్యసాధన సులువవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ సూచించారు. శుక్రవారం కెఎల్ యూనివర్సిటీ బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ క్రమశిక్షణ బాధ్యత ప్రణాళిక వంటి అంశాలపై సోదాహరణంగా విశ్లేషించారు. కళాశాల యూనివర్సిటీలలో నేర్చుకునే విద్య అత్యంత విలువైనదన్నారు. క్రమశిక్షణతో చదివితే విద్యార్థులు అత్యున్నత శిఖరాలను తీసుకుని వెళ్తుందదన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఆశయాలను నిర్లక్ష్యం చేయవద్దని, వారు ఎన్నో కష్టాలు పడి తమ పిల్లల కోసం చేసే త్యాగాలు గుర్తించాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి అమలు చేస్తుందన్నారు. ఉన్నత విద్య వైద్యం రంగల అభివృద్ధికి యూనివర్సిటీ అమలు చేస్తున్న స్కాలర్‌షిప్ విధానం బాగుందని మంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమొంటో, మోడల్స్‌ను అందజుశారు. మెరిట్ విద్యార్థులకు ఏటా అందిస్తున్న 100 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సహించే లక్ష్యంతోనే ప్రతియేటా జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. విద్యారంగంలో కాకుండా అనేక రంగాల్లో రాణించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల కెజిఎం రవికుమార్, కెఎల్ హెచ్ బాచుపల్లి క్యాంపస్ ప్రిన్సిపల్ రవికుమార్, గ్లోబల్ బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ ఆనంద్, యూనివర్సిటీ తెలంగాణ ఇన్చార్జ్ రాజేష్, జోనల్ హెడ్ రాజ్యలక్ష్మి, యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ హెచ్‌ఎన్‌ఆర్ మూర్తిం పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ముస్లిం మైనార్టీల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని బి బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆశ, మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్‌యాదవ్‌లు తెలిపారు. శుక్రవారం మౌలాలి డివిజన్‌కు చెందిన మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు మబషిర్ షారూఖ్, రహిముద్దిన్, మైమూదా, ముక్తార్, షకీల్ సిద్దిఖ్, ప్రేమ్, అన్వర్, రషీద్, షబ్బీర్, షౌఖత్, తనీష్, హనీష్, అశోక్, నాని తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం : దత్తాత్రేయ



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బోరంపేటలో బిజెపి ఆధ్వర్యంలో రైతు సమస్యలపై హర్యానా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ నుంచి జిహెచ్‌ఎంసిలో విలీనమైన తర్వాత కన్జర్వేషన్ జోన్లు రైతులకు శాపంగా మారిందన్నారు. నష్టపోతున్న సామాన్య, సన్న, చిన్నకారు రైతులకు అండగా ఉంటామన్నారు. రైతుల తరపున ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తామని హామీ ఇచ్చారు. సామాన్య, సన్న, చిన్నకారు రైతుల సమస్యలపై పరిష్కారం కోరతామని, స్పందించని యెడల ఉద్యమ రూపంలో ప్రభుత్వాన్ని మేడలు వంచి సాధించుకుందాం అని రైతులకు సూచించారు. దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమం మాజీ సర్పంచ్‌లు ఎస్.మల్లారెడ్డి, అర్కల వీరేశం గౌడ్, కొమ్ము మంగమ్మ, ఎస్.జంగారెడ్డి, డి.విగ్నేశ్వర్ చారీ, నల్ల రామచంద్రరెడ్డి, డి.ప్రభాకర్ రెడ్డి, సరిగారీ సత్తిరెడ్డి, ఆకుల సత్యనారాయణ, పి.మాధవరెడ్డి, ఆకుల మల్లేష్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు దమ్మగారి సీతారాంరెడ్డి, తురాయి భాను గౌడ్, ఆర్.నర్సింహాచారి, ఆకుల విజయ్, యశ్వంత్, చిన్న, తలారి రాజ్ కుమార్, నామాల శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం, అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట్ మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు యాంత్రీకరణ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలను మండలం లోని వివిధ గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, చేర్మెన్ బలవంత్ రెడ్డి, పిఏసి ఎస్ చైర్మన్ పోలీస్ రామ్‌రెడ్డి, ఎమ్మార్వో జె.బుచ్చయ్య, డిప్యూటీ ఎమ్మార్వో నవీన్‌రెడ్డి, ఎంపిడిఓ అనురాధ, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, సీనియర్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, సర్పంచ్‌లు, మాజీసర్పంచ్‌లు రావుగారి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు



**ప్రజాపక్షంట/కాప్రా :** వసంత పంచమి ఒదర్భంగా మల్లాపూర్ డివిజన్‌లోని సరస్వతి దేవి ఆలయంలో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శైలేష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సూర్యవర్ధన్, నిర్వాహకులు, దేబాబ్రత, రాజు రాయ్, మోహవ్రత, భట్టాచార్య, సాధక జన, ప్రదీప్ సాహు, శతృగన్, కబిందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**చర్లపల్లి:** వసంత పంచమిని పురస్కరించుకుని నాగారం సెరినిటీ పాఠశాలలో చిన్నారులకు సుబ్రహ్మణ్యం పంతులుతో తల్లిదండ్రులు సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ వ్యవస్థాపకులు నోముల వసంత, కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి పాల్గొన్నారు. కుషాయిగూడ శ్రీ శిశు మందిర్ స్కూల్ వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు.




## రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను నివారిద్దామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు అలైవ్ అరైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రాతో కలసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు అతివేగాన్ని నియంత్రించుకోవాలని, వేగం కంటే ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్పీ ఎన్ యాదయ్య, టౌన్ సిఐ సంతోష్‌కుమార్, రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డిసిసిబి మాజీ వైస్‌చైర్మన్ రవిందర్‌గౌడ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జయప్రసాద్, నాయకులు పట్టణ వాసులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు కీలకం

మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు హక్కు ప్రధానమైందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా జనవరి 25న జరుపుకుంటున్న జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, ఇతర జిల్లా అధికారులు, సిబ్బందితో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను ఆయన వివరిస్తూ ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ, క్యారమ్స్, చెస్, టగ్ ఆఫ్ వార్, లాంటి పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేసారు. అనంతరం జిల్లా అధికారులు, సిబ్బంది మై ఇండియా మై ఓట్ అంటూ ర్యాలీ నిర్వహించారు.






**దుండిగల్ :** నేషనల్ ఓటర్స్‌డే కార్యక్రమాలలో భాగంగా గండి మైసమ్మ ఎమ్మార్వో ఎన్. రాజేశ్వర్ రెడ్డి,దుండిగల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ సర్కిల్ ఆఫీస్ వద్ద, 18 సంవత్సరాల నిండిన పౌరులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు అదేవిధంగా బహదూర్ పల్లి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ వద్ద జరిగిన కార్యక్రమంలో కాలేజీ స్టాఫ్ మరియు విద్యార్థిని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గండి మైసమ్మ ఎంఎంసి బి.లక్ష్మణ్, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

**వికారాబాద్ :** ప్రజాస్వామ్యములో ఓటు హక్కు వజ్రాయుధమని, 18సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికారులతో ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్చగా తమ ఓటు హక్కు వినియోగింకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సుధీర్ రాజేశ్వరి, డిఆర్ఓ మంగిలాల్ , సత్తార్, నేమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**ధారూర్ :** ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు వజ్రాయుధమని తహసీల్దారు సాజిదా బేగం అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్బంగా ఓటరు ప్రతిజ్ఞ గావించి ఓటు హక్కు గురించి భవిష్యత్తు ఓటర్లకు వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు పాముఖ్యతను వివరించారు.

**నవాబుపేట్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నవాబుపేట మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎమ్మార్వో జె. బుచ్చయ్య ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అనురాధ, డిప్యూటీ ఎమ్మార్వో నవీన్ రెడ్డి, ఎస్సై పండ్లిక్, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్, పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డి, మండల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.










## నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యం

### ఎల్‌బినగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యం అని ఎల్ బి నగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల యందు దాదాపు ఒక కోటి యాభై లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాల (నూతన మంచినీటి పైప్ లైన్ పనులకు యుజిడి) శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు. దానిలో భాగంగా నర్సింహస్వామి కాలనీ, మల్లికార్జున హిల్స్, రామాంజనేయ కాలనీ, సహదేవ్ సింగ్ నగర్, ఆనంద్ నగర్ నుంచి ఫతుల్ళ గూడ పోయే దారిలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికి పలు కాలనీలు ముంపుకు గురయ్యేవని ప్రస్తుతం బాక్స్ డ్రైన్స్, ట్రంక్ లైన్స్ నిర్మాణల వల్ల ముంపు సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కలిగించడం జరిగిందని అన్నారు..ఇట్టి కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చెరుకుప్రశాంత్, డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సతీశ్, ఆజాద్, సీతారాములు, పి.ఎం.ఆర్.రాజు ,శ్యామ్, భాస్కర్, పలు కాలనీల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, డివిజన్ పరిధిలోని మహిళలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, యువత ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.



## విద్యార్థులు ఎంచుకున్న సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలి

### అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులు ఎంచుకున్న సబ్జెక్టులపై అవగాహన పెంచుకొని ముందుకు వెళ్తేనే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అవకాశం ఉంటుందని అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా టీచర్ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థి దశలో మలుపు తిప్పేదని, తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవడమే కాకుండా బంగారుమయంగా ఉంటుందని అన్నారు. నేడు ఉన్నతమైన పదవుల్లో ఉద్యోగులు ఉన్నారంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి వచ్చిన వాళ్లే అన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గమనించాలని సూచించారు. తరగతి గదిలో అధ్యాపకులు పాఠ్యాంశం ఎలా బోధిస్తున్నారనే విషయాన్ని గమనించి నేర్చుకొని తిరిగి అప్పగించినప్పుడు దానికి సార్థకత లభిస్తుందని వివరించారు. పరీక్షల్లో 95శాతం మార్కులే కాకుండా వందశాతం మార్కులు సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం విద్యార్థులపై ఉందని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో కొత్త భవనం నిర్మించడమే కాకుండా విద్యార్థులకు మౌళిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా షాద్‌నగర్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మాడల్ జూనియర్ కళాశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ నాగయ్య, ఎంఇఒ మనోహర్, ఇంటర్ విద్య డిఐఇఒ వెంక్యానాయక్, పూలే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రీతి, ఫరూఖ్‌నగర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి, బాలికల పాఠశాల హెచ్‌ఎం పద్మ, కుంట హైస్కూల్ నుండి రాంచందర్, అమ్మ ఆదర్శ పాఠశాల నుండి సరితతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.




## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వాక్చాతుర్యం ఉండాలి

**ప్రజాపక్షం/కేశంపేట:** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు..వాక్చాతుర్యం.. ప్రజాస్వామ్య విలువలు తెలిసి ఉండాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో దేశ పాలన వ్యవస్థ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం (మాక్ పార్లమెంట్) పై విద్యార్థులకు అవగాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ప్రజాస్వామ్య విలువలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. మాక్ పార్లమెంట్‌లో స్పీకర్‌గా కుమారి రాధిక, ప్రధాన మంత్రి పాత్రలో సానియ, హోం మంత్రి పాత్రలో అర్చన, వ్యవసాయ మంత్రిగా శ్రీ చరణ్, విద్యాశాఖ మంత్రిగా సౌభాగ్య, ప్రతిపక్ష నాయకుల పాత్రలో విద్యార్థులు ఎంతో అద్భుతంగా పోషించి అందరినీ అకట్టుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. మాక్ పార్లమెంట్ సమావేశంలో విద్యార్థులు దేశంలోని సమకాలీన సమస్యలైన విద్యా విధానం, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక కీలక అంశాలపై విస్తృతంగా చర్చించడం అభినందనీయమని వివరించారు. ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, అప్పుడే సమాజ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించేందుకు అవకాశాలు ఉంటాయని పేర్కొన్నా రు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని చిన్నారులకు విద్యారణ్య భారతి స్వామీజీ చే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. 400 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడం విశేషం. చిన్నారులకు పలక బలపం,అమ్మవారి కుంకుమ, ప్రసాదం అమ్మవారి ఫోటోను దేవాలయ కమిటీ తరుపున అందజేశారు.10 వతరగతి విద్యార్థులతో సరస్వతి హోమం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి దాదాపు 350మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టాలు దక్కేవరకు అండగా ఉంటాం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్:** నిరుపేదలకు పట్టాలు దక్కేవరకు తాము అండగా ఉంటామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, భూ పోరాట కమిటీ అధ్యక్షుడు అందోజు రవీంద్రచారి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రావి నారాయణరెడ్డి కాలనీ పేస్ 3లో భూ పోరాటానికి నాంది పలికి మూడు వసంతాలు పూర్తి చేసుకుని నాలుగో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని గుడిసెలు వేసుకొని భూ పోరాటంలో పాల్గొంటున్న నిరుపేదలతో కలసి గురువారం రాత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, భూ పోరాట కమిటీ అధ్యక్షుడు అందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ మాట తప్పడం మడమ తిప్పడం సిపిఐ పార్టీ చరిత్రలో లేదని, నిరుపేదలకు పట్టాలు దక్కేవరకు సిపిఐ ఆధ్వర్యంలో తాము అండగా ఉంటామని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఆటంకాలు చోటుచేసుకున్నా అక్రమ కేసులు బనాయించిన, మొక్కవోని పట్టుదలతో భూ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్తూ మూడు సంవత్సరాలు పూర్తిచేసుకుని నాలుగవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న మన పోరాటానికి నిరుపేదల ఆశీస్సులే కొండంత అండదండలని అన్నారు.

భూ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న సిపిఐ నాయకులపై అక్రమ కేసులు బనాయించారని, ఇక్కడ నిరుపేదలు ఇల్లు కట్టుకొని నివసిస్తే భూస్వాముల భూముల ధరలు పడిపోతాయనే అక్కసుతో భూ పోరాట కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు తాము పోరాటం కొనసాగిస్తుంటే భూ స్వాములు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. అన్ని ఆటంకాలు అడ్డంకులు తట్టుకొని భూ పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నామని ఏ శక్తి అడ్డువచ్చిన నిరుపేదలకు ఇళ్ల పట్టాలు వచ్చేంతవరకు తమ పోరాటం ఆగదు అన్నారు.

ఏ వసతులు లేకపోయినా ఎండా వాస చలిని లెక్కచేయకుండా పగలు రాత్రి కుటుంబంతో సహా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలందరికీ అందోజు అభినందనలు తెలియజేశారు.ఇదే పోరాట పటిమతో ముందుకు వెళితే విజయం తథ్యమన్నారు. చలిని సైతం లెక్కచేయకుండా సమావేశానికి విచ్చేసిన మహిళలను అభినందించారు. మన లక్ష్యం ఇళ్ల పట్టాలు దక్కించుకోవ డం అని ఆ దిశగా మడమ తిప్పకుండా వెన్ను చూపక ముందడుగు వెయ్యాలని మీకు ఇళ్ల పట్టాలు ఇప్పించే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, భూ పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ భూ పోరాటం మొదలు పెట్టిన రోజు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితులు ఉన్నాయని, ఆ పరిస్థితిని మనం మార్చుకొని నిరుపేదలు అడగకపోయి నా భూ పోరాట కమిటీ నాయకత్వం రోడ్లు, మంచినీటి సౌకర్యం, సోలార్ లైట్స్ వంటి పలు సౌకర్యాలు సమకూర్చుకున్నామన్నారు. సిపిఐ ఎజెండాతో ముందుకు వెళితే మన కాలనీని అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా నాయకులు సామిడి శేఖర్ రెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మ ణ్, సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి, అజ్మీర్ హార్సింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గణేష్, ప్రజానాట్యమండలి నాయకులు వేణుగోపాలచారి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైనది ఓటు హక్కు : అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైనది ఓటు హక్కు అని, ప్రతి ఒక్కరు బాధ్యతగా తమతమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మన భారతదేశం ప్రపంచంలో అతి పెద్దదైన ప్రజాస్వామ్య దేశమని, ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని, ఓటు హక్కు విలువ అందరికీ తెలియజేయలన్నారు. ఓటును తాత్కాలిక ప్రలోభాలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మన భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో మనమందరం బాధ్యతగా పాల్గొని ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ "భారత దేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత నిష్పక్షపాత ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని మతం, జాతి, కులం వర్గం భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని" వివిధ శాఖల అధికారులు, సిబ్బంచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా గ్రామీణాభివృద్ధి పిడి, స్వీప్ నోడల్ అధికారి ఎల్. శ్రీలత, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

### డిప్యూటీ కమిషనర్ డి.శశిరేఖ



**ప్రజాపక్షం/మియాపూర్:** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని డిప్యూటీ కమిషనర్ డి.శశి రేఖ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 11:00 గంటలకు ఓటర్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించడం, ప్రతి పౌరుడు బాధ్యతాయుతం గా తన ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.శశి రేఖ పాల్గొని మాట్లాడుతూ, ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని, స్వేచ్ఛాయుతమైన మరియు నిష్పక్షపాతమైన ఎన్నికల ద్వారా ప్రజల సంకల్పం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకుని, ఎన్నికల సమయంలో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఒలు, అలాగే మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పాల్గొని ఓటర్ ప్రతిజ్ఞ చేశారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

**ప్రజాపక్షం/షాబాద్:** ప్రభుత్వ భూముల నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసిన్నట్లు చేవెళ్ల ఎస్ఓటి పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి సమయంలో షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామానికి చెందిన కరుణాకర్ రెడ్డి అతనితో పాటు మరికొందరూ కలిసి తండా శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న



విషయం తెలుసుకు న్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మట్టి తరలిస్తున్న టిప్పర్, జేసిబిని సీజ్ చేసి షాబాద్ పోలీసుల కు అప్పగించారు. అక్రమంగా మట్టి తవ్వకా లు జరిపితే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించటం తప్పనిసరి

### హైదరాబాద్ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ రమేష్






**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వాహనాలు నడిపేటప్పు డు డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తూచ తప్పకుండా పాటించాలని హైదరాబాద్ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ రమేష్ అన్నారు.

శుక్రవారం జెఎన్‌టియు కూకట్‌పల్లిలో ఇంజనీరింగ్ విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. జెఎన్‌టియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి వెంకటనర్సింహ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం అధ్యక్ష ఉపన్యాసంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ రోడ్డు సేఫ్టీ విద్యార్థులకు చాలా ఉపయోగంగా ఉంటుంది. అందుకు రవాణా శాఖ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు అతివేగం,హెల్మెట్ పెట్టుకోకపోవడంతో జరుగుచున్నాయని అన్నారు. విద్యార్థులకు, యువకులకు స్పీడ్ థ్రిల్లింగ్‌గా ఉంటుంది కానీ ఆ థ్రిల్లింగ్ కిల్లింగ్‌కు కారణం అవుతుంది అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు, ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్ లో హాస్పిటల్ కు తీసుకెళ్లేవారిని రహ వీర్ అంటారని, వీరికి పోలీస్ కేసులు ఉండకపోగా అటువంటి సంబంధిత రహవీర్ కు ఆ జిల్లా కలెక్టర్ ద్వారా 25,000 పారితోషి కం ఇవ్వబడుతుందని వివరించారు. అదేవిధంగా ప్రమాద బాధితులకు 1,50,000 రూపాయలతో గుర్తింపు పొందిన ప్రైవేట్ హాస్పిటల్ ద్వారా ట్రీట్మెంట్ ఇవ్వబడుతుంది అని ఆయన వివరించారు.

అనంతరం మరో ముఖ్య అతిధి ఖైరతాబాద్ ఆర్‌టిఒ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో 18 నుండి 34 సంవత్సరాల వయస్సు వారు అత్యధికంగా చనిపోతున్నారని హైద్రాబాద్‌లో ఎక్కువగా ట్రాఫిక్ ఉల్లంఘన లు జరుగుచున్నాయి అని గణాంకాలతో సహ వివరించారు. హెల్మెట్ లేకుండా విద్యార్థులను కాలేజీలోకి రానివ్వొద్దని ప్రిన్సిపాల్ ను కోరారు. అలాగే ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నియమ నిబంధన లు పాటిస్తూ ఇతరులకు తెలియచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అండ్ ఎన్‌సిసి కోఆర్డినేటర్సైదా, ఓట్ ఆఫ్ థాంక్స్ చెపుతూ విద్యార్థుల చే ఓటర్స్ ప్రతిజ్ఞతో పాటు రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజి ప్రొఫసర్లు, స్టాఫ్‌తో పాటుసౌత్ జోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంట రవీందర్, కూకట్ పల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీను బాబు,సెంట్రల్ జోన్ ఎఎంవిఐ నవీన్ రెడ్డి,తదితరులు పాల్గోన్నారు.

**యాచారంలో:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా యాచారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం నుండి బస్టాండ్ వరకు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. కారు నడుపుతున్న వారు సీటు బెల్టు తప్పకుం డా పెట్టుకోవాలన్నారు. అందరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బైక్ నడుపుతున్న వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను అతివేగంగా నడపడం సరైన పద్ధతి కాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందరు సురక్షితంగా ఇంటికి చేరాలంటే అందరూ నియమ నిబంధనలను పాటించాలని తెలిపారు. పోలీస్ శాఖకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఇబ్రహింపట్నం ఎసిపి రాజు, యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి, గ్రీన్ ఫార్మ సిటి సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాకు రక్షణ కల్పించండి


### న్యాయవాది అశ్వినకుమార్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తనను చంపుతానంటూ బెదిరించిన వారినుంచి రక్షణ కల్పించాలని మెదక్ జిల్లా సీనియర్ న్యాయవాది దొంతుల అశ్విన్ కుమార్ రాష్ట్ర డిజిపిని కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ గుడిమల్కాపూర్‌కు చెందిన శైలేందర్ మతూర్ ఈ నెల 19న ఎనిమిదో మెట్రో పాలిటన్ నాంపల్లి కోర్టు ఆవరణంలో తనను బహిరంగంగా చంపేస్తానని, చెప్పలేని బూతులతో తనను హెచ్చరించారన్నారు. ఈ విషయమై బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. తననే అనుకొని నా సోదరుడిని సుపారీ గ్యాంగ్ గత ఏడాది సెప్టెంబర్‌లో హత్య చేశారని ఆరోపించారు. తక్షణమే శైలేందర్‌ను విచారించి, నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రెండేళ్లలో రూ.1350కోట్లతో అభివృద్ధి పనులు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా పాలన ప్రభుత్వం నుండి రెండేళ్ళ కాలంలో నియోజకవర్గానికి రూ. 1350కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రెండేళ్ల పాలన, ప్రభుత్వం నుండి తీసుకువచ్చిన నిధుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలం నుండి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా వివిధ పనుల నిమిత్తం డివిజన్‌కు రూ.1350కోట్ల నిధులు తీసుకువచ్చి చేపట్టినట్లు వివరించారు. ప్రజా నాయకుడిగా ఉంటూ ప్రజలకు ప్రగతి వెలుగులు నింపాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు మొదలుకొని పట్టణ ప్రాంతాల వరకు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు, బిటిరోడ్లు, స్టేడియం, ఇంటిగ్రేటేడ్ పాఠశాల భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని నిత్యం వారి శ్రేయస్సు కోసం పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.



**నియోజకవర్గానికి రెండేళ్లల్లో వచ్చిన నిధులు ఇవే**

షాద్‌నగర్ నియోజకవర్గంలోకి ఆరు మండలాలకు రెండేళ్ల కాలంలో వచ్చిన నిధులు ఇవే. సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ.40.27కోట్లు, షాద్‌నగర్ మున్సిపల్, కొందుర్గు స్టేడియానికి రూ.12.75 కోట్లు, ఆర్‌ఓబి వై జంక్షన్‌కు రూ.184కోట్లు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు ఉన్న బ్యాలన్స్‌గా రూ.8కోట్లు, షాద్‌నగర్ మున్సిపల్ అభివృద్ధికి రూ.88కోట్లు, కొందుర్గు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెగ్ స్కూల్ భవన నిర్మాణానికి రూ.200కోట్లు, రోడ్ల నిర్మాణాల కు రూ.55.34 కోట్లు, డివిజన్‌లోని అంగన్‌వాడి, గ్రామ పంచాయతీలకు, 5 కస్తూర్బా పాఠశాలల అభివృద్ధికి రూ6.94 కోట్లు, దేవాలయ అభివృద్ధి కోసం రూ.1.7కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గానికి హెచ్‌ఎండిఎ ద్వారా పార్కులు, బ్రిడ్జి రోడ్డు నిర్మాణాలకు రూ.87కోట్లు, పిహెచ్‌సి, సిహెచ్‌సిలకు రూ.11.27కోట్లు, కొత్తూ రు మండలం జెపి దర్గా అభివృద్ధికి రూ.10కోట్లు, షాద్‌నగర్ జంక్షన్ నుండి అన్నారం చౌరస్తా వరకు బిటి రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.51.80కోట్లు, షాద్‌నగక్ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.27.50కోట్ల నిధులు, ఇరిగేషన్ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రోడ్లకు రూ.19.85కోట్లు, ఆర్ అండ్ బి, హెచ్‌ఎండిఎ ద్వారా రోడ్లకు రూ.98.04కోట్లు, రైతు భీమా, రైతు భరోసా, రైతు రుణమాఫీ, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల సబ్సిడీకి రూ.269.92కోట్లు, నియోజకవర్గానికి మంజూరైన 3500ఇందిరమ్మ ఇండ్లకు రూ.175కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. మున్ముందు మరెన్నో నిధులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరు మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని ఓటర్లను కోరారు.

## అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోండి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తాము కష్టార్జితంతో కొనుగోలు చేసిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని బాధితులు మిర్యాల్‌కర్ సురేశ్, సందీప్‌రాజ్ రాష్ట్ర ప్రభుత్వానికి వేడుకొన్నారు. శుక్రవారం హైదరాబా ద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో న్యాయవాది సత్యనారాయణతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. హనుమకొండలోని భద్రకాళి గుడి వద్ద కాపువాడలో 848 గజాల స్థలాన్ని పట్టాదారు వద్ద తాము కొనుగోలు చేశామన్నారు. అనంతరం ఆ స్థలానికి సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్, ఇంటి నంబర్ కూడా వచ్చిందన్నారు. అయితే, 2020లో ఆ స్థలం 22 మంది బండ కార్మికులకు ప్రభుత్వం కేటాయించిందని పేర్కొంటూ ఇద్దరు వ్యక్తులు తమను మానసికంగా ఇబ్బందిపెడుతున్నారన్నా రు. ఈ విషయమై తాము కోర్టును ఆశ్రయించ గా, కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. అయినా వారి అక్రమ నిర్మాణాలు ఆగడం లేదన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి, తమ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశా రు.

## సురక్షా బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మల్కిజ్‌గూడ గ్రామ సర్పంచ్ దేరంగుల శంకర్ అన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన మలిగ ఎట్టయ్య రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఎస్‌బిఐ బ్యాంక్‌లో 20 రూపాయలతో ఎస్‌బిఐలో ప్రీమియం డబ్బులు కట్టుకోవడం వల్ల అతని కొడుకు మలిగే మహేశ్ కి బీమా కింద 2 లక్షల రూపాయల చెక్కును బ్యాంక్ మేనేజర్ మాన్యనాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీమా కట్టుకోవ డం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరు అర్థం చేసుకోవాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలన్నా రు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వరికుప్పల కోండల్, దేరంగుల నారయ్య, కోలం శ్రీకాంత్ రెడ్డి, భీమా కౌన్సిలర్ వై వెంకటేశ్, బర్ల మల్లేశ్ యాదవ్, రఫియా, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టీమిండియా జయకేతనం!

## అర్ధశతకంతో రెచ్చిపోయిన సూర్య, ఇషాన్..



పొట్టి ప్రపంచకప్‌లోపే భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(82 నాటౌట్) ఫామ్ అందుకున్నాడు. టీ20ల్లో తానొక సంచలనమని చాటుతూ రాయ్‌పూర్‌లో న్యూజిలాండ్ బౌలర్లకు తన విధ్వంసాన్ని కళ్లకు కట్టాడు. టీమిండియాపై రికార్డు స్కోర్ కొట్టి విజయంపై ధీమాగా ఉన్న కివీస్ ఆశల్ని ఆవిరి చేస్తూ అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. ఇషాన్ కిషన్(76) మెరుపు హాఫ్ సెంచరీతో గట్టి పునాది వేయగా.. సూర్య, శివం దూబే(36 నాటౌట్) జోడీ కవీస్ బౌలర్లపై పిడుగల్లే విరుచుకుపడింది. దూబే భారీ సిక్సర్లతో బెంబేలెత్తించగా.. మిస్టర్ 360 తన క్లాస్ ఆటతో ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. ఫలితంగా వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా.. 2–0తో ఆధిక్యంలో దూసుకెళ్లింది.

పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టు జోరుకు న్యూజిలాండ్‌కు రెండో ఓటమి తప్పలేదు. 206 పరుగులతో టీమిండియా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది కివీస్. 6 పరుగులకే ఓపెనర్లు సంజూ శాంసన్ (6) అభిషేక్ శర్మ(0)లు పెవిలియన్ చేరినా.. ఇషాన్ కిషాన్(76) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి, స్టాండ్స్‌కు పంపిన ఈ చిచ్చరపిడుగు 21 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. మరో ఎండ్‌లో సూర్యకుమార్ యాదవ్( 82 నాటౌట్) సైతం పెట్రేగిపోయాడు. 9వ ఓవర్లో 4, 4, 4, 4, 6, 2తో 24 రన్స్ పిండుకున్నాడు. ఏడాది తర్వాత మునపటి సూర్యను తలపించిన అతడు 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇషాన్ ఔటయ్యాక శివం దూబే(36 నాటౌట్) ఉప్పెనలా కివీస్ స్పిన్నర్లను హడలెత్తించాడు. సోధీ ఓవర్లో అతడు ఏకంగా 100 మీటర్ల సిక్సర్‌తో చెలరేగాడు. ఈ జోడీ విధ్వంసానికి 16.2 ఓవర్లలోనే టీమిండియా మ్యాచ్‌ను ముగించి సిరీస్‌లో 2–0తో ముందంజలో ఉంది.

# హ్యాపీ రిటైర్మెంట్!

సైనా రిటైర్‌మెంట్‌పై స్పందించిన పివి.సింధు

భారత బ్యాడ్మింటన్‌లో చెరగని ముద్ర వేసిన సైనా నెహ్వాల్ తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించింది. ఒలింపిక్ పతకంతో పాటు పలు టోర్నీలలో విజేతగా నిలిచిన సైనా ఎందరో అమ్మాయిలకు



స్ఫూర్తిగా నిలిచింది. వారిలో ఒకరైన పివి సింధు సంచలన ఆటతో దేశం గర్వించదగ్గ క్రీడాకారిణిగా ఎదిగింది. ఈమధ్యే సింగిల్స్‌లో 500 విజయంతో చరిత్ర సృష్టించిన తెలుగు తేజం.. ఒకప్పటి తన ప్రత్యర్థి సైనా వీడ్కోలుపై స్పందించింది. ప్రకాశ్ పదుకొనే, పుల్లెల గోపిచంచ్ పురుషుల బ్యాడ్మింటన్‌లో దిగ్గజాలు. మరి, మహిళల విభాగంలో వీరి మాదిరిగా ఉన్నత శిఖరాలకు చేరిన తొలి షట్లర్ సైనా నెహ్వాలే. చైనా కోటను బద్దలు కొడుతూ విజేతగా నిలిచిన తను.. రెండుసార్లు వరల్ ఛాంపియన్‌షిప్ గెలుపొందింది. 2019లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో సింధును ఓడించి టైటిల్ సాధించింది సైనా. రాకెట్ పట్టి గొప్ప విజయాలు సాధించేందుకు ప్రేరణగా నిలిచిన ఈ సీనియర్‌కు సింధు అభినందనలు తెలిపింది. 'బ్యాడ్మింటన్‌లో వీడ్కోలు పలికినందుకు అభినందనలు సైనా. భారత బ్యాడ్మింటన్‌కు విశేష సేవలందించినందుకు నీకు ధన్యవాదాలు. నీ జీవితంలో తదుపరి దశ ప్రశాంతత, సంతోషంతో సాగిపోవాలని కోరుకుంటున్నా' అని ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది సింధు. 'గత రెండేళ్లుగా నేను బ్యాడ్మింటన్ ఆడడం లేదు. నాకు నేనుగా ఈ ఆటలోకి వచ్చాను. అలానే నాకు నేనుగా వైదొలిగాను. కాబట్టి.. వీడ్కోలు ప్రకటించాల్సిన అవసరం లేదు' అని ఒక పాడ్‌కాస్ట్‌లో చెప్పింది సైనా. గణాంకాలు గమనిస్తే.. సింధుపై సైనాదే పైచేయి. వీరిద్దరూ నాలుగుసార్లు తలపడగా.. మూడు దఫాలు సైనా గెలుపొందింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యంతో చరిత్ర సృష్టించింది సైనా. భారత్‌లో మహిళల బ్యాడ్మింటన్ అభివృద్ధికి ఆమె విజయం టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి.

# ఐసిసికి మరో లేఖ.. బంగ్లాదేశ్ బోర్డు చివరి ప్రయత్నం ఫలించేనా..?

భారత్‌లో టి–20 ప్రపంచకప్ ఆడేందుకు నిరాకరిస్తున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాకిచ్చేందుకు ఐసిసి సిద్ధమవుతోంది. ఇండియాలో ఆడకుంటే వేటు తప్పదని హెచ్చరించినా బెట్టు వీడని బంగ్లా బోర్డుకు బుద్ధి వచ్చేలా స్కాట్లాండ్‌కు చోటివ్వాలని ఐసిసి భావిస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ బోర్డు చిట్టచివరి ప్రయత్నానికి సిద్ధమైంది. తమ జట్టుపై వేటును తప్పించుకునేందుకు శుక్రవారం ఐసిసికి లేఖ రాసింది. వరల్డ్




కప్‌పై అభ్యంతరాలపై ఐసిసి వివాదాల పరిష్కార కమిటీ ముందు తమ వాదనను వినిపించేందుకు అనుమతించాలని అత్యున్నత క్రికెట్ మండలిని కోరింది. ఫిబ్రవరి7 నుంచి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఆడడంపై అనిశ్చితికి త్వరలోనే తెరపడనుంది. భద్రతా కారణాలను సాకుగా చూపి ఇండియాకు తమ జట్టు ను పంపబోమని బెట్టు చేస్తున్న బంగ్లా బోర్డుకు దిమ్మతిరిగే షాక్ ఇవ్వాలనుకుంటోంది ఐసిసి ఇప్పటికిప్పుడు షెడ్యూల్ మార్పు కుదరని చెప్పినప్పటికీ బంగ్లాదేశ్ క్రికెట్ సభ్యులు పంతం వీడకపోవడమే అందుకు కారణం.

## సమాంతర విశ్వం

# ఒక ఊహ మాత్రమే..

యూరోపియన్ న్యూక్లియర్ ప్రయోగ కేంద్రం (సిఇఆర్‌ఎన్/ సెర్న్)తోసహా ఇప్పటివరకు ఏ ప్రయోగ లేదా అధ్యయన కేంద్రం లో జరిగిన ఏ ప్రయోగం కూడా మనతో పాటు ఉన్న లేదామనం గమనించగల సమాంతర విశ్వం ఉందని శాస్త్రీయంగా నిర్ధారించలేదు. అలాంటి భావనలు ప్రధానంగా ఊహకథలు లేదా సైన్స్–ఫిక్షన్ ఆలోచనలపై ఆధారపడిన వ్యాఖ్యానాలే. శాస్త్రీయ వాస్తవాలు ఈ స్థాయికి ఇంకా చేరలేదు. సెర్న్‌లో జరుగుతున్న ప్రయోగాల అసలు లక్ష్యం విశ్వంలోని అతి సూక్ష్మ కణాలను, వాటిని నియంత్రించే మౌలిక శక్తులను అర్థం చేసుకోవడమే. అత్యంత వేగంతో కణాలను ఢీకొట్టడం, వాటి నుంచి పుట్టే ఉపకణాల ప్రవర్తనను అత్యంత సున్నితమైన డిటెక్టర్లతో గమనించడం ద్వారా ప్రకృతి యొక్క లోతైన నియమాలు మనకు వెల్లడవుతున్నాయి. హిగ్స్ బోసాన్ వంటి కనుగొనుబాట్లు దీనికి ఉదాహరణ. అయితే ఈ ప్రక్రియలో కొందరు శాస్త్రవేత్తలు, రచయితలు ఒక సృజనాత్మక ప్రశ్నను లేవనెత్తుతున్నారు. ఈ ప్రయోగాలు మనకు తెలియని మరింత పెద్ద వాస్తవాన్ని తాకుతున్నాయేమోనా అనే కుతూహలం ఏర్పడుతున్నది. కాగా, సమాంతర




విశ్వాల భావన కొత్తది కాదు. సిద్ధాంత భౌతిక శాస్త్రంలో మనం చూస్తున్న విశ్వం అనేక పరిమాణాలు, అనేక స్థరాలు కలిగిన పెద్ద వ్యవస్థలో ఒక పొర మాత్రమే కావచ్చనే ఆలోచన చాలాకాలంగా చర్చలో ఉంది. కొన్ని సిద్ధాంతాలు అదనపు పరిమాణాలు, బహుళ విశ్వాల అవకాశాలను ప్రతిపాదిస్తాయి. అయితే ఈ నేపథ్యంపై కొంతమంది మరొక అడుగు ముందుకు వేసి, అలాంటి సమాంతర విశ్వం చైతన్యంతో ఉండి, మన ఉనికిని గమనిస్తుందా? అనే ఊహాత్మక ప్రశ్నను ముందుకు తెస్తున్నారు. ఇది శాస్త్రీయ నిర్ధారణ కంటే తాత్విక, సృజనాత్మక ఆలోచనగా మాత్రమే చూడాలి. సెర్న్ ప్రయోగాల్లో కొన్ని ఫలితాలు మనకు అర్థం కానివిగా, లేదా ప్రస్తుత సిద్ధాంతాలకు పూర్తిగా సరిపోనివిగా కనిపించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఇవి మన అవగాహనకు అతీతమైన మరొక వాస్తవం నుంచి వస్తున్న ప్రతిధ్వనులా? అనే ఊహలు సహజంగా పుడతాయి. కానీ ప్రధాన శాస్త్రీయ వర్గం ఇలాంటి ఊహలను అత్యంత జాగ్రత్తగా,

## సైన్స్

సందేహంతోనే పరిశీలిస్తుంది. డేటా, గణితం, పునరావృత పరీక్షలు లేకుండా ఎలాంటి అసాధారణ నిర్ణయానికీ శాస్త్రం వెళ్లదు. మనకు సహజంగా అనిపించే స్పేస్, పదార్థం, కాలం ఇవన్నీ విశాల వాస్తవంలో ఒక చిన్న భాగం మాత్రమే కావచ్చన్న భావన శాస్త్రంలో వినయాన్ని నేర్పుతుంది. మనం విశ్వం గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటున్నామో, అంతకన్నా ఎక్కువగా మన అజ్ఞానం ఎంత విస్తృతమో కూడా తెలుస్తోంది. ఈ కారణంగానే ఇలాంటి కథనాలు విశ్వం మన ఊహించినదానికంటే వింతగా, మరింత అనుసంధానంగా ఉండొచ్చన్న ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. అయితే శాస్త్రీయ కోణంలో చూస్తే, ఇప్పటివరకు సెర్న్ ప్రయోగాలు హిగ్స్ బోసాన్, కొత్త కణాల వేట, అదనపు పరిమాణాల సూచనలు, డార్క్ మ్యాటర్‌కు సంబంధించిన సంకేతాల వంటి విషయాలపైనే నిలబడి ఉన్నాయి. ఇవన్నీ కఠినమైన గణిత–ప్రయోగ ఆధారాలతో మద్దతు పొందిన అంశాలు. మనను గమనించే చైతన్య సమాంతర విశ్వం అనే భావన మాత్రం ఈ దశలో శాస్త్రీయంగా నిర్ధారించబడిన నిజం కాదు.. అది ఒక తాత్విక, సృజనాత్మక ఊహ మాత్రమే.. సూటిగా చెప్పాలంటే, సెర్న్ ప్రయోగాలు మన విశ్వాన్ని లోతుగా అర్థం చేసుకునే దారిలో ఉన్నాయి. ఆ ప్రయాణంలో పుట్టే ఆశ్చర్యాలు, ఊహలు మన జిజ్ఞాసను పెంచుతాయి గానీ, వాటిని వాస్తవాలుగా మార్చేందుకు ఇంకా చాలా దూరం ఉంది. శాస్త్రం భయంకరమైన ఊహలతో కాదు, నిదానమైన పరీక్షలతోనే ముందుకు సాగుతుంది.

# వేగంగా విస్తరిస్తున్న అంతరిక్షం

అంతరిక్షం అత్యంత వేగంగా విస్తరిస్తున్నదని శాస్త్రవేత్తలు దాదాపు ఒక నిర్ధారణకు వచ్చారు. ఈ విస్తరణ అనేది అంతరిక్షంలో వస్తువులు జరగడం కాదు.. అంతరిక్షమే విస్తరిస్తోంది. అంటే, గెలాక్సీలు ఒకదానికొకటి దూరంగా వెళ్లిపోతున్నాయే తప్ప, అవి అంతరిక్షంలో పరుగెత్తుతూ కదలడం లేదు. వాటి మధ్య ఉన్న ఖాళీ అంతరిక్షం పెరుగుతోంది. ఈ విస్తరణ కాంతి వేగాన్ని మించిందని అంటున్నారు. అదే నిజమైతే, ఐన్‌స్టీన్ ప్రతిపాదిత సిద్ధాంతానికి ఇది విరుద్ధం. అయితే, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని ఉల్లంఘించని రీతిలో విశ్వం విస్తరిస్తున్న వేగం కాంతి వేగం కంటే ఎక్కువగా ఉండవచ్చని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధంతాన్ని అనుసరించి, అంతరిక్షం లోపల కాంతి వేగం కంటే వేగంగా ఏ వస్తువూ ప్రయాణించలేదు. శాస్త్రవేత్తల అధ్యయనాలను అనుసరించి, ఇప్పుడు కూడా గెలాక్సీలు కాంతి వేగాన్ని మించి కదలడం లేదు. అయితే, అంతరిక్షం విస్తరించడం వల్ల వాటి మధ్య దూరం వేగంగా పెరుగుతోంది.



దీనితో దగ్గరలోని గెలాక్సీలు నెమ్మదిగా దూరమవుతున్నాయి. చాలా దూరంలో ఉన్న గెలాక్సీలు మనకు కాంతి వేగం కంటే వేగంగా దూరమవుతున్నట్లు కనిపిస్తాయి. కానీ అవి నిజానికి అంతరిక్షంలో దూసుకుపోవడం లేదు. దీనికి బెలూన్ ఉదాహరణ ఖచ్చితంగా సరిపోతుంది. ఒక బెలూన్ తీసుకుని, దాని మీద కొన్ని చుక్కలు గీయండి. బెలూన్‌ను విశ్వం అనుకుంటే, దానిపై పెట్టిన చుక్కలు గెలాక్సీలు. ఇప్పుడు బెలూన్‌ను ఊదండి. బెలూన్ పెద్దదవుతున్న కొద్దీ చుక్కలు ఒకదానికొకటి దూరంగా పోతున్నట్లు కనిపిస్తాయేగానీ, నిజానికి ఆ చుక్కలు స్వయంగా కదలడం లేదు. బెలూన్ ఉపరితలమే విస్తరిస్తోంది. ఇదే విధంగా విశ్వంలో కూడా అంతరిక్షమే విస్తరిస్తోంది. గెలాక్సీలు దూరంగా జరగడం లేదు. ఇది ఆధునిక ఖగోళ శాస్త్రంలో అత్యంత ఆసక్తికరమైన, లోతైన సత్యాలలో ఒకటి.

# ప్రభుత్వాల తీరుతో ఆర్థిక సంక్షోభంలోకి సింగరేణి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కేంద్ర, రాష్ట్రప్రభుత్వ విధానాలతో రానున్న రోజుల్లో సింగరేణి తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోనుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ శేషగిరిభవన్‌లో జరిగిన జరిగిన పివికె–5 ఫిట్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా కూనంనేని హాజరై మాట్లాడా రు. సింగరేణి సంస్థకు మెడికల్ బోర్డు కోసం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వాన్ని నిలదీశానని, సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సొంతింటి కల నిజం చేసేందుకు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు వినతులు అందిస్తున్నామన్నారు. సింగ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల ఇన్‌కంటాక్స్ షేర్‌ను సంస్థే భరించానే ఒత్తడి తెస్తున్నామని, కార్మిక వర్గ పోరాటాలు చేసి మనం దానిని సాధించాలన్నారు. సంస్థలో ఏటేటా పర్మినెంట్ కార్మికుల ను తగ్గిస్తూ, నూతన ఉద్యోగాలు కల్పించకుండా, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగులను చేర్చుకుంటున్నారని, దీనిని అడ్డుకుని తీరుతామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వారి శ్రమను సింగరేణి సంస్థ దోచుకుంటోందని మండిపడ్డారు. సంస్థ భవిష్యత్, కార్మికుల హక్కుల కోసం ఎర్రజెండా ఎఐటియుసి ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు ముందుండాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఎర్రజెండాతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమని, ఆ నాటి నుండి నేటి వరకు సిపిఐ మద్దతుతో ఎఐటియుసి కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించేందుకు పాటుపడిందన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఈ సందర్భంగా కూనంనేని తెలిపారు. సమావేశంలో యూనియన్ అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి మల్లిఖార్జున్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీర స్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, సందెబోయిన శ్రీనివాస్, మధు, కృష్ణ, శ్రీనివాస్ కమల్, భూక్య రమేష్, సాయి పవన్ కుమారరావు, వెంకట రమణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవ స్ఫూర్తిని కొనసాగిద్దాం

కలిసి వచ్చే పార్టీలతో మున్సిపల్ 'పొత్తు'

ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు గొప్ప పోరాట స్ఫూర్తిని ఇచ్చాయని ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలకు పునరంకితం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. దేశం ఆర్థికంగా ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని, దేశ సంపద కొందరి చేతుల్లో బంధీగా మారుతుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 18న జరిగిన బహిరంగ సభ పార్టీ శ్రేణుల్లో గొప్ప ఉత్తేజాన్ని నింపిందన్నారు. ఇదే సందర్భంలో జరిగిన జాతీయ స్థాయి సమావేశాల్లో చేసిన తీర్మానాల అమలుకు పూనుకోవాలని కోరారు. ముఖ్యంగా వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించేందుకు క్షేత్ర స్థాయి నుంచి ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హేమంతరావు తెలిపారు. త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో కలిసి పనిచేస్తామన్నారు. మున్సిపాలిటీలలో తమ బలానికి అనుగుణంగా పోటీ చేస్తామన్నారు. సిపిఐ పోటీకి సంబంధించి సమావేశాలు నిర్వహించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాకు సంబంధించి రాజకీయ పార్టీలు తమను సంప్రదిస్తున్నాయని స్థానిక పరిస్థితులు బలాబలాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని హేమంతరావు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పార్టీకి సంబంధించిన యంత్రాంగమంతా సమ్మె ప్రచారంలో పాల్గొనాలని ఆయన సూచించారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక రైతాంగ విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్పొరేట్ల కోసమే మోడీ పాలన సాగుతుంది తప్ప దేశ ప్రజల కోసం కాదని హేమంతరావు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన బహిరంగ సభ, ప్రదర్శన, తదనంతర కార్యక్రమాల జయప్రదానికి శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది.

# మున్సిపల్ ఎన్నికల్లో పోటీ



**ప్రజాపక్షం/తొర్రూరు :** మున్సిపల్ ఎన్నికల్లో నాలుగు వార్డుల్లో పోటీ చేసేందుకు సిపిఐ నిర్ణయించిందని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ భిక్షపతి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు సిపిఐ నాయకత్వం పోటీకి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. నాలుగు మున్సిపల్ వార్డుల్లో ఓటర్లు అధికంగా ఉన్నందున బరిలో ఉండాలని పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని రాష్ట్ర సమితి సూచన చేసినందున కార్మికవర్గంతో నిత్యం సంబంధాలు కలిగి ఉన్న నాయకులను బరిలో దించాలని తొర్రూరు సిపిఐ మండల నాయకత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనికి స్వాగతిస్తూ నాలుగు వార్డుల్లో సిపిఐ నాయకులు పోటీలో ఉంటారని భిక్షపతి తెలిపారు. సమావేశంలో సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శులు గణపురం లక్ష్మణ్, పెరబోయిన కిరణ్‌కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ముద్దరబోయిన వెంకన్న, ప్రజాసంఘాల నాయకులు, జిల్లా సమితి సభ్యులు మంగళపల్లి మల్లయ్య, సూరబోయిన వీరన్న, వెలిశాల ప్రభాకర్, బొల్లు వెంకన్న, బొల్లు శ్రీను, పల్లె సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# 'నైని బ్లాక్'పై సమగ్ర న్యాయవిచారణ

వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** నైని బ్లాక్ కుంభకోణంతో పాటు 2014 నుంచి టెండర్ల విధానంలో జరిగిన అవకతవకలపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఎస్ఆర్‌పి 1, ఎస్‌ఆర్‌పి 3 గనులపై శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నైని బ్లాక్ వ్యవహారంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నాయని, ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వెంటనే విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2014 నుండి ఇప్పటి వరకు కోయగూడెం, కొత్తపల్లి ఓపెన్ కాస్టలతో సహా జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం సంస్థకు 29వేల కోట్ల రూపాయలు బాకీ ఉండగా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ రెండేళ్లలోనే 20 వేల కోట్ల రూపాయల అప్పు చేసిందని విమర్శించారు. రెండు ప్రభుత్వాలు కలిసి మొత్తంగా 49వేల కోట్ల రూపాయలు సంస్థకు చెల్లించాల్సి ఉందని వివరించారు. ఐఎన్‌టియుసి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఈ నిధులను సింగరేణికి ఇప్పించాలని సవాలు విసిరారు. మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, సొంత ఇంటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలవెన్స్‌లపై పడే ఆదాయపు పన్నును కోల్‌ఇండియా తరహాలో యాజమాన్యమే భరించాలని సీతారామయ్య కోరారు. కార్యక్రమంలో కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బాజీ సైదా, మోత్కూరి కొమురయ్య, మురళి చౌదరి, దాడి రాజయ్య, అఫ్రోజ్ ఖాన్, రాజ్ కుమార్, తౌటం మల్లేష్, అంబాల రవి, పరశురాములు, అనంతరెడ్డి, రాచర్ల రవీందర్, బట్టారి శ్రీకాంత్, ఆడెపు సురేష్, రామ్టెన్ కి సుధాకర్, కాసిపేట విక్కి, క్రాంతి కుమార్, కుమారస్వామి, కారుకూరి నగేష్, కంది శ్రీనివాస్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.



# యూరియా 'యాప్'తో ఇబ్బందులు



ప్రభుత్వం సకాలంలో రైతులకు యూరియా అందించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విజ్ఞప్తి

**ప్రజాపక్షం/మునుగోడు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఆ యాప్ రద్దుచేసి రైతులకు సరిపడే యూరియాని సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో స్థానికంగా రైతులతో పాటు ఇతర పార్టీల నాయకులతో యూరియా విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విలేకరులతో మాట్లాడుతూ యూరియా విషయంలో రైతులకు అర్థం కాని యాప్‌లను సృష్టించి, ఆ యాప్‌ల ద్వారానే బుక్ చేసుకుంటేనే యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 90 శాతం పైగా స్మార్ట్ ఫోన్ లేని రైతులు ఉన్నారని అలాంటి రైతులు బుక్ చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందుల కు గురవుతూ పంటలకు సకాలంలో యూరియా అందించలేకపోతున్నారని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టే యాప్‌లను రద్దుచేసి జిల్లా వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియ సరిపడా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, చలిమెడ సర్పంచ్ బండమీది యాదయ్య, కిష్టపురం సర్పంచ్ మలుగు శ్రీను, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బిమనపల్లి సైదులు, మిర్యాల వెంకన్న, నర్సింహాచారి పాల్గొన్నారు.



## కూలీల ఆటో బోల్తా ఒకరు మృతి, పలువురికి గాయాలు

ప్రమాద స్థలానికి క్షణాల్లో చేరుకున్న 108 సిబ్బంది

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో పాత పోలీస్ స్టేషన్ ఎదురుగా వ్యవసాయ కూలీల ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందారు. ధన్వాడ మండలం కేంద్రం నుంచి ప్రతినిత్యం వ్యవసాయ పనుల నిమిత్తం 20 మంది మహిళలు రోజువారీ పని నిమిత్తం ఎప్పటిలాగే ధన్వాడ నుంచి ఆటోలో మరికల్ మండల పుట్టగడ్డ అపంపల్లి గ్రామానికి వెళ్ళేవారు, ఈ క్రమంలో పాత పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగానే ఎదురుగా ఆటోకు పంది అడ్డం రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆటోలో ఉన్న దండు జయమ్మ బోటమ్మ (50) ఆటో నుంచి రోడ్డుపై పడడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా కూలీలకు గాయాలు కాగా, వీరిని 108 అంబులెన్స్ నారాయణపేట్ జిల్లా ఆసుపత్రికి తరిలించారు. మంజుల, స్వాతిల పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నారాయణపేట జిల్లా ఆస్పత్రి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. 108కు సమాచారం అందించిన వెంబడే స్పందించినందుకు సిబ్బందికి ధన్యవాదములు తెలిపారు.

**ధన్వాడ ఎస్సై వివరణ :** ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి ఎస్సై రాజశేఖర్ చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదాల గురించి ప్రతిరోజు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటిస్తూ తమ ప్రాణాలతోపాటు తోటివారి ప్రాణాలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అని తెలిపారు.



## మక్తల్ ఎంఆర్ఓ కార్యాలయంలో ఓటర్ల ప్రతిజ్ఞ

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలో ఎంఆర్ఓ కార్యాలయంలో ఎంఆర్ఓ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభావాన్ని నిలబెడతామనీ, మతం, జాతీయ కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తాయని అందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము, ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న మక్తల్ ఎంఆర్ఓ సతీష్ కుమార్, ఎలక్షన్ డిటి సహదేవ్, డిటి పుష్పలత ఎమ్ఆర్ఐ రాములు, ఏఆర్ఐ భూపాల్ రెడ్డి , మక్తల్ మండలం జిపిఓ లు మక్తల్ పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో ప్రజలంతా సమానమే

వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** గ్రామాలలోని ప్రజలందరూ మనకు సమానమేనని పార్టీలకతీతంగా పని చేసి గ్రామాలలో సర్వోతోముఖాభి వృద్ధి సాధించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. గత ఐదు రోజులుగా వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఖిల్లా ఘణపురం, పెద్ద మందడి, కొత్తకోట, మదనాపురం, అమరచింత, ఆత్మకూరు, గోపాల్‌పేట్ మండలం సంబంధించిన 133 మంది సర్పంచులకు వనపర్తి శివారులోని (వైటిసి) యూత్ ట్రైనింగ్ సెంటర్లో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి శుక్రవారం ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. శిక్షణ తరగతులకు వచ్చిన సర్పంచులందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. గ్రామాల్లో నెలకొనే పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్య , వీధి దీపాల ఏర్పాట్లు, మురికి కాలువలో ఏర్పాటు పరిశుభ్రత, కరెంటు ట్రాన్స్ఫర్మర్లు, లాంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో చేపట్టే ప్రతి పనిలో వార్డు సభ్యులను భాగస్వాములు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించి గ్రామస్థాయిలోని ఆరోగ్య కేంద్రాల్లో అన్ని మందులు నిల్వ ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సర్పంచులు లేదని ఆయన పేర్కొన్నారు. రైతులకు సంబంధించి భీమాకు కావలసిన వివరాలను ప్రతి ఒక్కరి పొందుపరచాలని వ్యక్తికి ఏదైనా జరిగినప్పుడు మాత్రమే మనం హడావిడీగా అన్ని పత్రాలను జమ చేసేందుకు ఇబ్బంది పడకుండా ముందుగానే భీమాకు సంబంధించిన వివరాలన్నింటిని సంబంధిత శాఖ అధికారులతో పొందరుపరిచేలా చూడాలన్నారు. భూ వివరాలను సంబంధించి ఏదైనా మార్పిడి జరిగినప్పుడు వెంటనే వారి వివరాలను అప్డేట్ చేసేలా చూడాలన్నారు. లేదంటే రైతు భరోసా లాంటి పథకాలతో ఇబ్బందులు పడతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , స్థానిక సంస్థల కలెక్టర్ యాదయ్య, డిఎల్‌పిఓ రఘునాథ్ రెడ్డి, డిపిఓ చక్రవర్తి, డిఆర్‌డిఓ డిఓటి రాజు ఆయా మండలాల ఎంపీడీవోలు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరలక్ష్మి , అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొని ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ప్రతి అర్హుడైన ఓటరు నిర్భయంగా, నిస్పాక్షికంగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు మన రాజ్యాంగం ఇచ్చిన అమూల్యమైన హక్కు అని, దీని ద్వారా మంచి పాలనకు బాటలు వేయవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో యువత పాత్ర కీలకమని, కొత్త ఓటర్లు తమ పేర్లను ఓటు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మహిళలు , దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, ఆర్ఐ కురుమూర్తి, రికార్డు అసిస్టెంట్ నరసింహా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భ్రూణహత్యల నియంత్రణకు చర్యలు చేపట్టండి

కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలో భ్రూణ హత్యలు, మహిళల గర్భాశయ క్యాన్సర్, మాతా శిశుమరణాలను నివారించాలని, ఈ బాధ్యత వైద్యులదేనని కలెక్టర్ బదావత్ సంతోష్ స్పష్టం చేశారు. భ్రూణహత్యలు, మాతా,శిశుమరణాలు, మహిళలకు గర్భాశక్యాన్సర్ శిశువులకు వ్యాక్సిన్లు గ్రామీణప్రాంత వైద్యసేవలు ఇతర అంశాలపై వైద్యాధికారులతో శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో డిఎంహెచ్ఓ డాక్టర్ రవినాయక్‌తో కలిసి వైద్యులు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బందితో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్కర్నూల్ జిల్లాలో వెయ్యిమంది అబ్బాయిలకు 892మంది బాలికల నిష్పత్తిమాత్రమే ఉందని, ఇంకా ముఖ్యంగా చారకొండ లింగాల మండలంలో వెయ్యిమంది అబ్బాయిలకు 650 అమ్మాయిల నిష్పత్తి ఉందని ఇది తీవ్రంగా ఆందోళన చెందించే విషయమని, వైద్యులు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు జిల్లాలో భ్రూణహత్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుండి ప్రజలు ఎక్కువగా కర్నూల్‌కు వెళ్లి మరీ అబార్షన్లు చేయిస్తున్నారనే సమాచారం ఉందని అలాంటివాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈసందర్భంగా జిల్లా వైద్యశాఖను ఆదేశించారు. అబ్బాయిల నిష్పత్తికంటే అమ్మాయిల నిష్పత్తితగ్గితే అది భావితరాలకు ప్రమాదకరంగా మారుతుందని అందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసే పుట్టిన, పుట్టబోయే ఆడపిల్లల హత్యలపై అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 8 మాతృమరణాలు, 58 శిశు మరణాలు గత సంవత్సరం నమోదయ్యాయని, ఈ నూతన సంవత్సరం నుండి జిల్లాలో ఏ ఒక్క మాతృశిశు మరణాలు జరగకుండా వైద్యులు, సిబ్బంది గర్భిణీలకు సరైన అవగాహన కల్పించి పౌష్టికాహారం తీసుకునేలా, శిశుమరణాల సంఖ్య గణనీయంగా తగ్గించాలని అందుకు వైద్యులు, అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి పౌష్టికాహారం తీసుకునేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

డిఎంహెచ్ఓ డాక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలను భ్రూణహత్యలు, గర్భధార క్యాన్సర్, మహిళా శిశుమరణాలను ఈ సంవత్సరంలో జిల్లాలో ఎక్కడా జరగకుండా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా సేవలందించేందుకు కృషిచేస్తామని చెప్పారు. అదేవిధంగా 14 సంవత్సరాల బాలికలు అందరికీ వ్యాక్సిన్లు అందించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భ్రూణహత్యలపై జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పించేలా అవగాహన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసమావేశంలో అదనపు డిఎంహెచ్ఓ తారాసింగ్, డాక్టర్లు లక్ష్మణ్, భీమానాయక్, రఫిక్, కృష్ణమోహన్, భరత్‌రెడ్డి, ప్రపంచవైద్య ఆరోగ్యసంస్థ కన్సల్టెంట్ డాక్టర్ వషి పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరూ ఓటుహక్కును తెలుసుకోవాలి :** జాతీయ ఓటరుదినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశమందిరంలో జిల్లా అధికారులు కలెక్టరేట్ అన్నివిభాగాల ఉద్యోగులతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ జాతీయ ఓటరు దినోత్సవంలో నాభారత్ నాఓటు అనే నినాదంతో అర్హతగల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధరకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగిందన్నారు. నూతనంగా నమోదుకాబడిన ఓటర్లను గుర్తించి వారికి ఓటరు గుర్తింపుకార్డులను అందించడం జరుగుతుందని, ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఓటరు నమోదు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ రవినాయక్, డిఇఓ రమేష్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్‌సిబ్బంది , సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లు పాల్గొని జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల సిబ్బందితో భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల పవిత్రతను నిలబెడతాయని, మతం, జాతి, కులం, వర్గం భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగిస్తామని ఇందుమూలం గా ప్రతిజ్ఞ చేస్తున్నాము అని ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ప్రజాపక్షం/వంగూర్ :** శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి సర్వారెడ్డిపల్లి గేటు సమీపంలోని నెల్లిగుట్టపై గతరెండురోజులనుంచి జరుగుతున్న షరీఫ్ ఉర్సు ఉత్సవాల్లో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణపాల్గొని దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వారెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణ సంపత్ రావు, వంగూరు సర్పంచ్ పురుగులయాదయ్య, తహసీల్దార్ మురళిమోహన్, ఉపతహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఉపసర్పంచ్ లింగం, భీమయ్యయాదవ్, పాండు, ఉత్సవ నిర్వాహకులు , కాంగ్రెస్‌పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలందరూ భక్తిభావం కలిగి ఉండాలి





**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రజలందరూ భక్తిభావంకలిగి ఉండాలని ఐక్యతఫౌండేషన్‌చైర్మన్, టాస్కసిఓఓ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఊర్కొండ మండలపరిధిలోని ఊర్కొండపేట శ్రీశ్రీశ్రీపబ్బతి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరై పూర్ణాహుతి మహోత్సవంలోపాల్గొని స్వామివారిని దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులను తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరిపై స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని ఆభగవంతుని కోరుతానని అన్నారు. స్వామివారి దర్శనానికి విచ్చేయుచున్న భక్తులు తాగునీటి సౌకర్యంకోసం ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటిచైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది మారుతి రావు, వరలక్ష్మి , అర్చకులు దత్తాత్రేయశర్మ, శ్రీనివాసశర్మ, ప్రవీణ్‌శర్మ, ఆలయకమిటిసభ్యులు వెంకటమ్మ, బంగారయ్య, ఆంజనేయులు, వెంకటమ్మ, మల్లేష్, రమేష్, రజిత,చంద్రశేఖర్, శ్రీశైలం పాల్గొన్నారు.

## ఇంటింటికి తిరుగుతూ ఇందిరమ్మ చీరల పంపిణీ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో తాత్కాలికంగా నిలిచిపోయిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం గ్రామాలలో మళ్లీ ప్రారంభమైంది. ఎన్నికల ముందు మహిళా సంఘం సభ్యుల కోసం అందిన ఇందిరమ్మ చీరలను ప్రస్తుతం బుక్ కీపర్లు ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులైన మహిళలకు పంపిణీ చేస్తున్నారు. మండల కేంద్రం వీపనగండ్లలో బుక్ కీపర్ బాలీశ్వరమ్మ ద్విచక్ర వాహనంపై ఇందిరమ్మ చీరలను తీసుకెళ్లి మహిళా సంఘం సభ్యుల ఇళ్లకు వెళ్లి చీరలను అందజేయడం జరుగుతోంది. ఈ విధానంలో మహిళలు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా సౌకర్యంగా చీరలు అందుకుంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ సంక్షేమ కార్యక్రమం పేద మహిళలకు పేద మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

# చేనేత రుణమాఫీ చెక్కు అందజేత

చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/అమరచింత :** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మత్స్య, పశు సంవర్ధక, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. చేనేత కార్మికులు బ్యాంకులలో తీసుకున్న లక్షలోపు రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తూ శుక్రవారం రెండు కోట్ల 28 లక్షల రూపాయల చేనేత రుణమాఫీ చెక్కులను బ్యాంకు మేనేజర్ కు మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదగా అందజేశారు. అమరచింత పట్టణంలోని 101 చేనేత కార్మికులకు మొదటి దఫాగా 67 లక్షల 2 వేల ఎనిమిది వందల చెక్కును చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత కార్మికులందరూ రుణమాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. చేనేత కార్మికుల అభివృద్ధి కై ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలను మంజూరు చేయుటకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఉపసంచాలకులు గోవిందయ్య, బ్యాంక్ మేనేజర్ శివ శంకర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవరకొండ మోహన్, చేనేత కార్మికులు పారుపల్లి సత్యన్నా, క్యామ కుమార్, పారుపల్లి శ్రీనివాసులు, చిలువరి నాగరాజు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23 వనపర్తి 7ఎ



## బీమా, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** తెలంగాణ గ్రామీణ చిన్నపొర్ల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సామాజిక భద్రతా పథకాలు, ఇన్సూరెన్స్, పొదుపు సంఘాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ గాండ్ల నికిత ప్రశాంత్ మాట్లాడుతూ, బ్యాంక్ ఖాతాలను సద్వినియోగం చూసుకోవాలని, ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలి సూచించారు. ఈ సందర్భంగా ఉట్కూర్ ఎస్సై రమేష్ మట్లాడుతూ, అనుమానస్పద కాల్స్‌కు ఓటీపీలు చెప్పకూడదని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంక్ మేనేజర్ వెంటకరమణ, ఫీల్డ్ ఆఫీసర్ స్వాతి, సిఎఫ్ ఎల్ కౌన్సిలర్ ఎం.లక్ష్మి సుల్తాన, సఖి అధికారి ప్రగతి, చైల్డ్ అధికారి అనిత, ఉప సర్ప్చ గజ్జి సంజీవ్, వార్డు మెంబర్ గాజుల బందే నవాజ్, మంచాల గణేష్, రామ్ నరేష్ ప్రజలు పాల్గొన్నారు.



## కొత్తకోట మున్సిపాలిటీలో బిఆర్ఎస్ భారీ బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట నుండి మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కొత్తకోట మున్సిపాలిటీలో వెయ్యి బైక్‌లతో గల్లీ గల్లీ తిరిగిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్టణ బిఆర్ఎస్ శ్రేణులు, అనంతరం ఏటీఆర్ గార్డెన్స్ లో కొత్తకోట మున్సిపాలిటీ బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

**ప్రజాపక్షం/వెల్దండ :** ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధ మని దానికి ప్రతీ ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని తహశీల్దార్ కార్తీక్‌కుమార్, మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అదేశాల మేరకు ఈనెల 25న ప్రభుత్వ సెలవు దినం కావడంతో శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై మానవహారం చేపట్టిన విద్యార్థులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి, ఉప సర్పంచ్ బస్సమోని శ్రీనివాస్ ముదిరాజు, వార్డు మెంబర్లు సిరుసనగండ్ల శేఖర్, మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, డీటీ ఆలీ,ఆర్ఐ శంకర్‌నాయక్,ఎంపీఓ లక్ష్మన్, జీపీఓలు కిషన్, వినయ్‌కుమార్,శ్రీను, ఆంజనేయులు ముత్తమ్మ, శోభ, శ్రీలత, గంగాధర్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లయ్య, కిష్టాల్, నారాయణ,శేఖర్ పాల్గొన్నారు.

## మరికల్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.భగవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మరికల్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎమ్.భగవంత్ రెడ్డి శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన సిఐకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలను సమర్థవంతంగా పరిరక్షించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని, ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. ఎం.భగవంతు రెడ్డి గతంలో మహబూబ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించి, బదిలీపై మరికల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు మరికల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మరికల్ ఎస్సై రాము, ధన్వాడ ఎస్సై రాజశేఖర్, నర్వ ఎస్ఐ పబ్బతి రమేష్, మరికల్ ఎస్సై 2 మహేశ్వరి పూల మొక్కలు అందించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

# రోడ్డుపై జాగ్రత్తే కార్మికుడి ప్రాణ రక్షణ

జిల్లా ఎస్పీ సునీత రెడ్డి




**ప్రజాపక్షం/కొత్తకోట :** రోడ్డు భద్రత పై కార్మికులకు, చెరుకు వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించిన ఎస్పీ రోడ్డు భద్రత వారోత్సవాల్లో అలైవ్ అరైవ్ కార్యక్రమం 8వ రోజు అవగాహన పరిశ్రమల ప్రాంతాల్లో రోడ్డు భద్రతకు గురించి కార్మికులు, డ్రైవర్లకు అవగాహన ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రత్యేక దృష్టి రోడ్డు ప్రమాదాలు ఒక్క కుటుంబానికే కాదు, సమాజానికి తీరని నష్టం కలిగిస్తాయని వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి, ఐపీఎస్ అన్నారు. కొత్తకోట మండలం రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా 8వ రోజు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తకోట మండలం అప్పారాల కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు, ఫ్యాక్టరీ ఉద్యోగులు, చెరుకు రవాణా చేసే వాహనాల డ్రైవర్లు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. అనంతరం వాహనం పై ఎక్కడికెళ్లినా హెల్మెట్ తప్పకుండా వినియోగించే టీవీ 9 రిపోర్టర్ కురుమూర్తిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరిశ్రమల ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు. వాహనాలను వేగంగా నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంలో నిర్లక్ష్యం వంటి కారణాల వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కార్మికులు విధులు ముగించుకుని సురక్షితంగా ఇంటికి చేరడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడమే లక్ష్యంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగం ఎంత ముఖ్యమో ఆ ఉద్యోగి ప్రాణం అంతకన్నా విలువైనది. వేగం కాదు జీవితం గెలవాలని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ, రాంబాబు, కొత్తకోట ఎస్సై ఆనంద్, షుగర్ ఫ్యాక్టరీ లీగల్ అడ్వైజర్, భాస్కర్, పోలీస్ సిబ్బంది, షుగర్ ఫ్యాక్టరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రజాపక్షం' పత్రిక ప్రజలపక్షం

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** జాతీయ తెలుగు దినపత్రిక ప్రజాపక్షం ప్రజలపక్షం అని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపక్షం జాతీయ తెలుగు దినపత్రిక ప్రజల పక్షాన ప్రజలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతుందని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉందని అన్నారు. క్యాలెండర్ యాడ్స్‌కు సహకరించిన అందరికీ రిపోర్టర్ మారోజు మల్లయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మనగోటి జోజి, సీనియర్ నాయకులు వల్లంభట్ల రవిందర్ రావు, బొమ్మగాని లక్ష్మయ్య, ధర్మారం ఉపసర్పంచ్ కత్తుల నరేష్, లాదినేని పూర్ణయ్య, మందుల జానయ్య, మందుల చంద్రయ్య, సంద యాదగిరి పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని ఘడియగౌరారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిడిపిఓ సక్కుబాయ్, ఆ గ్రామ ఉపసర్పంచ్ ఆదిరాల కృష్ణయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిరాల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపైన, సామాజిక సమస్యలపైన పత్రికలు ప్రజలకు అవగాహనపరిచి చైతన్యపరచాలన్నారు. తెలుగు భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని పరిరక్షించడంలో పత్రికలు తోడ్పడుతాయన్నారు. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య పత్రిలకు వారధిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి కుర్మేటి సురేష్, ప్రజాపక్షం విలేకరి ఆరెకంటి రాధాకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్వాడి టీచర్స్ లక్ష్మమ్మ, పల్లపు వెంకటమ్మ, ఉజ్జిని వీణ, ఆయాలు ఆదిరాల పద్మ, ప్రేమలత, ప్రసన్న పాల్గొన్నారు.

## కెటిఆర్‌పై వేముల వీరేశం ఘాటు వ్యాఖ్యలు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో చట్టం ముందు దోషిగా నిలవాల్సిందే : ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ విచారణకు హాజరవుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీరుపై నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. తాను ఏదో గొప్ప పని చేసినట్టుగా కెటిఆర్ మాట్లాడటం సరికాదని స్పష్టం చేశారు.1885 టెలిగ్రాఫ్ యాక్ట్ ప్రకారం దేశ భద్రతకు ముప్పు కలిగించే క్రిమినల్ కార్యకలాపాలు ఉన్నప్పుడు మాత్రమే ఫోన్ ట్యాపింగ్‌కు అవకాశం ఉంటుందని ఆయన గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి లేకుండా సామాన్యుల నుంచి రాజకీయ నేతల వరకు ప్రతి ఒక్కరి ఫోన్లను ట్యాప్ చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఈ వ్యవహారంలో తాను కూడా బాధితుడేనని తెలిపారు. 2000 సంవత్సరం కేంద్ర ప్రభుత్వ చట్టం ప్రకారం ఈ కేసులో కేటీఆర్ చట్టం ముందు తప్పనిసరిగా బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బద్నాం చేయాలనే ఉద్దేశంతోనే కెటిఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణ సమాజానికి కేటీఆర్ చేసిన నష్టం మరిచిపోలేనిదని వ్యాఖ్యానించారు. మీ చెల్లెలే చెప్పింది సొంత బావ ఫోన్ కూడా ట్యాప్ చేశారని. దీనిపై కేటీఆర్ సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు.దాదాపు 6,000 మందికి పైగా ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కెటిఆర్ చట్టం ముందు దోషిగా నిలబడే పరిస్థితి తప్పదని వేముల వీరేశం అన్నారు.

## కొర్ర లక్ష్మికి ఎమ్మెల్సీ సత్యం నివాళి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలోనీ కొర్ర తండా గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కుర్ర లాలు మాతృమూర్తి, కొర్ర లక్ష్మి చిత్రపటానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొర్ర లక్ష్మి మరణం బాధాకరమని, వారు సిపిఐ పార్టీతో ప్రత్యేక అనుబంధంతో మెలిగే వారని గుర్తు చేశారు. అదేవిధంగా సిపిఐ నాయకుడు కొర్రలాలు మాతృమూర్తి ఇటీవల మరణించడంతో వారిని కూడా కలిశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, సిపిఐ నాయకులు, సర్పంచ్ శంకర్, లాలు, కిషన్ పాల్గొన్నారు.

## రాజేష్ కుటుంబానికి న్యాయం జరగాలి

అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్

**ప్రజాపక్షం/మునగాల:** కర్ల రాజేష్ లాకప్‌డెత్‌లో అధికారులను కాపాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లు మౌనం వీడాలని, కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకూ ఉద్యమాలు నిర్వహిస్తామని మున్నూరుకాపు అధ్యక్షులు వేల్పుల సురన్న, బొర్ర బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో అఖిలపక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కర్ల రాజేష్ లాకప్‌డెత్‌లో నాటి కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఎస్‌పి నర్సింహ్మా పాత్ర ఉందని, నిజానికి కర్ల రాజేష్‌ను అక్రమంగా ఏ ఫిర్యాదు లేకుండా చట్ట విరుద్ధంగా చిలుకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం డిఎస్‌పి, ఎస్‌పి లకు తెలుసునని అన్నారు. కేసును పక్కదారి పట్టించేందుకు మొదటి నుండి అన్నివిధాలుగా ప్రయత్నాలు చేశారని, అందులో బాగంగానే రాజేష్ పోస్టుమార్టంకు ముందు ఎస్పి గాంధి హాస్పటల్‌కు ఎస్ఐ, సిఐలను పంపించారని అన్నారు. పోలీసులే గాంధీ హస్పటల్‌కు డాక్టర్లను, ముషిరాబాద్ మేజిస్టేట్‌కు మేనేజ్ చేసి పోస్టుమార్టం చేయించుకున్నారని అన్నారు. ఆ రోజు డ్యూటీలోలేని లక్ష్మికాంత్‌రెడ్డి డాక్టర్‌ను పిలిపించి పోస్టుమార్టం చేయించారు. ఈ కేసును కప్పిపుచ్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేయడంతో తమ విధుల్లో నిర్లక్ష్యం వహించిన డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డిని ఎ3, ఎస్‌పి నర్సింహ్మాను ఎ4 గా రాజేష్ లాకప్ డెత్ కేసులో చేర్చాలని కోరారు. ఫిబ్రవరి 5న జరగబోయే కలెక్టరేట్ మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సుంకరి అజయ్‌కుమార్, పాతకొట్ల నాగరాజు, కొత్తపల్లి అంజయ్య, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తొగరు రమేష్, సిపిఐ మండల నాయకులు సిహెచ్ సీతరాం,ఎలిపె రామయ్య పాల్గొన్నారు.



# మహిళల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి

ఇందిర మహిళాశక్తి సంబురాలు

7832 స్వయం సేవక సంఘాలకు 12510 చీరెల పంపిణీ

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని భారీ నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపిడివో కార్యాలయం ప్రాంగణంలో ఇందిర మహిళ శక్తి సంబురాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న ఇందిరమ్మ చీరెలను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 7832 స్వయం సహాయక మహిళ సంఘాలు ఉన్నాయని, ఆయా సంఘాల్లోని సభ్యులకు 12,510 చీరెలను అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్న లేకున్నా తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ చీరెలను అందజేయనున్నట్లు తెలిపారు. ఎక్కువ కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి త్వరితగతిన చీరెలను అందజేయాలని సిబ్బందిని అదేశించారు. రెండు, మూడు రోజుల తర్వాత చీరెలు రానివారు తన ఆఫీసుకు రావాలని కోరారు. హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధే తమ ధ్యేయంగా కోట్లాది రూపాయలతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఒక్కొక్కటి వివరించారు.హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని పిల్లలు కోసం నూతన జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్మించడం జరుగుతుందన్నారు. హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో సిటి స్కాన్, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, 28 కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రింగ్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారందరికి ఇళ్లు ఇస్తామన్నారు. ఇళ్లులేని వారందరికి రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న ఇందిర మోడల్ కాలనీలో ఇల్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రాధిక అరుణ్‌దేశ్‌ముఖ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపిపి గుడెపు శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు తన్నీరు మల్లిఖార్జున్, చిన్నం శ్రీనివాసరావు, కారింగుల వెంకన్న, మేళ్లచెరువు ముక్కంటి, కొల్లపూడి యోహాన్, మోప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## కౌన్సిలర్ అభ్యర్థులను సర్వే ఆధారంగా ఎంపిక చేస్తాం



మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే కౌన్సిలర్ అభ్యర్థులను సర్వే ఆధారంగా ఎంపిక చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ, మైనార్టీ దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. పార్టీ బలంగా ఉంటే మనం బలంగా ఉంటామని మున్సిపాలిటీలోని 48 వార్డులోల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించి సత్తా చాటాలన్నారు. తాను అందరికి అందుబాటులో ఉంటానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు గెలుపు కోసం మూడు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి వార్డుకు పది మంది చొప్పున 480 మందిని నియమించామని వారు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరింస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తుందన్నారు. సమావేశంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పగిడి రామలింగయ్యయాదవ్, మహబూబ్‌అలీ, ధీరావత్ స్కైలాబ్‌నాయక్, గాయం ఉపేందర్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తలకొప్పుల సైదుల, గుడిపాటి నవీన్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా, మోయిజ్, కోల వెంకన్న పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయిలో బొట్టుగూడ పాఠశాల



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రంలో నిర్మించిన బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ప్రాథమిక,ఉన్నత పాఠశాల కార్పొరేట్ స్థాయిలో బాగుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం అయన బొట్టుగూడా కోమటి రెడ్డి ప్రతీక్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల నిర్మాణం కార్పొరేట్ స్థాయిలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు .తరగతి గదులు, లైబ్రరీ తదితర గదులను ఆయన తిరిగి పరిశీలించారు. తరగతి గదుల్లో వేసిన రంగులు, విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఆట వస్తువులు, ల్యాబ్, లైబ్రరీ పుస్తకాలు చదువు పట్ల ఆసక్తిని పెంచే విధంగా ఏర్పాటు చేసిన చిత్రాలు, స్లొగన్స్ అన్ని బాగుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆర్ అండ్ బి డిప్యూటీ ఇంజనీర్ గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలి :**
అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం తన చాంబర్ నుండి జిల్లా అధికా రులతో జిల్లాలో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, పారిశుధ్యం,తాగునీరు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 2023/24లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమగ్రంగా సమీక్షించనున్నట్లు చెప్పారు.అలాగే 2025/26 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను ఇగ్రామస్వరాజ్ పోర్టల్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సాధారణ ఐహెచ్‌హెచ్‌ఎల్‌లు, ఇందిరమ్మ గృహ నిర్మాణ ఐహెచ్‌హెచ్‌ఎల్‌లు,సామాజిక పారిశుధ్య సముదాయాలు,సామాజిక ఇంకుడు గుంతలు, గ్రామ పంచాయతీ భవనాలు,విఓ భవనాలు, ఎంఎస్ భవనాలు,అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణ పురోగతిపై సమగ్రంగా తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జెడ్పి సీఈవో బి .శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఈఈ గిరిధర్, సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఏపీఓలు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవం

గంధం ఉత్సవంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/పాలకవీడు:** ఉర్సు ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఉర్సు షరీఫ్‌లో గంధం మహోత్సవం కావడంతో దాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దర్గాప్రాంతామంత జనసంద్రంతో హోరేత్తింది. దర్గా వక్ఫ్‌బోర్డు, దర్గా ముజావర్లు, కాంట్రాక్టర్లు తెచ్చిన గంధాన్ని దర్గా సమీపంలోని చందన్‌ఖాన్‌లో పెట్టి వక్ఫ్‌బోర్డు నుండి తెచ్చిన గంధాన్ని ముజావర్లు మత పెద్దలతో భారీ నీటిపారుదలశాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా లతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఆయనతో పాటు స్థానిక తహసిల్దార్, ఎంపిడివో, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధాన్ని గుర్రంపై పెట్టెను ఎక్కించి జాన్ పహడ్ దర్గా చుట్టుపక్కల గ్రామాలైన జాన్‌పహడ్, కల్మెట్‌తండా, చెర్వు తండాలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లిన గంధం బిందెలను తాకేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రయత్నించారు. ముస్లీం మతపెద్దలు ప్రత్యేక ప్రార్ధనలు చేసి దర్గాలోని బాబా సమాదులపై చల్లారు.

**దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**
దర్గాలో ప్రత్యేక పూజలు చేసి గంధం మహోత్సవంలో పాల్గొన్న భారీ నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్షకు పైగా హాజరైన భక్తులు ఉర్సు ఉత్సవాల్లో రెండవ రోజు ఉర్సీ షరిఫ్‌లో భాగంగా గంధం ఊరేగింపు కావడంతో భక్తులు గురువారం రాత్రి చేరుకున్నారు.శుక్రవారం ఉదయం భక్తులతో జాన్‌పహడ్ ప్రాంతం జనసంద్రంతో మునిగిపోయింది. మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు మేకపోతులు, పోటేళ్లను కందురు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. దర్గా పక్కనే ఉన్న నాగులపుట్టకు పాలు, గుడ్లు పూలు వేశారు.

**పటిష్ట బందోబస్తు :** జాన్‌పహడ్ ఉర్సు ఉత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా పట్టిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. బందోబస్తును జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి డిఎస్‌పిలను, సిఐలను, ఎస్‌ఐలతో పాటు 500 మంది పోలీస్ సిబ్బందితో నిర్వహించారు. దర్గా ప్రాంతంలో మైకుల ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తూ వారిని అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్,ఎస్పి క్షేత్రస్థాయిలో పరిశీలన



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** తెలంగాణ శ్రీశైల క్షేత్రంగా విరాజిల్లుతోన్న నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీజడల రామలింగేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబయింది. ఈ 23 నుండి ప్రారంభమై 30వ తేదీ వరకు జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తులకు వసతులు, ఆలయానికి రంగులు, ఆహ్వానాలు, పారిశుధ్యం, మంచినీటి వసతిలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు జరుగుతున్న పనులను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ప్రత్యేక శ్రద్ధతో జాతరపై తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పోలీస్ యంత్రాంగం రద్దీ రోజుల్లో ఇబ్బందులు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిని సారించారు. ఈఏడాది జాతరకు సుమారుగా 12 లక్షల వరకు భక్తులు రావచ్చనే అంచనాను అధికారులు వేస్తున్నారు. ముఖ్యంగా కళ్యాణం, అగ్నిగుండాల రోజున భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. జాతర విశేషాలను ప్రజలకు తెలిసేలా ప్రచార రథాల ద్వారా భారీ కటౌట్ ల ద్వారా తెలియపరిచారు. ఈ క్షేత్రంలో ప్రతి ఏటా మాఘశుద్ధ సప్తమి (రథసప్తమి) గడియల్లో కళ్యాణం నిర్వహించడం ఈ క్షేత్రం ప్రత్యేకత.

## ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది

**ప్రజాపక్షం/చండూరు:** ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని భారత రాజ్యాంగం కల్పించిన ఈ ఓటు హక్కుని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చండూరు సర్కిల్ సిఐ ఆదిరెడ్డి, చండూరు మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం , ఎంఈఓ సుధాకర్ రెడ్డి అన్నారు. పాత్రికేయులు రాపోలు ప్రభాకర్ ,జర్నలిస్టు కేశాని శ్రీధర్ రెడ్డి సంయుక్తంగా రూపొందించిన ఓటర్ అవగాహన కరపత్రాన్ని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పనిసరిగా ఓటు హక్కు కలిగియున్న ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు ఆవశ్యకత గురించి వివరించారు. ప్రతి సామాన్యుడికి తెలియ జేసేలా కరపత్రాన్ని రూపొందించిన జర్నలిస్టులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న , చేనేత పరిరక్షణ సేవాసమితి అధ్యక్షుడు చెరుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో ముందుకు....

మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతన కమిషనర్‌గా బి.శరత్ చంద్ర





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతన కమిషనర్‌గా బి.శరత్ చంద్ర బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మార్గదర్శకాలు,సూచనల ప్రకారం నల్లగొండ పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రధానంగా పట్టణంలో ఉన్న తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం,ప్రతి వార్డులో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడం,అలాగే పెండింగ్‌లో ఉన్న రెగ్యులర్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడం పై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.నూతన కమిషనర్ నాయకత్వంలోమున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని అధికారులు,సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని గుడిమల్కాపురం సబ్‌స్టేషన్ నందు సోలార్ ప్లాంట్ కొరకు కొత్తగా 11కెవి లైన్ వేస్తున్న సందర్భంగా 11కెవి తమ్మారం ఫీడర్ ప్రాజెక్టు వైపు, 11కెవి ప్రాజెక్టు ఫీడర్ నెమలిపురి కాలనీ వైపు శనివారం (నేడు) మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సైదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## చేనేత కార్మికుల రుణమాఫీ చెక్కులు ఖాతాలో జమ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భువనగిరి, పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చేనేత కార్మికుల రుణమాఫీ రూ.7 కోట్ల 60 లక్షల 23 వేల చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్ తెలిపారు. లక్ష రుణ మాఫీకి 824 మంది పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి, 66 మంది భువనగిరి మున్సిపాలిటీ పరిధి కలిపి 890 మంది కార్మికులకు ఖాతాలో జమ చేసేందుకు చెక్కులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. పోచంపల్లి మున్సిపాలిటీ చేనేత కార్మికుల ఋణ మాఫీకి రూ.7 కోట్ల 24 లక్షల 75 వేలు, భువనగిరి 66, 35 లక్షల 48 వేలు అని చెప్పారు. రుణమాఫీకి సంబంధించిన చెక్కును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం చేనేత కార్మికుల సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు. బ్యాంకులకు వరుస సెలవు రోజులు ఉండటంతో బ్యాంక్ అధికారులతో మాట్లాడి శుక్రవారం ఖాతాలో జమ అయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల కొడుకు ముందే చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లక్ష రుణమాఫీ డబ్బులు బ్యాంకుఖాతాలో జమ కావడంతో భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, పోచంపల్లి సహకార సంఘం మాజీ అధ్యక్షులు భారత వాసుదేవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బైరు వెంకన్న గౌడ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిఆర్ఎస్ నాయకుడు బైరు వెంకన్న గౌడ్ ఆ పార్టీని వీడి శుక్రవారం కాంగ్రెస్ గూటికి చేరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం (రెడ్ హౌస్)లో ఏఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌లు ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బైరు వెంకన్న గౌడ్ మాట్లాడుతూ తిరిగి తన స్వంత గూటికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తాన న్నారు. ఈ





కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ అబ్దుల్ రహీం, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీని వాస్, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్ పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

**ప్రజాపక్షం/నకిరేకల్:** సార్వజనీన ఓటు హక్కే ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. శుక్రవారం తాటికల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, కులమత వర్గ భేదాలకు అతీతంగా ఓటు హక్కును నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాటికల్ జిపిఓ కాశయ్య, ఉపాధ్యాయులు ప్రజ్ఞపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డా. సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
24-01-2026
www.prajapaksham.in

"అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'డెకాయిట్'. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. తాజాగా మృణాల్ ఠాకూర్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. ఒక భారీ షెడ్యూల్లో తన షూటింగ్ ఫినిష్ చేశారు."

రీల్

# ఫిబ్రవరి 14న 'లవ్ స్టోరీ' రీ-రిలీజ్



యువ సామ్రాట్ నాగ చైతన్య కెరీర్లో మరపురాని మైల్ స్టోన్ మూవీ 'లవ్ స్టోరీ'. ఈ చిత్రంలో నాగ చైతన్య తెలంగాణ గ్రామానికి చెందిన ఫోక్ డాన్సర్గా పూర్తిగా కొత్త పాత్రలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమాను అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అయింది. విమర్శకులు, ప్రేక్షకులు, అభిమానులు ప్రశంసల వర్షం కురిపించారు.హీరోయిన్ గా సాయి పల్లవి అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. చైతన్య సాయి పల్లవి మధ్య కెమిస్ట్రీ, కులవర్గ భేదాలను దాటిన ప్రేమ కథను మరింత హృదయాన్ని తాకేలా చేసింది. గ్రామీణ తెలంగాణ జీవనశైలిని నిజాయితీగా, సున్నితంగా తెరపై ఆవిష్కరించారు దర్శకుడు శేఖర్ కమ్ముల. సంగీత దర్శకుడు పవన్ అందించిన అందించిన నీ చిత్రమ్ చూసి, సారంగ దరియా సినిమా విడుదలకు ముందే చార్ట్బస్టర్గా మారాయి. ఇప్పటికీ అన్ని ప్రముఖ మ్యూజిక్ ప్లాట్ఫార్మ్లలో ట్రెండ్ అవుతున్నాయి. ఈ ఆల్ టైమ్ క్లాసిక్ రొమాంటిక్ సాగా ఫిబ్రవ రి 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రీరిలీజ్ చేస్తున్నారు. కోవిడ్ కాలంలో, 2021లో విడుదలైన ఈ చి త్రం సవాళ్లను దాటుకొని బాక్సాఫీస్ వద్ద ఘన విజ యం సాధించింది. SVCLLPఎస్ వి సి ఎల్ ఎల్ పీ , అమిగోస్ క్రియేషన్స్ బ్యానర్లపై ని ర్మాతలు నారాయణ్ దాస్ కె నార ఒగ్, పుస్కూర్ రామ్ మోహన్ రా వు ఈ చిత్రాన్ని ఒక ప్రేమకావ్యంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు వాలెంటైన్స్ డే రోజున లవ్ స్టోరీ థియేటర్లలో సందడి చేయనుంది.

# కాల్ ఘూట్ చాప్టర్ 3 హిట్ అవుతుంది: దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు

వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో నటించిన బ్లా క్ బస్టర్ సిరీస్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వ హించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కో వెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్‌కు మార్ నిర్మించారు. ఈ సిరీస్ కి వచ్చిన రెండు సీజన్స్ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. కానిస్టేబుల్ కనకం చాప్టర్ 3 కాల్ ఘూట్ సినిమాగా థియేటర్స్ లో రిలీజ్ చేయబోతున్నారు. అలాగే రెండు సీజన్స్ కలిపి థియేటర్స్ లో సినిమాగా రిలీజ్ చేయబోతున్నారు. కాల్ ఘూట్ చాప్టర్ 3 గ్లింప్స్ని ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వినిదత్ లాంచ్ చేశా రు.ఈ సందర్భంగా ద ర్శకేంద్రుడు కె. రాఘవే ంద్రరావు మాట్లాడుతూ నేను అశ్వినీదత్ కలిసి ఫస్ట్ ప్రిన్స్ మహేష్ బాబుని పరిచయం చేశాం. తర్వాత పెళ్లి సందడి గంగోత్రి.. ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు చేశాం. సాయిబా బాకి ఈటీవీకి ఉంది. తన అనుభవాన్ని అంతా కలబోసి కానిస్టేబుల్ కనకం అనే సక్సెస్ఫుల్ ఫిల్మ్ చేశారు. వర్ష చా లా మంచి ఆర్టిస్ట్. తను చాలా బిజీ కాబోతోంది. 30 ఏళ్ల క్రితం శాంతినివాసం సీరియల్‌తో ఈటీవీతో మా జర్నీ మొదలైంది. శాంతి నివాసానికి రాజమౌళి డైరెక్టర్. నేను అనుకున్న దాని కంటే అద్భుతంగా తీశాడు. ఈరోజు ఇండియాలోనే అగ్ర దర్శకుడుగా ఉన్నారు. శాంతి నివాసానికి హేమంత్ ఎడిటింగ్ చేశాడు. అప్పటి నుంచి మా జర్నీ ఉంది. ఇ ప్పటి దర్శకుడు చాలా అద్భుతంగా తీస్తున్నారు. వర్షా బొ ల్లమ్మ మాట్లాడుతూ చాప్టర్ 3 కాల్ ఘూట్ చాలా పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను. చాలామంది నేను పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్ చేయాలని అంటుంటారు. కానీ అలాంటి అవకాశాలు సాధారణంగా రావు. నాకు అలాంటి అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చిన ని ర్మాత సాయిబాబా గారికి హేమంత్ కి ఈటీవీ విన్ వారికి మా డైరెక్టర్ ప్రశాంత్ కి చాలా చాలా థాంక్స్. ఈ సిరిస్ చాలా ఎంజాయ్ చేశాను. ఒక నటిగా చాలా సంతృప్తికరించిన సిరీస్ ఇది. రాజీవ్ గారితో వర్క్ చే యడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. అందరికీ పేరుపేరునా థాంక్యూ. చాప్టర్ 3 నాకు ఒక స్ట్రజ్ నేను కిక్ బాక్సింగ్ నేర్చుకున్నాను. అది ఇందులో హెల్ప్ అవుతుంది అని భావిస్తున్నాను. కానిస్టేబుల్ కనకంకు సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్ర శాంత్, ఈటీవీ విన్ సాయి కృష్ణ, రాజీవ్ కనకాల,సురేష్ బొబ్బిలి తదితరు లు పాల్గొన్నారు.



# 'గొల్ల రామవ్వ' ట్రైలర్ రిలీజ్

తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్ర పోషించిన 'గొల్ల రా మవ్వ' తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఈ చిత్ర ట్రై లర్ ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న ముఖ్య అతిథులు పేర్కొన్నారు. స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పో రాటగాథకు దృశ్యరూప ంగా ముళ్లపూడి వరా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రో మాంఛిత వీరగాథను సుచేత డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్ వర్మ డ్రీమ్ క్రియేషన్స్ పతాకాలపై రామ్ విశ్వాస్ హనూర్కర్ , రాఘవేంద్రవర్మ (బుజ్జి) సంయుక్త ంగా నిర్మించారు. యువ ప్రతిభాశాలి అజహర్ షేక్ ఈ చిత్రానికి కార్యనిర్వాహక నిర్మాతగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఈటీవీ విన్ కో సం 'మౌనమే నీ భాష' చిత్రాన్ని నిర్మించి, వీక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన టీమ్ నుం చి వస్తున్న 'గొల్ల రామవ్వ' ఈనెల 25 (జనవరి 25) నుంచి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానుంది. 'తెలుగు సీతామాలక్ష్మి' తాళ్ళూరి రామేశ్వరి టై టిల్ పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వే డుకలో పి.వి.నరసింహారావు తనయులు పి.వి.ప్రభాకరరావు, తనయ ఎమ్.ఎల్.సి. సురభి వాణీదేవి, ప్రము ఖ గీత రచయితలు కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్, ప్ర ముఖ నటులు రాజీవ్ కనకాల, 'రజాకార్' దర్శకులు యా టా సత్యనారాయణ, సీనియర్ దర్శకులు ఉదయభాస్కర్ పా ల్గొన్నారు. మా నాన్న రాసిన గొప్ప కథల్లో ఒకటైన 'గొల్ల రామవ్వ'ను ఎంతో గొప్పగా తెరకెక్కించారని వాణీదేవి ప్రశంసించారు. ఈనెల 25 నుంచి ఈటీవీ విన్‌లో ప్రసారం కానున్న ఈ చిత్రం ప్ర సారం కానుంది.అల్లు గీత, అన్విత్, మణి మంతెన, గానం : వరం, స ంగీతం: సాయి మధుకర్ ఛాయాగ్రహణం: గంగమోని శేఖర్, కూర్పు: రాఘవేంద్రవర్మ, రచన: బయ్యవరపు రవి, దర్శకత్వం: ముళ్ళపూడి.





# రాజమౌళితో పోల్చడం సరి కాదు : అనిల్ రావిపూడి

ప్రముఖ దర్శకుడు రాజామౌళితో తనను పోల్చడం సరికాదని మన శంకర వరప్రద్ గారు సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. వరుస విజయాలు రావంతో ఆ పోలిక వచ్చి ఉండొచ్చేమో కానీ డైరెక్టర్స్ గా ఆ కంపారిజన్ కి ఆస్కారం లేదు. ర్శకుడిగా ఆయన చేసే సినిమాలు వేరు. నేను చేసే సినిమాలు వేరు. డైరెక్టర్ గా ఆ యన ఎంతో ఎత్తున ఉన్నారు. ఆయన నాకు ఇష్టమైన దర్శకుడు. నేను ఇప్పుడే ప్రయాణాన్ని మొదలు పెట్టాను. ఇంకా ఎంతో దూరం ప్రయాణించాలి. వెంటనే చిరంజీవితో సినిమా ఉంటు ందో లేదో తెలియదు కానీ ఫ్యూచర్ లో కచ్చితంగా చిరంజీవితో మరో సినిమా ఉంటుంది. మా ఇద్దరి మధ్య అంత మంచి బాండింగ్ ఉంది. ఈ సంక్రాంతి ఒక ఫిలిం ఫెస్టివల్ లాగా అయింది. దా నిలో నేను కీలక పాత్ర పోషిస్తుండం చాలా ఆనందంగా ఉంది. మన శంకర వరప్రసాద్ గారు సక్సెస్ ఫుల్గా రన్ అవుతున్న నేపథ్యంలో అనిల్ రావిపూడి మీడియాతో మాట్లాడారు. కళ్యాణ్ అభినందించ డం చాలా ఆనందాన్నిచ్చింది. అలాగే ఇండస్ట్రీలో డైరెక్టర్స్, హీరోస్ చాలామంది పర్సనల్ గా ఫోన్ చేశా రు. చిరంజీవికి నేచురల్ గా ఒక టైమింగ్ ఉంటుంది. అలాంటి కథతో ఆయన ప్రజెంట్ చేయగలిగితే అ ద్భుతంగా ఉంటుందని అనిపించింది. అన్ని జనరేషన్ ఆడియన్స్ సినిమాని అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్నారు.చిరంజీవి వెంకటేష్ కలిసి కనిపించబోతున్నారంటే కచ్చితంగా చాలా అంచనాలు ఉంటాయి. అందరికీ నచ్చేలా ప్రజెంట్ చేయడం కూడా పెద్ద టాస్క్. అయితే చిరంజీవి వెంకటేష్ మధ్య ఉన్న నేచురల్ ఫ్రెండ్షిప్ వల్ల నా వర్క్ ఈజీ అయింది. చిరంజీవి ప్రతి సినిమాలో అలాంటి ఒక పెక్యులర్ సీక్వెన్స్ ఉంటుంది. మందు సీన్స్‌లో ఆయన చేసే మ్యానరిజమ్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. ఆ సీక్వెన్స్ వెంకటేష్ కి ఆయనకి మ ధ్య ఉండే కనెక్షన్‌ని కూడా రివిల్ చేస్తుంది. అది థియేటర్లో అద్భుతంగా పేలింది. ఇప్పుడు అందరు సరదాగా రీల్స్ చేస్తున్నారు. అయితే సినిమాలో ఏదో సరదాకి చేస్తాం. పిల్లలు మాత్రం ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని కోరుతున్నాను. రాజమౌళి తర్వాత వరుసగా తొమ్మిది విజయాలు అందుకున్న దర్శకుడిగా రికార్డు సృష్టించారు అని అంటున్నారు. నిజానికి ఇది నాకు కాస్త కృషియల్ ఫేజ్. నెక్స్ట్ ఏం చేయాల నే దానికి గురించి ఒక రెండు పాజ్ ఇచ్చాను. మొన్న ఒక ఐడియా క్రాక్ చేసాము. ఈసారి టైటిల్ అనౌన్స్మెంట్ నుంచి ఒక విచిత్రమైన జర్నీ స్టార్ట్ కాబోతోంది. స్టోరీ లైన్ ఫిక్స్ అయ్యాను. ఇంకా యాక్టర్స్ ఫిక్స్ కాలేదు. జూన్, జూలైలో స్టార్ట్ చేయాలి. అది కూడా మంచి ఎంటర్టైనర్. వచ్చే ఏడాది సంక్రాంతికి వస్తారా? అని ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం లేదు. ఇప్పుడు రిమేక్స్ తగ్గిపోయాయి. ఇలాంటి సమయంలో కూడా రీమిక్స్ చేస్తున్నారంటే పెద్ద రికార్డే. నాకు ప్రతిసారి కొత్త కథ చేయాలనిపిస్తుంది అందుకే నేను రిమేక్స్ చేయడానికి ఇష్టపడను. కొత్త బ్యాక్ డ్రాప్స్ లో సినిమాలు చేయడానికి ఇష్టపడతాను.నిర్మాత ప్రతి పైసా కి నేను కాపలా ఉంటాను. ప్రతిదీ పేపర్ మీద ఉంటుంది. కాబట్టి కంట్రోల్ తప్పదు. ఈ సినిమా బడ్జెట్ పెరగాలన్న తగ్గాలన్న పగ్గాలు డైరెక్టర్ చేతిలోనే ఉంటాయి.చిరంజీవి ఈ సినిమా కోసం రెండు అద్భుత మైన టాలెంట్స్‌ని ఫైండ్ అవుట్ చేశారు. ఆట సందీప్, అద్భుతమైన మాస్టర్ అవుతారని చె ప్పారు. తనకి చాలా మంచి పేరు వచ్చింది.

# 'హలో ఇట్స్ మీ' ఫస్ట్ లుక్ రిలీజ్

జూనియర్ కళాశాల చిత్రంతో హీరోయిన్ గా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న షగ్నశ్రీ వేణున్ దర్శకురాలిగా మారి రూపొందిస్తున్న సినిమా 'హలో ఇట్స్ మీ'. ఈ సినిమాలో వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్నారు. షగ్నశ్రీ హీరోయిన్ గా నటిస్తోంది. దర్శన్ మదమంచి మరో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్ 2 ఎస్ సినిమాస్, శ్వాస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై వీఎస్ కే సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ను హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో లాంచ్ చేశారు. యువతీ యువకులు ఒకరినొకరు అపార్థం చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అనేది షగ్న బ్యూటిఫుల్ గా ఈమూవీలో చూపించింది. ఆమె స్టోరీ నెకట్స్ లెవెల్ లో చెప్పింది. అప్పుడే డైరెక్టర్ గా ఆమెను నమ్మాను. అలాంటి ఆడియెను మిస్ అవుతున్నాను అనుకున్నాను. ఈ చిత్రంలోని పాటలతో ఆ కొరత తీరనుంది. ఈ మూవీ సాంగ్స్ ను కొన్నేళ్ల వరకు వింటూనే ఉంటారు. వంశీకాంత్ అంతమంచి ఆడియో ఇచ్చారు. ప్యాషనేట్ గా ప్రొడ్యూస్ చేస్తున్న మా ప్రొడ్యూసర్స్ సందీప్, సంజీవ్, సంకీర్త్ లకు ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా. మీ అందరి సపోర్ట్ మా టీమ్ కు ఉండాలి. అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజశేఖర్, నటుడు డా. భద్రమ్, నటుడు జశ్వంత్, నటి నందిని, డీవోపీ బ్రహ్మతేజ మరిపూడి , మ్యూజిక్ డైరెక్టర్ వంశీకాంత్ రేఖన , ప్రొడ్యూసర్ సంజీవ్ , ప్రొడ్యూసర్ సందీప్ .నింద దర్శకుడు రాజేశ్ జగన్నాథం, హీరోయిన్, డైరెక్టర్ షగ్న శ్రీ వేణున్ , హీరో దర్శన్ మదమంచి పాల్గొన్నారు.



# మేడారం జాతరకు ఆర్‌టిసి సన్నద్ధం

## 4 వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు

## ఈ ఏడాది 20లక్షల మంది ప్రయాణికులు అంచనా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా మేడారం జాతరకు ప్రత్యేక రవాణా సేవలను అందించేందుకు టిఎస్ఆర్‌టిసి సన్నద్ధమైంది. ఈ మహా జాతర ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు 4రోజుల పాటు సాగనుండగా ఆర్‌టిసి 25వ తేదీ ఆదివారం నుంచి ఫిబ్రవరి1వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు కూడా నడిపించనుంది. ఇందుకు సంబంధించి మేడారంలో తాత్కాలిక బస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. జాతరకు మొత్తం 4వేల బస్సులను నడపనున్న ఆర్‌టిసి ఇందుకు సంబంధించి 51 ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లు గుర్తించింది. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం హైదరాబాద్ నుండి మేడారానికి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. 2024లో జరిగిన జాతరకు ఆర్‌టిసి 3,491 బస్సులను నడిపి, 16.82 లక్షల మంది ప్రయాణికులను తరలించింది. ఈ ఏడాది మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలులో ఉండడంతో 20 లక్షల మంది భక్తులు బస్సుల్లో ప్రయాణించే అవకాశం ఉందని అంచనా వేసిన ఆర్‌టిసి ఈ సారి 4వేల బస్సులను సిద్ధం చేసింది.

### 50 ఎకరాల్లో తాత్కాలిక బస్ స్టేషన్, పార్కింగ్

మేడారం వద్ద 50 ఎకరాలలో తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటుచేసిన ఆర్‌టిసి 20 వేల మంది ప్రయాణికులను ఒకేసారి వెయిటింగ్ ఏరియాల్లో ఉంచే అవకాశం కల్పించింది. 25.76 ఎకరాల పార్కింగ్ స్థలంలో 1,000 బస్సుల పార్కింగ్ చేసేలా ఏర్పాట్లను చేశారు. ఈ జాతరకు 10,441 మంది ఆర్‌టిసి ఉద్యోగులు ఈ



వారం రోజుల పాటు 24 గంటలు సేవలను అందించనున్నారు. ఇందులో 7వేల మంది డ్రైవర్లు, 1811 మంది కండక్టర్లు, 759 భద్రతా సిబ్బంది, ఇతర మెయింటెనెన్స్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, 153 అధికారులు ఉన్నారు. ప్రత్యేక సర్వీసుల నేపథ్యంలో 7 ప్రదేశాల్లో ప్రైవేటు పెట్రోల్ బంక్‌లలో 7 ఆయిల్ టాప్‌అప్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రోడ్ పెట్రోలింగ్ కోసం 12 జిపిలు, 8 ద్విచక్రవానాలను ఏర్పాటు చేశారు. తాత్కాలిక బస్ స్టేషన్‌లో ప్రయాణికుల కోసం టి, టిఫెన్ సెంటర్లు, టాయిలెట్ల సదుపాయాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో భద్రతాకు సంబంధించి పోలీసు శాఖతో సమన్వయం చేసుకున్నారు.

### తాత్కాలిక బస్ స్టేషన్ ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మేడారంతో ఏర్పాటు చేసిన తాతాల్కిక బస్ స్టేషన్, ఆర్‌టిసి ఉద్యోగుల విశ్రాంతి షెడ్లులు, జాతర స్పెషల్ బస్సులను శనివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. అంతకు ముందు మంత్రి సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

# అండమాన్ నికోబార్ దీవులకు 'అజాద్ హింద్' పేరు పెట్టాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అండమాన్ నికోబార్ దీవులకు 'అజాద్ హింద్' పేరు పెట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు, జాగృతి నాయకులు హాజరయ్యారు. అనంతరం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులతో కవిత సమావేశమయ్యారు. నేతాజీ పేరును అండమాన్ నికోబార్ దీవులకు పెట్టాలనే డిమాండ్‌కు ఆమె మద్దతు పలికారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖను కవిత విడుదల చేశారు. అండమాన్ నికోబార్ దీవుల పేరు మార్చాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎప్పటి నుంచో కోరుతున్నారని, జాగృతి కూడా ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్‌కు మద్దతునిస్తున్నామని, ఈ విషయమై ఈ నెల 26న ట్విట్టర్‌లో హ్యాష్ట్యాగ్ మూమెంట్‌ను నడిపిస్తామన్నారు. తమకు ఉన్న నెట్‌వర్క్‌తో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈ డిమాండ్ ను తీసుకెళ్తామన్నారు. అండమాన్ నికోబార్ పేరును బ్రిటీష్ వాళ్లు పెట్టారని, వారి పేర్లను కొనసాగించకుండా మన వీరుడి పేరు ఆ ఐలాండ్‌కు పెట్టాలని కవిత కోరారు. బిజెపి ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ గౌరవార్థం జనవరి 26న అండమాన్ పేరు మార్చుతుందని తాము భావిస్తున్నామని చెప్పారు. ఉన్నతమైన కుటుంబంలో పుట్టి మంచిగా స్థిరపడినప్పటికీ నేతాజీ స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్వహించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలు మహిళలు రోడ్లు ఎక్కితే కానీ 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని, కానీ ఆ రోజుల్లో ఝాన్సీ లక్ష్మీ భాయ్ పేరుతో మహిళలకు సైన్యంలో అవకాశాన్ని కల్పించారని కవిత గుర్తు చేశారు.



# సింగరేణి టెండర్లపై 'సమగ్ర' విచారణ జరపండి!

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి లేఖ

## 2014 నుంచి జరిగిన అన్ని కాంట్రాక్టులపై నిగ్గు తేల్చాలని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో గత పదేళ్లుగా జరిగిన అన్ని టెండర్లు, అధికారిక నిర్ణయాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి శుక్రవారం ఒక లేఖ రాశారు. నైనీ కోల్ బ్లాక్ వివాదంపై స్పందించి, ఇద్దరు సభ్యులతో కూడిన విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విచారణను కేవలం ఆ ఒక్క అంశానికే పరిమితం చేయవద్దని, 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో జరిగిన ప్రతి టెండర్, కాంట్రాక్ట్, అధికారిక ప్రక్రియపైన విచారణ పరిధిలోకి తీసుకురావాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలతో పాటు, ప్రస్తుతం కొనసాగుతున్న టెండర్ ప్రక్రియలను కూడా క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. గత పదేళ్లలో టెండర్ల కేటాయింపుల్లో ఏదైనా అక్రమాలు జరిగి ఉంటే, వాటిని నిగ్గుతేల్చి తెలంగాణ ప్రజల ముందు పెట్టాలని, సింగరేణి ఆస్తులను, సంస్థ ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ విచారణ సాగాలని, ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో పారదర్శకతను పునరుద్ధరించాలని, ప్రజాహితాన్ని కాపాడటం అత్యంత అవసరమని ఎంపి ఆ లేఖలో పేర్కొన్నారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఉన్నత స్థాయి విచారణ బృందం పరిధిని విస్తరించి సమగ్ర విచారణకు ఆదేశించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు

# కేంద్రం ఆమోదం (మొదటి పేజీ తరువాయి)

వేతన సవరణ ద్వారా పెన్షన్ పొందుతారని ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. పిఎస్‌యు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల వేతన సవరణకు సంబంధించి, ఇది 2022, ఆగస్టు 1 నుండి అమలులోకి వస్తుందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది. మొత్తం ఖర్చు రూ.8,17.30 కోట్లు ఉంటుంది. ఇందులో వేతన సవరణ కింద వేతన బకాయిల కోసం రూ.5,822.68 కోట్లు , ఎన్‌పిఎస్ కోసం 250.15 కోట్లు, కుటుంబ పెన్షన్ కోసం రూ.2097.47 కోట్లు ఉన్నాయి. నాబార్డ్ చెల్లింపు రివిజన్ 2022, నవంబరు 1నుండి అమలులోకి వస్తుంది. దీని వల్ల దాదాపు రూ.170కోట్ల అదనపు వార్షిక వేతన బిల్లు, మొత్తం బకాయిల చెల్లింపు దాదాపు రూ. 510కోట్ల వరకు ఉంటుంది. పెన్షన్ సవరణ వల్ల ఒకేసారి చెల్లించాల్సిన బకాయిలు రూ.50.82 కోట్లు, అలాగే నాబార్డులోని 269మంది పెన్షనర్లు, 457 మంది కుటుంబ పెన్షనర్లకు నెలవారీగా అదనంగా రూ.3.55 కోట్లు పెన్షన్ చెల్లింపులు జరుగుతాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నుండి పదవీవిరమణ చేసిన వారి పెన్షన్లు, కుటుంబ పెన్షన్ల సవరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆమోదించబడిన సవరణ ప్రకారం 2022, నవంబరు 1 నుండి అమలులోకి వచ్చేలా బేసిక్ పెన్షన్, కరువు ఉపశమనంపై పెన్షన్, కుటుంబ పెన్షన్ 10శాతం పెంచబడతాయి. మొత్తం ఆర్థిక ప్రభావం 2,696. 82 కోట్లుగా అంచనా వేయబడింది.ఇందులో బకాయిల కోసం ఒకేసారి ఖర్చు రూ.2,485.02 కోట్లు, పునరావృత వార్షిక వ్యయం రూ.211.80 కోట్లు కోట్లు ఉన్నాయి.

# భూభాగమే కీలకం (మొదటి పేజీ తరువాయి)

అబుదాబీలో భద్రతా అంశాలపై అమెరికా–ఉక్రేన్–రష్యా అధికారుల మధ్య చర్చలు సానుకూలంగా జరుగుతాయన్న ఆశాభావాన్ని ఉషకోవ్ వ్యక్తం చేశారు. క్రెమ్లిన్ సమావేశం సూటిగా, నిర్మాణాత్మకంగా, ఫలప్రదంగా సాగిందని ఉషకోవ్ పేర్కొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో ట్రంప్ జెలెన్స్కీతో దావోస్‌లో నిర్వహించిన భేటీ వివరాలు, అలాగే అమెరికా ప్రతినిధులు ఉక్రేన్, యూరోప్ అధికారులతో జరిపిన చర్చల అంశాలు పుతిన్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ చర్చల్లో ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్'కు రష్యాను ఆహ్వానించిన అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. రష్యా ఈ ఆహ్వానాన్ని పరిశీలిస్తున్నప్పటికీ, అమెరికాలో ఫ్రీజ్ చేసిన రష్యా ఆస్తుల నుంచి గాజా పునర్నిర్మాణానికి ఒక బిలియన్ డాలర్లు ఇవ్వాలన్న సూచన వరకూ వివిధ అంశాలను పుతిన్ మళ్లీ ప్రతిపాదించినట్లు సమాచారం.

# కొనసాగించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో మొదటి స్థానంలో ఉంది. వివిధ మంత్రిత్వ శాఖల నుండి ప్రశంసలు అందుకుంటూనే ఉంది' అని ట్రెజరీ బెంచీలు బల్లలు చప్పుడు చేస్తూ స్టాలిన్ అన్నారు. ఒక ప్రాజెక్టు పురోగతి ఆధారంగా కేంద్రం నిధులు విడుదల చేయడం లేదని, తమిళనాడు అభివృద్ధి పట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిధులను వెంటనే విడుదల చేయకుండా తప్పించుకుంటుందని స్టాలిన్ ఆరోపించారు. నరేగా కింద, వేతనాల కోసం రూ.1,026 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కోసం రూ.1,087 కోట్లు నేటికీ విడుదల కాలేదన్నారు. నిధుల జాప్యం వల్ల ఎవరు ప్రభావితమయ్యారు అని ప్రశ్నిస్తూ తమిళనాడు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న సామాన్యులు, రైతులపై పడిందని, మన రాష్ట్రంపై ఈ వివక్ష ఎందుకు అని స్టాలిన్ ప్రశ్నించారు. విబి– జి రామ్ జి పథకాన్ని ప్రవేశపెట్టే దశలోనే డిఎంకె ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేసుకుంటూ, 'అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి తమ గొంతును లేవనెత్తాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును పట్టించుకోకుండా దానిని ఆమోదించింది. ఈ కొత్త పథకం ప్రజల అవసరాల ఆధారంగా లేదు. దీని గురించి నేను ఇప్పటికే డిసెంబర్ 18, 2025న ప్రధానమంత్రికి లేఖ రాశాను' అని స్టాలిన్ చెప్పారు. కొత్త పథకం విబి– జి రామ్ జి కింద, ఉపాధిని 'పని చేసే హక్కు'గా అందించలేదని, కేంద్రం నిర్ణయించే తాత్కాలిక కేటాయింపుపై ఆధారపడి ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, వివిధ నిగూఢ ఉద్దేశ్యాలతో విబి– జి రామ్ జితో భర్తీ చేశారని కూడా స్టాలిన్ అన్నారు. ఈ దేశం కోసం ఆయన నిర్దేశించిన సూత్రాలు, మార్గాన్ని ఎప్పటికీ స్మరించుకోవడానికి ఈ పథకం మహాత్మా గాంధీ పేరుతోనే కొనసాగాలని ఈ సభ పట్టుబడుతోందన్నారు.

# సమాన అభివృద్ధి (మొదటి పేజీ తరువాయి)

హైటెక్స్‌లో జరుగుతున్న 'ఎస్ టెక్ హైదరాబాద్ 2026'కు ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఎస్ టెక్ ఫౌండర్, చైర్మన్ సుమిత్ గాంధీ ఆధ్వర్యంలో ముదిత్ గుప్తా ప్రారంభించిన ప్యానల్ డిస్కషన్‌లో మంత్రి పాల్గొని ప్యాన ల్ సభ్యులు, పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆ ర్కిటెక్చర్, రియల్ ఎస్టేట్, ఫ్యూచర్ ఆఫ్ హైదరాబాద్' అంశంపై జరిగిన ప్యానల్ డిస్కషన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన నిర్మాణరంగ ప్రముఖులు ఎస్‌పి రెడ్డి, దామోదరన్, ఫైసల్ వోహ్రా, రూపాన రెడ్డి,స్నేహిత్ రెడ్డి మేడ, సుప్రజా రావు, వీర్ ప్రకాశ్ యాదవ్,పార్థ కర్మాకర్, స్థానిక ఎంఎల్‌వి అరికెపూడి గాంధీ, న్యాక్ డిజి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్ర గేమ్ చేంజర్ అని, ఔటర్ రింగ్ రోడ్డు నుండి రీజనల్ రింగ్ రోడ్డుకు 39 రేడియల్ రోడ్లు నిర్మాణం చేస్తున్నామన్నారు. ఐటి, ఫార్మా, ఎఐ లాంటి పోటీ రంగాలను ప్రోత్సహిస్తున్నాయని, పెట్టుబడులకు స్వర్గధామం హైదరాబాద్ అన్నారు. హైదరాబాద్ అన్ని రంగాల్లో పురోగమిస్తోందని, రియల్ ఎస్టేట్ అద్భుతంగా ఉన్నదన్నారు. ఇటీవల జరిగిన వేలం పాటలో ఎకరం రూ.174కోట్లు పలికిందన్నారు. హైదరాబాద్‌లో ఎటు చూసినా హై రైజ్ భవనాలు కనిపిస్తాయన్నారు. మధ్యతరగతి, ఉన్నతమధ్య తరగతి వర్గాల కుటుంబాలకు అందుబాటు ధరలో సొంతింటి కల నెరవేర్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. క్యా బినెట్ దృష్టికి ఇక్కడి చర్చను తీసుకువెళ్తానని చెప్పారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వివిధ సంస్థల స్టాల్స్‌ను మంత్రి ప్రా రంభించి కలియ తిరిగారు. ఆర్కిటెక్టులు, బిల్డర్లు ఏర్పాటు చేసిన ఒక్కో స్టాల్ సంబంధిత అంశాలపై మంత్రి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఎస్ టెక్ అనేది ఒక ఎగ్జిబిషన్ మాత్రమే కాదని, ఇది మన ఇండస్ట్రీకి సంబంధించిన కొత్త ఆలోచనలు కొత్త టెక్నాలజీలు, కొత్త అవకాశాలు అన్నీ ఒక చోట కలిసే వేదిక అన్నారు.

# ఎపి మద్యం కేసులో ముగిసిన ఎంపి మిథున్‌రెడ్డి విచారణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైఎస్ఆర్‌సిపి ఎంపి మిథున్ రెడ్డిని ఎపి మద్యం కుంభకోణం కేసులో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు శుక్రవారం విచారించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సుమారు ఏడు గంటల పాటు మిథున్ రెడ్డిని ఇడి అధికారులు విచారించారు. ఈ విచారణ సందర్భంగా పలు అంశాలపై కీలక వివరాలు సేకరించినట్లు సమాచారం. అయితే.. ఎపి లిక్కర్స్ స్కామ్‌కు సంబంధించిన అంశాలపై కోర్టు ఉత్తర్వులు ఉన్నందున తానేమీ మాట్లాడలేనని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా.. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన మద్యం అమ్మకాల్లో అవకతవకలు జరిగినట్లు ఇడి అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు కీలక నేతలను విచారించారు. ఈ కుంభకోణంలో ఎవరెవరి హస్తం ఉంది? నిధుల మళ్లింపు ఎలా జరిగింది? అనే కోణంలో ఆధారాలు సేకరిస్తున్నారు. వైసిపి మాజీ ఎంపి విజయసాయిరెడ్డిని గురువారం ఇడి సుదీర్ఘంగా విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈ విచారణలో ఆయన చెప్పిన అంశాలను ఆధారంగా చేసుకుని ఇడి అధికారులు దర్యాప్తును మరింత వేగవంతం చేస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com